www.vishvambhara.com
తెలుగు దినపత్రిక
# విశ్వంభర
అక్షరం సాక్షిగా..
శుక్రవారం
20-09-2024
సంపుటి : 01 । సంచిక : 138 । పేజీలు : 12 । వెల : 5/- తెలంగాణ / ఆంధ్రప్రదేశ్






# దేశానికే ఆదర్శంగా స్కిల్ వర్సిటీ

## పారిశ్రామికవేత్తలదే కీలక భాగస్వామ్యం

**భవనాల నిర్మాణాలకు దాతలు ముందుకు రావాలి**

బోర్డు సభ్యులు, పారిశ్రామికవేత్తల సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

వర్సిటీకి 150 ఎకరాలు, రూ.100 కోట్లు కేటాయించినట్లు వెల్లడి



**విశ్వంభర, హైదరాబాద్:** రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటు చేసిన తెలంగాణ యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీని దేశంలోనే ఆదర్శంగా తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ఆ బాధ్యతను యూనివర్సిటీ బోర్డుకు అప్పగిస్తున్నట్లు ప్రకటించారు. రాష్ట్రంలోని పారిశ్రామికవేత్తలు, ప్రముఖ కంపెనీలు ఈ యూనివర్సిటీలో భాగస్వామ్యం పంచుకోవాలని, యువతకు నైపుణ్యాలు నేర్పించి ఉపాధి కల్పించేందుకు తమ వంతు సహకారం అందించాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున మిగతా3లో...

## బీహార్‌లో దారుణం.. దళితుల ఇళ్లకు నిప్పు

- బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటా: సీఎం నితీశ్ కుమార్
- దళితులపై దమనకాండను అడ్డుకోవడంలో డబుల్ ఇంజన్ సర్కార్ వైఫల్యం
- బిహార్‌లో సంఘవిద్రోహ శక్తుల ఆగడాలకు ఎన్డీయే ప్రభుత్వం ఊతమిస్తోంది
- మోదీ మౌనం దాల్చారు
- మండిపడ్డ మల్లికార్జున ఖర్గే




అక్టోబరు 2నుంచి 14 వరకు

## దసరా సెలవులు

ప్రకటించిన ప్రభుత్వం



**విశ్వంభర, హైదరాబాద్:** రాష్ట్రంలోని పాఠశాలలు, కళాశాలలకు దసరా సెలవులను ప్రకటిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. మొత్తం 13 రోజుల పాటు సెలవులను ప్రకటించింది. అక్టోబర్ 2వ తేదీ (బుధవారం) నుంచి 14వ తేదీ( సోమవారం) వరకు సెలవులుగా మిగతా2లో...



## దూకుడు పెంచనున్న హైడ్రా

- అక్రమ నిర్మాణాల కూల్చివేతలకు టెండర్లు ఆహ్వానం
- నిబంధనల వెల్లడి

**విశ్వంభర, హైదరాబాద్:** హైదరాబాద్ మహానగరంలో ప్రభుత్వ స్థలాలు, చెరువులు, నాలాలను ఆక్రమించి అనధికారికంగా చేపడుతున్న నిర్మాణాలపై ఉక్కుపాదం మోపుతున్న హైడ్రా ఇకపై మరింత దూకుడుగా వ్యవహరించబోతుంది. తమ మిగతా2లో...

## కశ్మీర్ యువత చేతుల్లో ఇక రాళ్లు ఉండవు

- ఓట్ల కోసం మన సంస్కృతి, విశ్వాసాలను కాంగ్రెస్ పణంగా పెడుతోంది..
- జమ్మూకశ్మీర్‌ను దోచుకోవడమే జన్మహక్కుగా ఆ పార్టీలు భావించాయి..
- మూడు పార్టీల కుటుంబ పాలనలో.. జమ్మూకశ్మీర్ యువత నలిగిపోయారు



**శ్రీనగర్:** ప్రధానమంత్రి నరేంద్రమోదీ గురువారం జమ్మూకశ్మీర్లో పర్యటించారు. శ్రీనగర్లో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ప్రధాని.. కాంగ్రెస్ సహా ప్రతిపక్షాలపై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. ఈ మూడు పార్టీలు తమ సొంత ప్రయోజనాల కోసం ప్రజాస్వామ్యాన్ని నిర్వీర్యం చేశారని దుయ్యబట్టారు. వారి స్వార్థం మిగతా2లో...

## అర్హులందరికీ డిజిటల్ రేషన్ కార్డులు

**అక్టోబరు రెండో తేదీ నుంచి దరఖాస్తుల స్వీకరణ**

**రేషన్ కార్డుల జారీకి పటిష్ఠ కార్యాచరణ**

**సమీక్షా సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి**




## జమిలి ఎన్నికల నిర్వహణ అమలుకు కమిటీ



**కేంద్రమంత్రి కిషన్ రెడ్డి వెల్లడి**

**విశ్వంభర, హైదరాబాద్:** జమిలి ఎన్నికల నిర్వహణ కోసం కేంద్రం ఓ కమిటీని ఏర్పాటు చేయనుందని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. దేశవ్యాప్తంగా ఐదేళ్ల పాటు ఏదో ఒకచోట ఎన్నికలు జరుగుతున్నందున ఎన్నికల కోడ్ అమల్లో ఉండటం విధానపరమైన నిర్ణయాలకు ఆటంకంగా మిగతా2లో...




## తిరుమల శ్రీవారి లడ్డూలో అపవిత్ర పదార్థాలు కలిపారు

- గత ప్రభుత్వ హయాంలో అపచారం
- బాధ్యులను కనిపెట్టి చర్యలు తీసుకుంటాం
- ఏపీ సీఎం చంద్రబాబు

## మిషన్ భగీరథలో భారీ అవినీతి

### 53 శాతం ఇళ్లకు మంచినీరు ఇవ్వలేదు

జేబులు నింపుకోవడానికే ఈ పథకం చేపట్టినట్లుంది

వాస్తవాలు ప్రజలకు తెలియజేసి ప్రతి ఇంటికి మంచినీరు ఇస్తాం

మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి



**విశ్వంభర,హైదరాబాద్:** గత ప్రభుత్వం ఎంతో గొప్పగా ప్రచారం చేసుకున్న మిషన్ భగీరథలో భారీ అవినీతి, అక్రమాలు జరిగాయని రెవెన్యూ, హౌసింగ్, సమాచార, పౌర సంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆరోపించారు. 46 వేల కోట్ల రూపాయల ఈ ప్రాజెక్టులో 15 వేల నుంచి 20 వేల కోట్ల రూపాయల అవినీతి జరిగిందని వివరించారు. తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే మిషన్ భగీరథపై సర్వే నిర్వహించగా 53 శాతం ఇళ్లకు మంచినీరు అందడం లేదని భయంకరమైన విషయాలు వెలుగు చూశాయని వెల్లడించారు. గురువారం వరంగల్ జిల్లా నర్సంపేటలో ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహా, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ తో కలిసి ప్రభుత్వ మెడికల్ కాలేజీని ప్రాంభించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ మిషన్ భగీరథ కార్యక్రమాన్ని ప్రజలకోసం మిగతా2లో...

మరిన్ని తాజా వార్తల కోసం స్కాన్ చేయండి



### నేటి చికెన్ ధరలు

| ఫామ్ ధర | రిటైల్ |
|---|---|
| ₹ 105 | ₹ 127 |
| స్కిన్ | స్కిన్ లెస్ |
| ₹ 184 | ₹ 210 |



## గ్యాస్ రాయితీ ఉత్త గ్యాస్

నమ్మించి వంచన చేయడమే కాంగ్రెస్ నైజం

ఎక్స్ వేదికగా మండిపడ్డ కేటీఆర్

**విశ్వంభర, హైదరాబాద్:** కాంగ్రెస్ రాయితీ గ్యాస్ సిలిండర్‌పై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వ్యంగ్యాస్త్రాలు సంధించారు. గ్యాస్ రాయితీ ఉత్త గ్యాస్ అంటూ మండిపడ్డారు. మహాలక్ష్ముల నెత్తిన బండ పెట్టారంటూ ఫైర్ అయ్యారు. మిగతా2లో...

## క్రమశిక్షణ చర్యలు తీసుకోండి

- కేసీఆర్‌పై రేవంత్ భాషను కట్టడి చేయకపోవడంపై ఆగ్రహం
- పోలీసులు కీలుబొమ్మలుగా మారారు
- నియంతృత్వ పాలనకు నిదర్శనంగా నిలుస్తున్నారు
- కాంగ్రెస్ అధిష్ఠానం మౌనం దురదృష్టకరం
- ఖర్గేకు హరీశ్‌రావు లేఖ




## జానీ మాస్టర్ గోవాలో అరెస్టు

**హైదరాబాద్‌కు తరలిస్తున్నాం: డీసీపీ శ్రీనివాస్**



**విశ్వంభర, హైదరాబాద్:** కొరియోగ్రాఫర్ జానీ మాస్టర్‌ను గోవాలో అరెస్టు చేశామని డీసీపీ శ్రీనివాస్ వెల్లడించారు. లైంగిక వేధింపుల ఆరోపణలు ఎదుర్కొంటున్న జానీ పరారీలో ఉన్న విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే పోలీసులు మిగతా2లో...

# గ్యాస్ రాయితీ ఉత్త గ్యాస్

(మొదటి పేజీ తరువాయి)

సగం మందికిపైగా మొండి చెయ్యి చూపారని విమర్శించారు. ఆడబిడ్డలను మోసం చేశారన్నారు. నమ్మించి వంచన చేయడమే కాంగ్రెస్ నైజం అంటూ ఆగ్రహం వ్యక్తంచేశారు. నీరుగారిపోతున్న గ్యారెంటీలు.. గంగలో కలిసిన హామీలంటూ ఎక్స్ వేదికగా ఫైర్ అయ్యారు.

**కాంగ్రెస్ పాలనలో కుప్పకూలిన వైద్య వ్యవస్థ**

రాష్ట్రంలో వైద్యారోగ్య రంగం తీవ్ర నిర్లక్ష్యానికి గురవుతోందని కేటీఆర్ ఆరోపించారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో కనీస మౌలిక సదుపాయాలు కల్పించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందన్నారు. సరిపడా వైద్య సిబ్బంది అందుబాటులో లేకపోవడం.. ఉన్నచోట నిర్లక్ష్యం వహించడం కారణంగా రోగుల ప్రాణాలు బలవుతున్నాయని పేర్కొన్నారు. హుజుర్‌నగర్ ఏరియా హాస్పిటల్‌లో నవజాత శిశువు మరణానికి దారితీసిన ఘటన అమానవీయం, దురదృష్టకరమన్నారు. సీఎం రేవంత్ రెడ్డి హయాంలో వైద్య వ్యవస్థ కుప్పకూలిపోయింది అనడానికి ఇది అద్భుతమైన ఉదాహరణ అని చెప్పారు. ప్రసవం చేసేందుకు గర్భిణి కడుపుపై నొక్కడం.. ఆ శిశువు మరణానికి దారి తీసిందన్నారు. వైద్య సిబ్బందికి జవాబుదారీతనం ఎక్కడుంది..? అని కేటీఆర్ ప్రశ్నించారు. ఆస్పత్రి వైద్య సిబ్బందికి నోటీసులు ఇవ్వడమే కాకుండా.. కారకులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సినిమాల్లో బోగం వేషాలు వేసుకునే కంగనా రనౌత్ అంటూ ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ చేసిన వ్యాఖ్యలు సరికాదని కేటీఆర్ అన్నారు.

# క్రమశిక్షణ చర్యలు తీసుకోండి..



**విశ్వంభర, హైదరాబాద్ :** ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గేకు మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు బహిరంగ లేఖ రాశారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్‌పై రేవంత్ రెడ్డి ఉపయోగిస్తున్న భాష గురించి లేఖలో ఆయన పేర్కొన్నారు. రేవంత్ రెడ్డిపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని ఖర్గేను కోరారు.రేవంత్ రెడ్డి భాషపై కాంగ్రెస్ అధిష్ఠానం అభ్యంతరం చెప్పకపోవడంపై హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. రాహుల్ గాంధీ టెర్రరిస్ట్ అంటూ బీజేపీ చేసిన వ్యాఖ్యలను ఖండించిన కాంగ్రెస్.. కేసీఆర్‌పై రేవంత్ భాషను కట్టడి చేయకపోవడంపై ఆగ్రహం వెలిబుచ్చారు. రేవంత్ భాషను ప్రోత్సహిస్తున్న హైకమాండ్‌కు బీజేపీ వ్యాఖ్యలను ఖండించే నైతిక హక్కు కూడా లేదన్నారు. పోలీసులు సీఎం రేవంత్‌కు కీలుబొమ్మలుగా మారి నియంతృత్వ పాలనకు నిదర్శనంగా నిలుస్తున్నారు. ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్న బీఆర్ఎస్ నేతలపై తప్పుడు కేసులు పెడుతున్నారు. సీఎం అనుచరులు నేరాలకు పాల్పడినా ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. హామీలపై నిలదీస్తే ప్రతిపక్ష ఎమ్మెల్యేలపై దాడులు చేయిస్తున్నారు. రేవంత్ రెడ్డి తీరుపట్ల కాంగ్రెస్ అధిష్ఠానం మౌనం దురదృష్టకరం. తెలంగాణలోని పరిస్థితి మహాభారతాన్ని గుర్తు చేస్తోంది. ధృతరాష్ట్రుడు తన కొడుకు దుర్యోధనుడి క్రూరమైన అతిక్రమణలను ఉద్దేశపూర్వకంగా విస్మరించినట్టు కాంగ్రెస్ అధిష్ఠానం తీరు ఉందని హరీశ్‌రావు ధ్వజమెత్తారు.

# అక్టోబరు 2నుంచి 14 వరకు దసరా సెలవులు

(మొదటి పేజీ తరువాయి)



ప్రకటించింది. అక్టోబర్ 2వ తేదీ గాంధీ జయంతితో సెలవులు మొదలు కానున్నట్లు వివరించింది. ఆ తర్వాత నుంచి బతుకమ్మ, దసరా సెలవులు ఉంటాయని విద్యాశాఖ అధికారులు తెలిపారు. ఇప్పటికే కొన్ని ప్రైవేట్ పాఠశాలలు అక్టోబర్ 1వ తేదీ నుంచి దసరా సెలవులు ఇస్తున్నట్టు ప్రకటించాయి. ఇక జూనియర్ కాలేజీల విషయానికి వస్తే అక్టోబర్ 6వ తేదీ నుంచి 13వ తేదీ వరకు సెలవులు ప్రకటించింది ప్రభుత్వం. మళ్లీ ఆరోజే పునఃప్రారంభం: అక్టోబర్ 2 నుంచి 14వ తేదీ వరకు అంటే మొత్తంగా 13రోజులు సెలవుల తర్వాత అక్టోబర్ 15(మంగళవారం) రోజున స్కూళ్లు పునఃప్రారంభం కానున్నాయి. ఇక కాలేజీలు అక్టోబర్ 14న తెరుచుకోనున్నాయి. వరుసగా 13 రోజులు సెలవులు రావడంతో విద్యార్థులు ఊర్లకు వెళ్లేందుకు సిద్ధం అవుతున్నారు.

**విద్యాసంవత్సరం క్యాలెండర్ విడుదల**

కాగా, తెలంగాణ సర్కార్ మే 25వ తేదీన 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి క్యాలెండర్‌ను విడుదల చేసింది. అక్టోబర్ 2 నుంచి 14వ తేదీ వరకు దసరా సెలవులు, డిసెంబర్ 23 నుంచి 27 వరకు క్రిస్మస్ సెలవులు, జనవరి 13 నుంచి 17వ తేదీ వరకు సంక్రాంతి సెలవులు ఉంటాయని ప్రకటించింది. ఇక 2025, ఏప్రిల్ 23వ తేదీ వరకు పాఠశాలలు కొనసాగుతాయని, 2025 ఫిబ్రవరి 28వ తేదీ లోపు పదో తరగతి ప్రి ఫైనల్ పరీక్షలు పూర్తి చేయనున్నట్లు తెలిపింది. 2025 మార్చిలో పదో తరగతి వార్షిక పరీక్షలు నిర్వహించనున్నారు. ఇక ఇటీవల తెలంగాణలో భారీ వర్షాల కారణంగా స్కూళ్లకు సెలవులు ప్రకటించారు. ఆ తర్వాత 14, 15, 16తేదీల్లోనూ సెలవులు వచ్చాయి. 17వ తేదీన కొన్ని ప్రాంతాల్లో వినాయక నిమజ్జనం సందర్భంగా సెలవు ఇచ్చారు. ఇటు సెప్టెంబర్ 22, 28, 29 తేదీల్లోనూ స్కూళ్లకు సెలవు రానుంది. దీంతో సెప్టెంబర్, అక్టోబర్ నెలలో స్కూళ్లకు ఎక్కువగా సెలవులు వచ్చాయి. మరోవైపు సెప్టెంబర్ 20వ తేదీ నుంచి తెలంగాణలో భారీ వర్షాలు కురుస్తాయనే అంచనాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో.. అతి భారీ వర్షాలు కురిసే ప్రాంతాల్లో మళ్లీ స్కూళ్లకు సెలవు ప్రకటించే అవకాశం లేకపోలేదు.

# అర్హులందరికీ డిజిటల్ రేషన్ కార్డులు

**విశ్వంభర, హైదరాబాద్:** రేషన్ కార్డులు జారీకి పటిష్ఠ కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. నూతన రేషన్ కార్డుల కోసం అక్టోబరు రెండో తేదీ నుంచి దరఖాస్తులను స్వీకరించాలని సీఎం సూచించారు. రేషన్ కార్డుల జారీకి సంబంధించిన విధివిధానాలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో రాష్ట్ర సచివాలయంలో గురువారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా రేషన్ కార్డుల జారీకి సంబంధించి మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, దామోదర రాజనరసింహ అధికారులకు పలు సూచనలు చేశారు. అర్హులందరికీ డిజిటల్ రేషన్ కార్డులు ఇచ్చేదానిపై కసరత్తు చేశారు. ఈ అంశంపై త్వరలోనే మరోసారి సమీక్ష నిర్వహించాలని నిర్ణయించారు. సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, ముఖ్యమంత్రి ప్రిన్సిపల్ సెక్రటరీ వి.శేషాద్రి, ముఖ్యమంత్రి కార్యదర్శులు చంద్రశేఖర్ రెడ్డి, సంగీత సత్యనారాయణ, మాణిక్ రాజ్, రాష్ట్ర ఆర్థిక శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి రామకృష్ణారావు, వ్యవసాయ శాఖ కార్యదర్శి ఎం.రఘునందన్‌రావు, పౌరసరఫరాల శాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి డి.ఎస్.చౌహాన్ తదితరులు పాల్గొన్నారు.

# దూకుడు పెంచనున్న హైడ్రా

(మొదటి పేజీ తరువాయి)

వద్ద ఉన్న పరిమిత సిబ్బంది, యంత్రాలతో ఇప్పటికే 23 చోట్ల 262 అక్రమ నిర్మాణాలను కూల్చివేసింది. వంద ఎకరాలకుపైగా ప్రభుత్వ స్థలాలను పరిరక్షించింది. అయితే పెద్ద సంఖ్యలో వస్తున్న ఫిర్యాదులు, నగరంలో అన్యాక్రాంతమైన చెరువులు, నాలాలు, ఇతర ప్రభుత్వ స్థలాలు, పార్కుల్లోని నిర్మాణాలను కూల్చివేసేందుకు కాంట్రాక్టు పద్ధతిలో ముందుకు వెళ్లాలని హైడ్రా కమిషనర్ రంగనాథ్ నిర్ణయించారు. కూల్చివేతలు, శిథిలాల తొలగింపు, అత్యాధునిక యంత్రాల సమకూర్చుకోవడం కోసం హైడ్రా టెండర్లను ఆహ్వానించింది. ఈ నెల 27 వరకు ఆఫ్ లైన్‌లో టెండర్లను ఆహ్వానిస్తూ బిడ్డర్లు తమ ప్రతిపాదనలను సీల్డ్ కవర్‌లో హైడ్రా కార్యాలయానికి సమర్పించాలని కోరారు. ఏడాది కాల పరిమితితో బిడ్స్‌ను స్వీకరిస్తున్నట్లు పేర్కొన్న హైడ్రా టెండర్లలో పాల్గొనే బిడ్డర్లు, సంస్థలు తమ నియమ నిబంధనలు సూచనలను తప్పనిసరిగా పాటించాలని పలు షరతులు విధించారు. తమ ఆధీనంలో పనిచేసే సంస్థకు ఉండాల్సిన అర్హతలు, పరిమితులను వివరించారు.




**ఇవీ నిబంధనలు :** బిడ్డర్లు తప్పనిసరిగా యంత్రాలను కలిగి ఉండాలని, 20 మీటర్ల ఎత్తులో ఉన్న ఏ నిర్మాణాన్నైనా కూల్చే విధంగా హైరీచ్ హైడ్రాలిక్ యంత్రాలు ఉండాలని నిబంధన విధించారు. అంతేకాకుండా జా క్రషర్, షీర్ కట్టర్, అదనపు షీట్ కట్టర్, బకెట్, బ్లేడ్ జోడించిన రాక్ బ్రేకర్, రెండు ఎక్సావేటర్లు, 2 జేసీబీలు, 2 మినీ ఎక్సావేటర్లు, 2 రాక్ బేకర్లు ఉండాలని సూచించారు. ఓఆర్ఆర్ లోపలే వాటిని అందుబాటులో ఉండేలా చూసుకునే బాధ్యత బిడ్డర్లదేనని, కూల్చివేతకు 4 గంటల ముందే యంత్రాలను సమకూర్చాలని షరతు పెట్టారు. అలాగే బిడ్డర్లు తప్పనిసరిగా జీఎస్టీ, పాన్‌తోపాటు గత మూడు ఆర్థిక సంవత్స రాల ఐటీ రిటర్నులతో సహా చెల్లుబాటు అయ్యే చట్టబద్ధమైన రిజిస్ట్రేషన్‌లను సమర్పించాలని, అదనంగా చార్టర్డ్ అకౌంటెంట్ తో ధ్రువీక రించిన బ్యాలెన్స్ షీట్, లాభ నష్టాల టర్నోవర్ సర్టిఫికేట్ వంటి అన్ని ఆర్థిక పత్రాలు తప్పనిసరిగా సమర్పించాలన్నారు.

**షరతులు వర్తిస్తాయి :** బిడ్డర్ తప్పనిసరిగా గత మూడు ఆర్థిక సంవత్సరాల్లో ఏదైనా ఒక సంవత్సరానికి ధ్రువీకరించిన వార్షిక టర్నోవర్ నివేదికను అందించాలని, అది కనీసం రూ.2 కోట్ల టర్నోవర్ ఉండాలని హైడ్రా షరతులు విధించింది. బిడ్డర్ తప్పనిసరిగా కనీసం ఒక కూల్చివేత ప్రాజెక్ట్‌ను తెలంగాణలో ఎక్కడైనా ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో చేసి ఉండాలని, దాని విలువ కోటి రూపాయలైనా ఉండాలని సూచించారు. అందుకు సంబంధించిన తప్పనిసరిగా నోటరీ చేసిన వర్క్ ఆర్డర్, వర్క్ కంప్లీషన్ సర్టిఫికేట్ కాపీలను సమర్పించాలని టెండర్ల ఆహ్వానంలో హైడ్రా కమిషనర్ రంగనాథ్ కోరారు.

**వారికి తొలి ప్రాధాన్యం :** ఇంప్లోషన్ టెక్నిక్ ఉపయోగించి నిర్మాణాలను కూల్చివేయడంలో అనుభవం ఉన్న ఏ బిడ్డర్‌కైనా హైడ్రా ప్రాధాన్యం ఇస్తుందని, పొరుగున ఉన్న నిర్మాణాలకు నష్టం జరగకుండా పనిచేసే అనుభవం ఉన్న వారు, అందుకు అవసరమైన ఆధారాలు సమర్పించాలన్నారు. గ్రౌండ్ ఫ్లోర్, ఐదు అంతకంటే ఎక్కువ అంతస్తులను హై-రీచ్ యంత్రంతో కూల్చివేతతో 5 గంటలలోపు పూర్తి చేసేలా ఉండాలన్నారు. బిడ్డర్ తప్పనిసరిగా సేఫ్టీ ఇంజనీరింగ్‌లో కనీసం 5 ఏళ్ల పని అనుభవం ఉన్న సేఫ్టీ ఇంజినీర్ ఉండాలన్నారు. బిడ్డర్ తమ ప్రతిపాదిత కూల్చివేత ఛార్జీలను సమర్పించాలని, అందులో ఇంధనం, రవాణా, ఆపరేటర్, నిర్వహణ, మరమ్మతులు మొదలైన వాటి ఖర్చులు ఉండాలన్నారు. అన్ని యంత్రాల పనితీరును హైడ్రా భౌతికంగా తనిఖీ చేస్తుందన్నారు. రవాణా ఖర్చు, శిథిలాల తొలగింపు బాధ్యత బిడ్డర్లదేనన్న హైడ్రా కమిషనర్ వాహనాలు మరమ్మతులో ఉన్నప్పుడు వెంటనే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని, వాటికి పని గంటల ప్రకారమే చెల్లింపులు ఉంటాయన్నారు. పనితీరు సంతృప్తికరంగా లేకపోయినా హైడ్రాకు ఇబ్బందికరమైన పరిస్థితులు తీసుకొచ్చినా కాంట్రాక్ట్‌ను రద్దు చేస్తామని, సెక్యూరిటీ డిపాజిట్లు కూడా జప్తు చేస్తామని హైడ్రా కమిషనర్ రంగనాథ్ సమగ్రంగా వివరించారు.

# తిరుమల శ్రీవారి లడ్డూలో అపవిత్ర పదార్థాలు కలిపారు

- గత ప్రభుత్వ హయాంలో అపచారం
- బాధ్యులను కనిపెట్టి చర్యలు తీసుకుంటాం
- ఏపీ సీఎం చంద్రబాబు హెచ్చరిక
- ఆరోపణలను ఖండించిన వైవీ సుబ్బారెడ్డి
- శ్రీవారి వద్ద ప్రమాణం చేద్దామని సవాల్



**విశ్వంభర, అమరావతి:** వైసీపీ ప్రభుత్వ హయాంలో తిరుపతి లడ్డూలో అపవిత్ర పదార్థాలు కలిపారని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆరోపించారు. తిరుమల ప్రసాదానికి సంబంధించి ల్యాబ్ రిపోర్ట్‌లో అపవిత్ర పదార్థాలు వాడారని చెప్పారని.. వాటికి కారణం అయిన వారు ఎవరో కనిపెట్టి వారిపై తప్పకుండా చర్యలు తీ సు కుం టా మ ని చంద్రబాబు స్పష్టం చేశారు. వెలగపూడిలో సచివాలయం ఎదుట అన్న క్యాంటీన్‌ను బుధవారం ప్రారంభించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. హిందువులకు వేంకటేశ్వరస్వామి కలియుగ దేవుడని, ఇలా చేస్తారని ఎవరూ ఊహించలేదని పేర్కొన్నారు. శ్రీవారికి ఎవరైనా అపచారం తలపెడితే.. వచ్చే జన్మలో కాదు, ఈ జన్మలోనే శిక్షిస్తాడని అందరూ నమ్ముతారన్నారు. ఇలాంటి దుర్మార్గులను ఏం చేయాలో అర్థం కావడం లేదని చంద్రబాబు తీవ్ర వ్యాఖ్యలు చేశారు. కక్కుర్తికి కూడా హద్దులు ఉంటాయని.. హద్దులు దాటి ప్రవర్తించి ఏదైనా చేస్తామనే పరిస్థితికి వచ్చారని దుయ్యబట్టారు. గతంలో తిరుమలలో ఎన్టీఆర్ అన్నదానం ప్రవేశపెట్టారని.. గత ప్రభుత్వ హయాంలో నాసిరకంగా అన్నదానం చేసినట్లు చాలా ఫిర్యాదులు వచ్చినట్లు చెప్పారు. శానిటేషన్, ప్రసాదాలు, అన్న క్యాంటీన్లను గతంలో అధికారంలో ఉన్న జగన్ మోహన్ రెడ్డి నేతృత్వంలోని వైసీపీ ప్రభుత్వం తీవ్రంగా దెబ్బతీసిందని మండిపడ్డారు. శ్రీవారిని తీసుకెళ్లి పెళ్లిళ్లు, పేరంటాలు ఉంటే అక్కడ కూడా ఊరేగించే పరిస్థితికి తీసుకువచ్చారని విమర్శలు గుప్పించారు. ఇలాంటి వాటిపై తాను అప్పుడే స్పందించి వాటిని తప్పుబట్టినట్లు తెలిపారు. రాజకీయ ప్రయోజనాల కోసం వేంకటేశ్వరస్వామిని ఉపయోగించుకోవడం కరెక్ట్ కాదని పేర్కొన్నారు. ఇక తిరుమలను అపవిత్రం చేసిన వారిని ఎట్టి పరిస్థితుల్లో వదిలేది లేదని తేల్చి చెప్పారు. వాళ్లకు సంబంధించిన ఆధారాలు లభించిన వెంటనే కఠిన చర్యలు తీసుకుంటామని తేల్చి చెప్పారు.

# అన్నంలో రాళ్లు వస్తుంటే ఏం చేస్తున్నారు?

**విశ్వంభర, హైదరాబాద్:** విద్యార్థులకు అన్నంలో రాళ్లు వస్తుంటే ఏం చేస్తున్నారంటూ అధికారులను కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ప్రశ్నించారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలం మర్రిమడ్లలోని ఏకలవ్య మోడల్ పాఠశాలను మంత్రి సందర్శించారు. తరగతి గదిలోకి వెళ్లి విద్యార్థులతో మాట్లాడారు. భవిష్యత్తులో ఏం కావాలనుకుంటున్నారంటూ విద్యార్థులను అడగడంతో పాటు ఉపాధ్యాయుల విద్యా బోధనను పరిశీలించారు. విద్యార్థులు, ఉపాధ్యాయుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు అన్నంలో రాళ్లు వస్తున్నాయని, టాయిలెట్లు లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం అధికారులు, ఉపాధ్యాయులతో నిర్వహించిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ విద్యార్థులు అన్నంలో రాళ్లు వస్తున్నాయని చెబుతున్నారని, మన పిల్లలకైతే ఇలాగే తినిపిస్తామా? అని ప్రశ్నించారు. టాయిలెట్‌లో నీళ్లు రాకపోతే పట్టించుకోరా అని అడిగారు. మొదటిసారి వచ్చాను కాబట్టి సున్నితంగా చెబుతున్నానని, రెండోసారి వచ్చిన సమయంలో ఇలా ఉండకూడదని హెచ్చరించారు.

**దేశవ్యాప్తంగా 728 పాఠశాలలు :** అనంతరం టాయిలెట్ల నిర్మాణానికి బండి సంజయ్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆదేశాల మేరకు ప్రతి ఎంపీ తన పరిధిలోని ఏకలవ్య పాఠశాలను సందర్శించి సమస్యలు తెలుసుకుంటున్నట్లు చెప్పారు. 2018-19లో దేశవ్యాప్తంగా బ్లాక్ ల వారీగా 50 శాతం ఎక్కువ ఉన్న ఆదివాసీ గిరిజన ఎస్సీ, ఎస్టీ బ్లాకుల్లో ఏకలవ్య పాఠశాలను కేంద్రం మంజూరు చేయాలని నిర్ణయించిందన్నారు. 2022లో 20 శాతం జనాభా ఉన్న బ్లాకుల్లో కూడా ఏకలవ్య పాఠశాలలు మంజూరు చేసిందన్నారు. దేశవ్యాప్తంగా 728 పాఠశాలను ప్రారంభించిందని తెలిపారు. ఇప్పటివరకు 410 పాఠశాలల్లో విద్యా బోధన కొనసాగుతుందని చెప్పారు. వారిలోని ప్రతిభను వెలికి తీయడం కోసమే : దేశవ్యాప్తంగా ఏకలవ్య మోడల్ పాఠశాలల్లో 1.20 లక్షలకు పైగా మంది విద్యార్థులు చదువుకుంటున్నారని అన్నారు. పాఠశాలల భవన నిర్మాణానికి రూ.38 కోట్లు వెచ్చిస్తుండగా, నక్సల్ ప్రభావిత ప్రాంతాల్లో రూ.48 కోట్లను కేటాయించినట్లు చెప్పారు. తెలంగాణలో 23 ఏకలవ్య పాఠశాలల్లో 8,300 మంది విద్యార్థులు చదువుకుంటున్నట్లు చెప్పారు. ఆదివాసీ, గిరిజన ప్రాంతాల్లోని విద్యార్థులకు శిక్షణ ఇచ్చి వాళ్లలోని ప్రతిభను వెలికి తీసి ఉన్నత స్థాయికి తీసుకెళ్లాలని నరేంద్ర మోదీ ప్రభుత్వం ప్రయత్నిస్తుందన్నారు. ఏకలవ్య పాఠశాలలోని విద్యార్థులు, ఉపాధ్యాయుల సమస్యలు, సూచనలను నివేదిక రూపంలో కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి మార్పు తీసుకురావడానికి ప్రయత్నిస్తామన్నారు.

# జానీ మాస్టర్ గోవాలో అరెస్టు

(మొదటి పేజీ తరువాయి)

గురువారం అధికారిక ప్రకటన చేశారు. గోవాలో జానీని అరెస్టు చేశామని.. హైదరాబాద్‌కు తీసుకువస్తున్నట్లు పేర్కొన్నారు. ఆ తర్వాత కోర్టులో హాజరుపరుచనున్నట్లు చెప్పారు. ఈ నెల 15న బాధిరాలి ఫిర్యాదు మేరకు రాయదుర్గం పోలీసులు జానీ మాస్టర్‌పై జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేశారని డీసీపీ శ్రీనివాస్ చెప్పారు. జానీపై 376(2)ఎన్, 506, 323 కింద కేసులు నమోదు చేసినట్లు చెప్పారు. 2020లో ముంబయిలో పని చేస్తున్న సమయంలో జానీ తనపై లైంగిక దాడికి పాల్పడిందని బాధితురాలు ఫిర్యాదులో పేర్కొందని.. ఈ కేసులో ఇప్పటికే బాధితురాలి వాంగ్మూలం సేకరించినట్లు వివరించారు. బాధితురాలు నేరం జరిగిన సమయంలో మైనర్ అని తేలిందని.. దాంతో పోక్సోచట్టం కింద కేసు నమోదు చేసినట్లు డీసీపీ వివరించారు.

# జమిలి ఎన్నికల నిర్వహణ అమలుకు కమిటీ

(మొదటి పేజీ తరువాయి)

మారుతోందని ఆయన అన్నారు. కొన్నిసార్లు సాధారణ నిర్ణయాలు కూడా తీసుకోలేని పరిస్థితి ఉందన్నారు. 2047 నాటికి దేశాన్ని అభివృద్ధి చెందిన దేశంగా నిలపాలన్న లక్ష్యంతో పని చేస్తున్న కేంద్ర ప్రభుత్వం ఈ ప్రధాన అడ్డంకిని తొలగించడానికి జమిలి ఎన్నికలు నిర్వహించాలని నిర్ణయించడం స్వాగతించదగిన పరిణామం అన్నారు. వేర్వేరుగా ఎన్నికల నిర్వహణ కారణంగా ఖజానాపై ఆర్థికంగా చాలా భారం పడుతోందని చెప్పారు. పార్లమెంటు, రాష్ట్రాల అసెంబ్లీలకు వేర్వేరుగా ఎన్నికలు నిర్వహించడం కారణంగా అవుతున్న ఖర్చు రూ.4,500 కోట్ల పైమాటేనన్నారు. జమిలి ఎన్నికలను ప్రస్తుతం వ్యతిరేకిస్తున్న పార్టీలు త్వరలోనే దీనికి సహకరిస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

# మిషన్ భగీరథలో భారీ అవినీతి

(మొదటి పేజీ తరువాయి)

చేసినట్టుగా లేదని, వారి జేబులు నింపుకోవడానికి చేసినట్టుగా ఉందని విమర్శించారు. వాస్తవాలను ప్రజలకు తెలియజేసి ప్రతి గ్రామంలో ప్రతి ఇంటికి మంచినీరు అందిస్తామని ప్రకటించారు. గత పదేళ్లలో ఎన్నడూ లేని విధంగా వ్యవసాయానికి బడ్జెట్ లో రూ.72 వేల కోట్లు కేటాయించిన ఘనత ఈ ప్రభుత్వానిది. 27 రోజుల్లో 23 లక్షల మందికి రూ. 18 వేల కోట్ల రైతు రుణాలను రద్దు చేశామని సాంకేతిక కారణాలతో కొంతమంది రైతులకు రుణమాఫీ ప్రయోజనం అందలేదని వీలైనంత త్వరలో వాటిని పరిష్కరించి ఇచ్చిన మాట ప్రకారం అర్హులైన ప్రతి రైతన్నకు రుణమాఫీ చేస్తామని, అన్న మాట ప్రకారం 31 వేల కోట్ల రూపాయలకి ఇంకా కావాలంటే రెండు మూడు వందల కోట్లు ఎక్కువైనా పర్వాలేదు అర్హులైన ప్రతి రైతన్నకి ఈ ప్రభుత్వం చిత్తశుద్ధితో రెండు లక్షల రూపాయలు వరకు రుణమాఫీ చేసి తీరుతుంది. అర్హులైన ప్రతి ఒక్కరికీ హెల్త్ కార్డులు, రేషన్ కార్డులు వేరు వేరుగా అందించబోతున్నామని ప్రకటించారు. మరి కొద్ది రోజుల్లో ఇందిరమ్మ ఇళ్లకు ముగ్గు వేయబోతున్నామని ప్రకటించారు. ఈ ప్రభుత్వం విద్యా వైద్య రంగాలకు అత్యంత ప్రాధాన్యం ఇస్తుందని వెల్లడించారు. ప్రాజెక్టుల పేరుతో మిషన్ భగీరథ పేరుతో వేల కోట్ల రూపాయలను కాజేసిన గత ప్రభుత్వ పెద్దలు తమ తప్పులు కప్పి పుచ్చుకోవడానికి ప్రతి దానిని రాద్ధాంతం చేయడం అలవాటు చేసుకున్నారని దుయ్యబట్టారు. వారి పాలనలో అవినీతి అక్రమాలు జరిగినట్టుగానే ఇప్పుడు కూడా జరుగుతున్నాయనే భ్రమలో బీఆర్ఎస్ నాయకులు జీవిస్తున్నారని ఎద్దేవా విమర్శించారు.



# కశ్మీర్ యువత చేతుల్లో ఇక రాళ్లు ఉండవు

(మొదటి పేజీ తరువాయి)

కారణంగా కశ్మీరీ ప్రజలకు పెను నష్టం వాటిల్లిందన్నారు. ఎన్సీ, పీడీపీ, కాంగ్రెస్ పార్టీలు జమ్మూకశ్మీర్ రాష్ట్రాన్ని లూటీ చేసినట్లు ఆరోపించారు. దోచుకోవడమే తమ జన్మహక్కుగా ఆ పార్టీలు భావించాయన్నారు. "1980ల్లో ఏం జరిగిందో మర్చిపోయారా? ఆ మూడు పార్టీలు (కాంగ్రెస్, నేషనల్ కాన్ఫరెన్స్, పీడీపీ) జమ్మూకశ్మీర్ను వారి సొంత సామ్రాజ్యంగా భావించాయి. మూడు పార్టీల కుటుంబ పాలనలో.. జమ్మూకశ్మీర్ యువత నలిగిపోయినట్లు పేర్కొన్నారు. ఆ మూడు కుటుంబాల (గాంధీ, ముఫ్తీ, ఒమర్ అబ్దుల్లా కుటుంబం) వారు కాకుండా ఇంకెవర్నీ రాజకీయాల్లోకి రానిచ్చేవారు కాదు. విద్యకు దూరమైన మన యువత చేతిలో వారు రాళ్లు పెట్టారు. వారి స్వప్రయోజనాల కోసం మన పిల్లల భవిష్యత్తు నాశనం చేస్తున్నారు. జమ్మూకశ్మీర్ పై కుట్రలు చేసే ప్రతి శక్తినీ ఓడించి తీరుతాం" అని మోదీ అన్నారు. ఈ సందర్భంగా ఇటీవల జరిగిన తొలి విడత ఎన్నికల్లో భారీగా ఓటింగ్ శాతం నమోదవ్వడంపై ప్రధాని హర్షం వ్యక్తం చేశారు. "ఇప్పుడు జమ్మూకశ్మీర్ యువత నిస్సహాయులు కాదు. ఆర్టికల్ 370 రద్దు చేసిన తర్వాత ఇక్కడ అభివృద్ధి వేగంగా జరుగుతోంది. ఇప్పుడు కశ్మీర్ యువత రాళ్లను వదిలి పుస్తకాలు, పెన్నులు పట్టుకుంటున్నారు. వారికి ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయి. అంతేకాదు. ఇక్కడి ప్రజలు ఎలాంటి భయం, బెరుకు లేకుండా తమ ఓటు హక్కు వినియోగించుకుంటున్నారు. రెండో విడతలోనూ మరింత ఎక్కువ మంది ఈ ప్రజాస్వామ్య పండుగలో పాల్గొని సరికొత్త రికార్డులు సృష్టించాలి" అని మోదీ పిలుపునిచ్చారు.ఉగ్రవాద ఛాయలు లేకుండా తొలి సారి జమ్మూకశ్మీర్‌లో స్వేచ్ఛగా ఎన్నికలు జరుగుతున్నట్లు మోదీ తెలిపారు. భారత ప్రజాస్వామ్యాన్ని జమ్మూకశ్మీర్ ప్రజలు బలోపేతం చేస్తున్నారని పేర్కొన్నారు. జమ్మూకశ్మీర్‌లో అధిక సంఖ్యలో ఓటింగ్ జరగడం పట్ల గర్వంగా ఫీలవుతున్నట్లు ప్రధాని తెలిపారు.

**ఓట్ల కోసం మన సంస్కృతి, విశ్వాసాలను కాంగ్రెస్ పణంగా పెడుతుంది..**

కొన్ని ఓట్ల కోసం కాంగ్రెస్ పార్టీ ఎప్పుడైనా మన సంస్కృతి, విశ్వాసాలను పణంగా పెడుతుందని ప్రధాని నరేంద్ర మోదీ ఆరోపించారు. కత్రాలో జరిగిన ఎన్నికల ప్రచార ర్యాలీని ఉద్దేశించి ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ వారసుడు విదేశాలకు వెళ్లి మన దేవీ, దేవతలు దేవుళ్లు కాదని చెప్పారని, ఇది మన విశ్వాసాలను అవఇలాంటి వ్యాఖ్యలు చేసినందుకు కాంగ్రెస్‌ను శిక్షించాలని అన్నారు. వీరు ఇదంతా ఏదో పొరపాటున చెప్పడం లేదని, ఇది ప్రణాళికాబద్ధంగా జరుగుతున్న కుట్రని చెప్పారు. ఇతర మతాలు, దేశాల నుంచి దిగుమతి చేసుకున్న నక్సల్ మైండ్‌సెట్ నుంచి ఇది పుట్టుకొస్తోందని ఆరోపించారు. కాంగ్రెస్ నక్సల్ ఆలోచనా విధానం జమ్ములోని డోగ్రా సంస్కృతిని అవమానిస్తోందని ప్రధాని నరేంద్ర మోదీ ఆరోపించారు.వారు కేవలం తమ ఓటు బ్యాంక్ మినహా మరేమీ పట్టించుకోరని, అందుకే వాళ్లు ఏండ్ల తరబడి జమ్ము కశ్మీర్ మధ్య అంతరం పెంచాలని ప్రయత్నించారని దుయ్యబట్టారు. కాంగ్రెస్ నేతలు ఎల్లప్పుడూ జమ్ము పట్ల వివక్ష చూపుతారని ఆరోపించారు. తాము జమ్మును ప్రధాన స్రవంతిలోకి తీసుకొచ్చామని అన్నారు. జమ్ము కశ్మీర్‌లో ఆర్టికల్ 370 రద్దును ఎవరూ తిరగతోడలేరని ప్రధాని నరేంద్ర మోదీ స్పష్టం చేశారు.మానించడమేనని ప్రధాని పేర్కొన్నారు.

# దేశానికే ఆదర్శంగా స్కిల్ యూనివర్సిటీ

(మొదటి పేజీ తరువాయి)
యూనివర్సిటీకి 150 ఎకరాల స్థలంతో పాటు రూ.100 కోట్లు కేటాయించినట్లు చెప్పారు. రాష్ట్రంలోని పారిశ్రామికవేత్తలు స్కిల్ యూనివర్సిటీ లో భాగస్వామ్యం పంచుకోవాలని, యూనివర్సిటీ పూర్తి స్థాయి నిర్వహణకు కార్పస్ ఫండ్ ఏర్పాటుకు ముందుకు రావాలని కోరారు. యూనివర్సిటీలో భవనాల నిర్మాణానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. తమ కంపెనీల పేర్లను లేదా దాతల పేర్లను ఈ భవనాలకు పెట్టాలని అధికారులకు సూచించారు. వీలైనంత వేగంగా తమ ఆలోచనలను ఆచరణలోకి తెచ్చామని, ఇకపై యూనివర్సిటీ బాధ్యతను బోర్డు ఛైర్మన్ మహీంద్రా ఆనంద్‌కు అప్పగిస్తున్నామని అన్నారు. ఈ రంగంలో అనుభవంతో పాటు ప్రత్యేక గుర్తింపు ఉన్న మహీంద్రా ఆనంద్ స్కిల్ యూనివర్సిటీకి తన బ్రాండ్ ఇమేజీని తీసుకువస్తారనే నమ్మకం ఉందని అన్నారు. తమ ప్రభుత్వం ఇప్పటి నుంచి యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ ఏర్పాటుపై దృష్టి సారిస్తుందని చెప్పారు. దాదాపు 200 ఎకరాల్లో స్పోర్ట్స్ యూనివర్సిటీ నెలకొల్పి.. 2028 ఒలింపిక్స్‌లో ఇండియాకు గోల్డ్ మెడల్ తీసుకురావాలనే లక్ష్యంతో క్రీడాకారులకు శిక్షణను అందిస్తామని అన్నారు. ఈ యూనివర్సిటీ యూనివర్సిటీ అభివృద్ధిలో పాలుపంచుకోవాలని ముఖ్యమంత్రి పారిశ్రామికవేత్తలకు పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వానికి నిధుల ఇబ్బంది లేదని.. రూ. 3 లక్షల కోట్ల బడ్జెట్లో వెయ్యి కోట్లు ఖర్చయినా భరించేందుకు సిద్ధంగా ఉన్నామని చెప్పారు. ఆర్థిక సహకారానికి మించి, రాష్ట్రంలోని అందరు పారిశ్రామికవేత్తలు, వ్యాపార వాణిజ్యవేత్తలు ఆశించినంత చొరవ ప్రదర్శించాలని.. తగిన భాగస్వామ్యం, బాధ్యతలను పంచుకోవాలని కోరుతున్నట్లు చెప్పారు.

తెలంగాణ యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ బోర్డుతో పాటు రాష్ట్రంలోని వివిధ రంగాలకు చెందిన పారిశ్రామికవేత్తలు, కంపెనీల ప్రతినిధులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సచివాలయంలో సమావేశమయ్యారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి శ్రీధర్ బాబు, యూనివర్సిటీ బోర్డు ఛైర్మన్ ఆనంద్ మహీంద్రా, కో ఛైర్మన్ శ్రీని రాజు, బోర్డు సభ్యులు పి.దేవయ్య, సుచిత్రా ఎల్లా, సతీష్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్, సీఎం ముఖ్య కార్యదర్శి శేషాద్రి, సీఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డితో పాటు ఉన్నతాధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. బోర్డు సభ్యులు మనీష్ సభర్వాల్, సంజీవ్ బిక్చందానీ, ఎంఎం మురుగప్పన్, డాక్టర్ కేపీ కృష్ణన్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. స్కిల్ యూనివర్సిటీ చేయాలనే తన ఆలోచనలతో పాటు భవిష్యత్తు ఆకాంక్షలను ఆయన యూనివర్సిటీ బోర్డుతో, రాష్ట్రంలోని వివిధ రంగాల పారిశ్రామికవేత్తలు, వివిధ కంపెనీల ప్రతినిధులతో పంచుకున్నారు.

డిగ్రీలు, పీజీ పట్టాలు ఉంటే సరిపోదని, ఇంజనీరింగ్ పూర్తి చేసిన లక్షలాది మంది యువకులు ఒక ఉద్యోగం ఇప్పించండని తన వద్దకు వస్తున్నారని ముఖ్యమంత్రి తనకు ఎదురైన కొన్ని అనుభవాలను గుర్తు చేసుకున్నారు. ఏటేటా లక్షల మంది యువకులు డిగ్రీలు, పీజీలు, ఇంజినీరింగ్ పూర్తి చేస్తున్నారని.. కానీ అందరూ ఉద్యోగాలు సాధించలేకపోతున్నారని అన్నారు. మరోవైపు పరిశ్రమల అవసరాలకు సరిపడే మానవ వనరుల కొరత ఉందని చెప్పారు. ఈ అంతరాన్ని తొలిగించేందుకు స్కిల్ యూనివర్సిటీ నెలకొల్పాలనే ఆలోచన చేసినట్లు ముఖ్యమంత్రి తెలిపారు. అందరికీ సరిపడేన్ని ప్రభుత్వ ఉద్యోగాలు ఉండవని, వివిధ రంగాలతో పాటు, పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలు నేర్చుకుంటే యువత ఉపాధికి ఢోకా ఉండదని చెప్పారు. ఈ సందర్భంగా యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీకి సంబంధించి కీలక అంశాలను ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు పారిశ్రామికవేత్తలకు వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం హైదరాబాద్ ను ప్రపంచ స్థాయి ఆకర్షణీయ గమ్య స్థానంగా తీర్చిదిద్దేందుకు కంకణం కట్టుకుందని అన్నారు. ఇందులో భాగంగా కొత్తగా ఫ్యూచర్ సిటీని నెలకొల్పుతుందని, ఇప్పటికే ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సిటీ ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధమయ్యాయని అన్నారు. ముఖ్యమంత్రి స్వీయ ఆలోచనతో త్వరలోనే స్కిల్ యూనివర్సిటీ లో కొత్త కోర్సులు ప్రారంభమవటం ఆనందంగా ఉందన్నారు.



### తెలంగాణకు సత్తా ఉంది: ఆనంద్ మహీంద్రా

తెలంగాణ నుంచి నైపుణ్యం కలిగిన యువతను ప్రపంచానికి అందించాలన్న ముఖ్యమంత్రి ఆలోచన గొప్పదని యూనివర్సిటీ బోర్డు ఛైర్మన్ ఆనంద్ మహీంద్రా ప్రశంసించారు. మంచి విజన్ ఉన్న సమర్థ నాయకుడు సీఎం రేవంత్ రెడ్డి అంటూ కొనియాడారు. అందుకే యూనివర్సిటీ బోర్డు ఛైర్మన్ గా ఉండాలని సీఎం కోరగానే ఒప్పుకోవాల్సి వచ్చిందని ఆనంద్ మహీంద్రా అన్నారు. సాధారణంగా ప్రభుత్వాలు సబ్సిడీలు, ఆకర్షణీయ పథకాలకు ఎక్కువ ప్రాధాన్యమిస్తాయని, కానీ యువతను నిపుణులుగా తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి ఆలోచించిన తీరులోనే దార్శనికత ఉందని ఉందని అభినందించారు. తెలంగాణలోనే అతి పెద్ద యూఎస్ కాన్సులేట్ ఉందని, ఎక్కువ మంది ఇక్కడి నుంచే అమెరికాకు వెళుతున్నారని గుర్తు చేశారు. అలాంటప్పుడు ప్రపంచానికి నైపుణ్యమున్న యువతను అందించే గమ్యస్థానంగా తెలంగాణ నిలబడుతుందనడంలో సందేహం లేదన్నారు. ముఖ్యమంత్రి కల నిజం కావాలని, ఆయన ఆశయం నెరవేరాలనే ఆకాంక్షను వ్యక్తం చేశారు.

### వచ్చే నెల నుంచే కోర్సులు

రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటు చేసిన తెలంగాణ యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ కోర్సులు ఈ ఏడాది నుంచే ప్రారంభించాలని యూనివర్సిటీ బోర్డు నిర్ణయించింది. దసరా పండుగ తర్వాత అక్టోబర్ నెలలో కోర్సులను ప్రారంభించనున్నట్లు సూచన ప్రాయంగా వెల్లడించింది. ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజీ ఆఫ్ ఇండియా (ఈఎస్సీఐ)లో తాత్కాలికంగా కోర్సులను నిర్వహించనుంది. ముందుగా హెల్త్ కేర్, ఈ కామర్స్ అండ్ లాజిస్టిక్స్ కోర్సులను ప్రారంభించనుంది. ఈ కోర్సుల నిర్వహణకు అపోలోతో పాటు ఏఐజీ, లెన్స్ కార్ట్, ఫ్లిఫ్ కార్ట్, అమెజాన్, అల్కార్గో, ప్రొ కనెక్ట్, ఓ9 సొల్యూషన్స్ కంపెనీలు ముందుకొచ్చాయి. తొలి ఏడాది రెండు వేల మందికి శిక్షణ ఇవ్వాలని నిర్ణయించింది.








## చేతివృత్తిదారులను ప్రోత్సహించేందుకు విశ్వకర్మ పథకం: కలెక్టర్

**విశ్వంభర భూపాలపల్లి:** చేతివృత్తిదారులను ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రధాన మంత్రి విశ్వకర్మ యోజన పథకాన్ని ప్రవేశపెట్టినట్లు భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. పీఎం విశ్వకర్మ పథకంపై గురువారం ఐడిఓసి కార్యాలయపు కాన్ఫరెన్స్ హాల్లో జిల్లాలో పిఎం విశ్వకర్మ పథకం అమలుపై పరిశ్రమలు, పంచాయతి తదితర శాఖల జిల్లా అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ చేతి వృత్తులను ప్రోత్సహించడానికి కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన విశ్వకర్మ పథకానికి జిల్లాలో 3172 మంది దరఖాస్తు చేసుకోగా 1179 మందిని శిక్షణ నిమిత్తం సిఫారసు చేయడం జరిగిందని అన్నారు. 340 మంది శిక్షణ పూర్తి చేసుకోగా 143 మంది రుణాలు పొందారని మిగిలినవి పురోగతిలో ఉన్నట్లు తెలిపారు. 18 రకాల చేతి వృత్తులు ప్రదానంగా కమ్మరి, వడ్రంగి, స్వర్ణకార, శిల్పి, కుండలు, దుస్తులు, చీపుర్ల తయారు, బార్బర్, చెప్పులు కుట్టేవారు, బొమ్మల తయారీ, చేపల వల, దండలు చేసేవారు, తాపీ పని లాంటి వృత్తులు చేసే వారిని ప్రోత్సహిస్తారు అని అన్నారు. లబ్ధిదారులను ఎంపిక చేసి వృత్తి నైపుణ్య శిక్షణనిస్తారు. అధునాతన వృత్తి పరికరాల కొనుగోలు కోసం 15 వేల ఆర్థిక సాయంతో పాటు అదనంగా లక్ష వరకు రుణం మంజూరు చేస్తారని అన్నారు. పీఎం విశ్వకర్మ ప్రారంభమై సంవత్సరం పూర్తి అయిందని గ్రామ స్థాయిలో పీఎం విశ్వకర్మ పథకం పై పంచాయతీ కార్యదర్శులు ద్వారా అవగాహన కల్పించాలని అన్నారు. మహిళా సంఘాలు నిర్వహించే సమాఖ్యల సమావేశంలో అవగాహన కల్పించాలని సూచించారు. జిల్లాలో ఈ ప్రక్రియను మరింత వేగవంతం చేసి సాధ్యమైనంత మేరకు దరఖాస్తుల విచారణ త్వరగా పూర్తయ్యేలాచూస్తాం అని అన్నారు. జిల్లాలో పీఎం విశ్వకర్మ పథకం శిక్షణా కేంద్రం ఏర్పాటుకు ప్రతి పాదనలు పంపాలని పరిశ్రమల శాఖ అధికారులను ఆదేశించారు.ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, జిల్లా పరిశ్రమల అధికారి సిద్ధార్థ రెడ్డి, డిపిఓ నారాయణ రావు, ఎంఎస్ఎంఈ అసిస్టెంట్ కమిషనర్ నవీన్ కుమార్, పలు శాఖల జిల్లా అధికారులు, పీఎం విశ్వకర్మ డొమైన్ ఎక్స్ పర్ట్ లు నిషిధర్ రెడ్డి , యుగందర్ తదితరులు పాల్గొన్నారు.






## ఆంధ్రప్రదేశ్‌కు అదానీ గ్రూప్ రూ. 25 కోట్ల భారీ విరాళం

**విశ్వంభర, అమరావతి:** భారీ వర్షాలు, వరదలకు నష్టపోయిన ఆంధ్రప్రదేశ్‌కు విరాళాల వెల్లువ కొనసాగుతోంది. ఇప్పటికే విరాళాల ద్వారా ఏపీకి సుమారు రూ. 350 కోట్లు వచ్చాయి. తాజాగా ఏపీకి వరద సహాయం కింద అదానీ గ్రూప్ రూ. 25 కోట్లను విరాళంగా ప్రకటించింది. ఈ మేరకు అదానీ పోర్ట్స్ ఎండీ కరణ్ అదానీ విరాళం చెక్కును విజయవాడలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడికి అందజేసినట్టు అదానీ గ్రూప్ ఛైర్మన్ గౌతమ్ అదానీ ఎక్స్ వేదికగా వెల్లడించారు.సెప్టెంబర్ మొదటివారంలో భారీ వర్షాలు పడడంతో ఏపీలోని పలు జిల్లాలు వరదలతో నీట మునిగాయి. ముఖ్యంగా బుడమేరు వాగుకు పడ్డ గండ్లకారణంగా విజయవాడ నగరం నీట మునిగింది. దాదాపు వారం రోజుల పాటు బాధితులు నీళ్లల్లోనే ఉండిపోయారు. దాదాపు రెండున్నర లక్షల మంది వరద ప్రభావానికి గురయ్యారు. ఇంటిలోని వస్తువులన్నీ నీట మునగడంతో అవి ఎందుకూ పనికిరాకుండా పోయాయి. 40 మంది ప్రాణాలు కోల్పోగా వందల సంఖ్యలో పశుపక్ష్యాదులు మృత్యువాత పడ్డాయి . ఏపీలో బాధితులకు అండగా నిలిచేందుకు ఏపీ, తెలంగాణతో పాటు ఇతర రాష్ట్రాలు, దేశాల్లో ఉన్న అనేక మంది పారిశ్రామిక, సామాజక వేత్తలు విరాళాలను ప్రకటించి ముఖ్యమంత్రి సహాయనిధికి అందజేశారు.







# చరితార్థుడైన నటుడు అక్కినేని

## తెలుగుజాతి గర్వించ దగిన మహా నటుని జన్మదినం నేడు



అక్కినేనిని నిర్వచించడం ఎవరి తరం? మహా నటుడిని విశ్లేషించడం ఎవరికి సాధ్యం? ఆయన రాసిచ్చిన "అఆలు" దిద్దినంత సులువు కాదు, అంత రంగాన్ని అర్థం చేసుకోవడం, అలుపెరుగని ప్రయాణంలో ఆయన్ని అందు కోవడమే కాదు, అనుసరించడమూ ఎవరికీ సాధ్యం కాలేదు. తెలుగు సినిమా నుంచి అక్కినేని నేర్చుకున్న దానికంటే, నేర్పిపెట్టిందే ఎక్కువ. అందుకే - తెలుగు సినిమా చదివితే అక్కినేని అర్థం కాకపోవచ్చు.. అక్కినేనిని చదివితే మాత్రం తప్పక తెలుగు సినిమా అవగత మవుతుంది. తెలుగు చిత్రసీమను దశాబ్దాలపాటు నిరాటంకంగా ఏలిన రాజులు ఇద్దరు. ఒకరు విశ్వవిఖ్యాత నట సార్వభౌముడు నందమూరి తారక రాముడు, మరొకరు నట సామ్రాట్ అక్కినేని నాగేశ్వరరావు. చిత్రసీమలో నటులుగా పోటీ పడినా, జీవితంలో సోదర భావంతో మెలిగిన ఇరువురూ తెలుగు ప్రజా హృదయాల్లో సుస్థిర స్థానం సంపాదించారు. తెలుగు చిత్ర పరిశ్రమ మద్రాస్ నుంచి హైదరాబాద్ మార్చడంలో ప్రముఖ పాత్ర పోషించారు అక్కినేని. పరభాషా చిత్ర పరిశ్రమ నుండి తెలుగు చిత్ర పరిశ్రమని వేరు చేసి, మన పరిశ్రమ ఔన్నత్యాన్ని దేశ విదేశాలకు చాటిన మహా నటుడు, నిర్మాత. అన్నపూర్ణ స్టూడియోస్ అధినేత. తన వారసులను పరిశ్రమకు అందించాడు అక్కినేని.

స్టేజి నాటకాలలో స్త్రీ పాత్రలతో నటనకు మెరుగులు దిద్దుకునే క్రమంలో నాగేశ్వర్ రావు... ప్రముఖ చిత్ర నిర్మాత ఘంటసాల బల రామయ్యకు విజయ వాడ రైల్వే స్టేషన్ లో తారస పడి, ధర్మపత్ని సినిమాతో తెలుగు చిత్రసీమలో అరంగేట్రం చేశారు. 90యేళ్ల జీవితంలో 75 సంవత్సరాలు విభిన్న పాత్రల ద్వారా తెలుగు చిత్రరంగ క్రమానుగత ప్రగతిలో విడదీయ లేని బంధం, అనుబంధం అక్కినేనిది.

**బాల్యం నుంచే నాటకాలపై ప్రేమ**

1928 సెప్టెంబర్ 20న కృష్ణా జిల్లా గుడివాడ తాలూకా నందివాడ మండలం రామాపురంలో వెంకట రత్నం పున్నమ్మ దంపతులకు జన్మించిన అక్కినేని, బాల్యం నుంచే నాటకాల మీద అనురక్తి పెంచు కున్నారు. 1941 లో పి.పుల్లయ్య దర్శకత్వం వహించిన ధర్మపత్ని బాల నటునిగా తొలిసారి మేకప్ వేసుకున్నారు.1944లో ఘంటసాల బలరామయ్య నిర్మాత, దర్శకునిగా తెరకు ఎక్కించిన సీతారామ జననంలో, పూర్తి స్థాయి కథా నాయకుడి పాత్ర పోషించారు. 1949లో అన్నపూర్ణను వివాహ మాడిన అక్కినేని.. తెలుగు తమిళ, హిందీ భాషల్లో 256 సినిమాలు చేసిన అనుభవజ్ఞుడు. చివరిగా 1991 లో ఆయన నట జీవితం స్వర్ణోత్సవం సందర్భాన విడుదలైన సీతారామయ్య గారి మనవరాలు, కొత్త, యువ నటుల చిత్రాలతో పోటీపడి బాక్సాఫీసు హిట్



గా నిలిచింది. తన పుత్రుడు అక్కినేని నాగార్జున, మనవడు నాగ చైతన్యతో చివరి సినిమాలో ఆయన కలిసి నటించారు. ఆయన మనం చిత్రంలో సహజ నటనా ప్రతిభను రుచి చూపించారు. 75ఏళ్ళ సినీ ప్రస్థానంలో శరత్ చంద్ర నవల ఆధారిత దేవదాసు (1953)లో భగ్న ప్రేమికుని పాత్రకు జీవం పోశారు. ఈ పాత్రకు ఆ తర్వాత మరెంతో మంది మరిన్ని భాషలలో నటించినా, హిందీ సినిమా నటుడు దిలీప్ కుమార్... అక్కినేని నటించినదే ఒకేఒక దేవదాసు అని ప్రశంసించాడు. 1966లో నవ రాత్రి చిత్రంలో 9 పాత్రలు పోషించి ఔరా! అనిపించారు. 1975 లో భార్య అన్నపూర్ణ పేరు మీద అన్నపూర్ణ స్టూడియోస్ స్థాపించిన అక్కినేని అన్నపూర్ణ బ్యానర్ లో మొదటి సినిమా కళ్యాణి. అన్నపూర్ణ బ్యానర్ లో వచ్చిన మొదటి బ్లాక్ బస్టర్ మూవీ ప్రేమాభిషేకం. 1981 లో వచ్చిన ఈ సినిమా ఓ సంచలనం సృష్టించింది. లైలా మజ్ను, అనార్కలి, బాటసారి, ప్రేమ్ నగర్, ప్రేమాభిషేకం, మేఘ సందేశం లాంటి సినిమాల్లో విషాద పాత్రల్లో, మిస్సమ్మ, చక్రపాణి, ప్రేమించి చూడు వంటి చిత్రాల్లో హాస్యరస ప్రధాన పాత్రలు, మాయా బజార్ లో అభిమన్యునిగా, చెంచు లక్ష్మిలో విష్ణువుగా, భూకైలాస్ లో నారదునిగా, శ్రీకృష్ణార్జున యుద్ధంలో పాండవ మధ్యమునిగా పౌరాణిక పాత్రల్లో మెప్పించారు. అక్కినేని నటించిన తొలి స్వర్ణోత్సవ చిత్రం 1971 లో వచ్చిన దసరా బుల్లోడు. తెలుగులో తొలి ద్విపాత్రాభినయం చేసిన నటుడు అక్కినేని నాగేశ్వరరావు. దాసరి దర్శకత్వం వహించిన ప్రేమాభిషేకం హైదరాబాద్ లో 533రోజులు, నిరంత రాయంగా 365 రోజులు ప్రదర్శితమైన ఒకే ఒక్క తెలుగు సినిమా రికార్డు సొంతం చేసుకుంది. జయ దేవ, కాళిదాసు, జక్కన, విప్ర నారాయణ పాత్రలు అక్కినేని నటనకు కలికి తురాయిలు. మట్టి మనుషులు, ఒకే ఒక్కడు బుల్లితెర సీరియల్స్ లో నటించి, సమకాలీన నటులకు మార్గ దర్శకులు అయ్యారు.

**ఎన్నెన్నో పురస్కారాలు**

1968లో భారత ప్రభుత్వ పద్మశ్రీ, 1988లో రఘుపతి వెంకయ్య అవార్డు, 1989లో రాజ్ కపూర్ స్మారక అవార్డు, 1991 లో దాదా సాహెబ్ ఫాల్కే అవార్డు, కేంద్ర ప్రభుత్వం ద్వారా పద్మభూషణ్, 94లో లైఫ్టైమ్ అచీవ్మెంట్, 95 లో అన్నా అవార్డు, ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వ ఎన్టీఆర్ జాతీయ పురస్కారం, డాక్టర్ ఆఫ్ లెటర్స్, మూడు ఫిల్మ్ ఫేర్, నట సామ్రాట్, కళా ప్రపూర్ణ లాంటి లెక్కలేనన్ని అవార్డులు సొంతం చేసుకున్న మహా నటుడు అక్కినేని. గుడి వాడ కళాశాలకు అక్కినేని ఇచ్చిన భూరి విరాళం తోనే ఏఎన్ఆర్ కళాశాల నామాంకిత అయింది. నటసామ్రాట్ బిరుదాంకితుడుగా నటనా ప్రస్థానంలో ఎన్నో పాత్రల్లో నటించి మరెన్నో మరపు రాని చిత్రాల్లో తనకు మాత్రమే సాధ్యమయ్యే నటనతో అభిమానులను ఆకట్టు కున్నారు. తన 91 వ ఏట 2014 జనవరి 22న తెలుగు జాతి గర్వించ దగిన మహా నటుడు పరమ పదించే వరకు వెండి తెరతోవిడదీయ రాని వ్యక్తిగా కొనసాగారు. నట సామ్రాట్ అక్కినేనికి ఇద్దరు కొడుకులు, ముగ్గురు కుమార్తెలు - అక్కినేని వెంకట్, నాగార్జున, సత్యవతి, నాగ సుశీల, సరోజా. భార్య పేరుతో అన్నపూర్ణ స్టూడియోస్ నిర్మించారు. అన్నపూర్ణ స్టూడియోస్ బ్యానర్ ద్వారా, కుమారుడు అక్కినేని నాగార్జున, మనవళ్లు సుమంత్, అఖిల్ సహా పలువురు నటీనటుల్నీ, దర్శకుల్నీ పరిచయం చేశారు.



-రామ కిష్టయ్య సంగన భట్ల...
9440595494

# 'అనాహత'లో వినపడుతున్న సామాజిక ఆర్తనాదాలు

'I write because my heart speaks a different language that someone needs to hear. I write because hypocrisy doesn't need answers, rather it needs questions to heal.'


---- Shannon L. Alder

ఒక కవి తన మనసులోకి ప్రవేశించిన భావ సంచయాన్ని, భావోద్వేగాన్ని తన పరిసర భావ సంచయంతో కలగలిపి వ్యక్తపరచడం ఒక్కోసారి సరవుతుంది.ఒక్కోసారి తప్పవుతుంది.తనలో రేగే అనేక రకాల ప్రభావాల తాలూకు ప్రతిఫలనాలను కవి అనేక రకాలుగా శోధించాలి.తన వాక్కు భవిష్యత్ కాలంలో నిలబడుతుందా అని తనలో తాను మధించాలి.తనను తాను వడగట్టుకోవాలి. ఇదంతా ఎందుకంటే నామాల రవీంద్ర సూరి 'అనాహత' కవిత్వం చదివిన తర్వాత నాలో అనేక భావాలు జమిలిగా ముప్పిరిగొన్నాయి.కవి వెంట.. కవి అక్షరాల వెంట నడుస్తూపోయిన నేను, కొన్నిచోట్ల నడవలేక పోయాను. కవి ఊహకు అబ్బురపోయిన నేను, కొన్నిచోట్ల కవికి ఏర్పడిన అభిప్రాయాలకు భేదాభిప్రాయాన్నయ్యాను. అయితే కొంత తాను నడయాడిన,తిరుగాడిన మనుషుల అభిప్రాయాల, దురుద్దేశాల మాయలో కవి పడడం జరుగుతుంది. కవి కూడా మానవమాత్రుడేగా అని సరిపెట్టుకున్నా, కవి బాధ్యత గల మానవుడిగా, ఒక సగటు మానవుడి కన్నా ఒక పిసరు, ఒక అడుగు ముందు ఆలోచించే వాడిగా కవి మాటాడే మాటకు విలువుంటుంది.

'చేపదుఃఖం
సముద్రానికి తెలియనట్లుగా స్త్రీ దుఃఖం సైతం జన సముద్రానికి తెలియదు' అని స్త్రీ కవితలో కవి అన్న మాటకి ఒక సత్యమైన విలువుంది.తరువాత మాటకి ఏమంటాడో అని ఎదురుచూడడంలో ఆ మాటకు మరింత విలువుంది.చూడండి.

'స్త్రీ ఎన్ని కన్నీళ్లు కారిస్తే అందులో బాధల తర్పణలు అర్పిస్తే
పునీతుడవుతాడో కదా పురుషుడు'

ఇది పురుషులకు తగిలేలా వదిలిన వ్యంగ్యమా.. స్త్రీ బాధలు ఎంతకాలమని వగచే వెటకారమా...? స్త్రీ పట్ల కవి అడుగడుగునా నీరాజనాలు అర్పించాడు. ఇక తన భాగస్వామి ని అయితే కవి ఈ పుస్తకం సందర్భంగా, నెపంగా తనలో వున్న కృతజ్ఞతను ఏ విధంగా తెలిపాడో చదవవలసిందే. రవీంద్రసూరి కన్ను స్వతహాగా సినిమా కన్ను. ప్రతీ దృశ్యాన్ని జూమ్ చేస్తుంది.అదే తన స్థితి ని My better half @ my best poem అనే ఒక భిన్నమైన నిర్మాణమున్న కవిత రాశాడు.సినిమా




కథ నడపడంలో ఎన్ని ఎత్తులు వుంటాయో అవి ఈ కవితలో ప్రవేశపెట్టాడు.

Opening, Heroin Entry, Flash back, Song, Fight, Intermission, Pre climax, No climax అని విభాగాలుగా చెప్పిన ఈ ఏడు పేజీల కవిత ఇంతవరకు ఈ పద్ధతి లో ఏ తెలుగు కవి చెప్పని పద్ధతి. తన కథను ఆత్మ నివేదనగా మార్చి సినిమాటిక్ రూపంలో అర్థ్రంగా చెప్పడానికి ప్రయత్నించిన కవితిది.ఇంకొంత కదిలించేలా ఈ కథ/ కవిత చెప్పొచ్చు. ఈ వస్తువుతోనే బలంగా వచ్చిన కవిత ' మళ్లీ చెబుతున్నాను ' .ఎవరికి చెబుతున్నాడో చదవండి.

'సినిమా రంగం నాకో యుద్ధభూమి యుద్ధం చేయడం ఇష్టం నాతో నేను యుద్ధం చేయడం మహా ఇష్టం నా యుద్ధం లో అటూ ఇటూ నేనే నేను వదిలిన శరం నాకే తగులుతుంది.' అని ఎంత స్పష్టంగా తన కార్యరంగం సినిమా రంగంతో తలపడుతున్నాడో స్పష్టమవుతూనే వుంది.ఇంకా ఆ మార్గంలో ఎదురయ్యే గాయాలని ఏమంటున్నాడో చూడండి.

'నా యుద్ధక్షేత్రంలో ఎటు చూసినా నా శరీరం పై విసరగా విరిగిపడిన కత్తుల శరీరాలే' అనడం తాను యుద్ధానికి సర్వసిద్ధంగా వున్నానని చెప్పడమే. మొక్కవోని ధైర్యంతో జీవితంతో బాహాబాహికి దిగడమే.

'యుద్ధంలో గెలవకపోవడం విషాదం కాదు. యుద్ధం చేయకపోవడమే విషాదం ' అని ఒక revelation రావడం కూడా తనతో తాను చేస్తున్న యుద్ధం లో పాక్షిక గెలుపు కూడా.ప్రతి కళాకారుడు ఈ విధంగా ముందు తనకి తాను ఈ ధైర్యవచనాలు చెప్పుకోగలిగితేనే ఎదురుగా సవాలు విసురుతున్న సమాజానికి దీటుగా జవాబు చెప్పగలుగుతాడు.

నిర్భయ సంఘటన మీద రాసిన 'విధ్వంసం', ఊరి మట్టితో తనకున్న మట్టివేర్ల బంధాన్ని గొప్పగా తలుచుకున్న 'చిల్పకుంట్లవాసి', నాన్న ఎంత చేసినా మతికి వుండదని వాపోయే 'నాన్న రెండో పదం', ప్రకృతి నియతిని ధర్మాన్ని ప్రస్తుతించిన కవిత 'ఏది ప్రకృతి ధర్మం..? ఏది మనిషి ధర్మం?', అమ్మ మోకాలి నొప్పిని ఓర్చుకోమని అమ్మకే చెప్పిన ఓదార్పు గీతం ' అమ్మ నొప్పి నీకో దండం ', ప్రకృతి పచ్చదనాన్ని కలవరించిన ' హరిత గీతం ' , ఒక తాత్విక సారాంశ వాక్యాల ' వర్షించే మేఘం' , చేసే పని పట్ల వుండాల్సిన తాదాత్మ్యం గురించి చెప్పిన ' లీనం ' మొ|| ఈ సంపుటిలో మేలిమి కవితలు.

పాయసం తింటున్నప్పుడు పంటి కింద రాయిలా తగిలిన కవిత' జయహో మోడి'. పెద్దనోట్ల నిర్ణయానికి పరవశిస్తూ కవి తక్షణ ఆవేశానికి స్పందన ఇది.ఆ తర్వాత పెద్దనోట్ల రద్దు నిర్ణయం పేదప్రజల పాలిట అశనిపాతంగా ఎలా తగిలిందో..కార్పోరేట్ బడాబాబులకు వరంగా ఎలా మారిందో చూశాం.ఈ కోవలోనే వచ్చిన 'జనహననం', 'మరణాన్ని మంత్రిస్తున్న మతం 'వంటి కవితలలో కూడా మతం పట్ల తనకున్న అభిప్రాయాలు వెల్లడించాడు. అయితే మతం వంటి సీరియస్ విషయాలను వాఖ్యానించేటప్పుడు. ఆయా మత విధ్వంసాలకు మూలాలు తెలుసుకొని, అవగాహన చేసుకొని, బాధిత వర్గ పక్షపాతిగా మాట్లాడాలి. ఉపరితలంపై కనిపిస్తున్న అంశాలతో అభిప్రాయాలు ఏర్పరచుకోవడం సరికాదని నా భావన.

'సంపదంటే జ్ఞానం' అనగలిగినవాడు, 'జీవాల్ని పోగొట్టుకొని జీవ వైవిధ్యాన్ని వెతుక్కుంటున్నాం' అని నిర్ధారించగలిగినవాడు,' ఒడువని దుఃఖానికి మనిషే ముఖచిత్రం' అని తేల్చగలిగినవాడు, 'పిడి పట్టుకున్న వాడికి/ కత్తిమొన గుచ్చుకున్న దుఃఖం తెలిస్తే/ మనిషవుతాడు/ ఆ దుఃఖం తానైతే కవి అవుతాడు' అని ఒక ఉత్కృష్టమైన బౌద్ధిక సత్యం చెప్పగలిగినవాడు జీవితాన్ని పొరలుపొరలుగా దర్శించిన కవి అవుతాడు. తనలో మిగిలిన భావాలను మగ్గనిస్తే వచ్చే సాఫల్యం ఇది.

అయితే కొన్నిసార్లు కవి కవిత రాయాలి అనుకోవడం వల్ల కవిత సరైన విధంగా రాదు.ఇది ప్రతి కవికి అనుభవమే. ఇలాంటి స్థితి గురించే ఒక ఐరిష్ కవి ఇలా అంటున్నాడు.

'Writing poems,for me,is a bit like mining a seam of rock.One day you get some silver and the next day you get just rock '

*- Evan Boland, The Irish times*

ఆ రాయినే రత్నం గా మార్చే, ఆ శిలనే శిల్పంగా మార్చే సహనం, అవగాహన,వ్యూహం,తంత్రవిద్య కవికి కావాలి. రవీంద్రసూరి కి ఒక కల వుంది.ఆ కలను నెరవేర్చుకునే క్రమంలో కవిత్వం కల కన్నాడు.జీవితాన్ని సినిమాగా కల కన్నాడు. చెంబు చిన సత్యం సినిమా డైరెక్ట్ చేశాడు. కొన్ని షార్ట్ ఫిల్ములు తీసాడు.చాలా టెలివిజన్ సీరియల్స్ కు స్క్రిప్ట్ సమకూర్చాడు.అయినా తృష్ణ చావక యూట్యూబ్ ఛానల్ ద్వారా సాహితీ సేవ చేస్తున్నాడు.పట్టువదలక తన కలగన్న గమ్యం వేపు పయనించే ప్రయత్నం చేస్తున్నాడు. కష్టాన్ని,అన్నం పెట్టే సాధనంగా ఇష్టంగా తలచి అలుపులేక సాగుతున్నాడు.

కవే అంటున్నట్టు...

' సృష్టిలో జరిగే ప్రతీదీ మనిషి మనుగడ కోసమే స్వీకరించు-అనుభవించు' కాకపోతే ఏది స్వీకరించాలో.. ఏది త్యజించాలో కవి అంతర్నేత్రానికి అందాలి.కవి అందుకోవాలి.

రవీంద్రసూరి అనాహతలో కొన్ని విభిన్న వ్యక్తీకరణలు చేశాడు.కొన్ని తనవే అయిన వస్తువులు పట్టుకున్నాడు. తనదే అయిన తాత్వికదృష్టితో వాఖ్యానించాడు.తనలో కొట్టుకులాడే సంశయాలకు అక్షరరూపం ఇచ్చాడు.తనకు తానే కొన్ని సమాధానాలు చెప్పుకున్నాడు.తన గాయాల నుంచే గేయాలు రాశాడు.

గొప్పగా సంభావించిన కొన్ని కవితల మధ్య కొన్ని ఇంకా పరిపక్వం కాని కవితలు అనాలోచితంగా దొర్లడం వల్ల ఈ కవిత్వపొత్తం పొందాల్సినంత ప్రశంసలు పొందలేకపోయిందని నా అభిప్రాయం. అయినప్పటికీ రవీంద్రసూరిలో జీవితాన్ని ఒక తాత్విక దృష్టితో చూసి కవిత్వంగా వాఖ్యానించగల ఒక నిఖార్సయిన కవి ఉన్నాడు.అనాహత అతని కవిత్వ తాహతును తెలియజెప్పింది.ఇక అతను చేయాల్సిందల్లా తనను తాను పదును పెట్టుకొని,తనని తాను వ్యక్తీకరించుకోవడమే.అది కాగితం మీదా..వెండి తెర మీదా అనేది మాత్రం మనం వేచి చూడాలి.

-పి.శ్రీనివాస్ గౌడ్
9949429449

# మహిళా మేలుకో... నీ రక్షణ చట్టాలు తెలుసుకో..

‘కోల్‌కతా జూనియర్ డాక్టర్ హత్యాచార ఘటన’ నేపథ్యంలో బెంగాల్ ప్రభుత్వం ‘అపరాజిత’ బిల్లును తీసుకొచ్చింది. మహిళలు – పిల్లలపై లైంగిక నేరాలు, వేగవంతమైన విచారణ, దోషులకు కఠిన శిక్షలు విధించడమే లక్ష్యంగా.. బెంగాల్ అసెంబ్లీలో ఈ బిల్లు ఆమోదం పొందింది. 2012లో జరిగిన ‘ఢిల్లీ హత్యాచార ఘటన’ సందర్భంగా ‘నిర్భయ’ చట్టం అమల్లోకి వచ్చింది. ఇప్పుడు బెంగాల్ ప్రభుత్వం ‘అపరాజిత’ బిల్లును ఆమోదించింది. ఈ క్రమంలో ఎన్నో ప్రశ్నలు తెరపైకి వస్తున్నాయి. అసలు.. మహిళలు – చిన్నారులపై వేధింపులు, వారి రక్షణ కోసం జాతీయ, రాష్ట్ర స్థాయుల్లో ఎలాంటి చట్టాలు అమలులో ఉన్నాయి? వాటిలో ముఖ్యమైనవి ఏవి? మహిళలను రక్షించడానికి జాతీయ, రాష్ట్ర స్థాయుల్లో అనేక చట్టాలు రూపొందాయి. అయితే, ఆయా చట్టాలపై సరైన అవగాహన లేకపోవడంతో బాధితులు వాటిని సద్వినియోగం చేసుకోలేకపోతున్నారు. ఈ క్రమంలో భారతదేశంలోని ప్రతి మహిళా తెలుసుకోవాల్సిన ఏడు ముఖ్యమైన చట్టపరమైన హక్కుల గురించి ఇప్పుడు తెలుసుకుందాం!

**గృహహింస నిరోధక చట్టం:**

గృహహింస నిరోధక చట్టం – 2005. మహిళలను ఇంట్లో ఎదురయ్యే హింస నుంచి రక్షిస్తుంది. గృహిణిపై చేయి చేసుకోవడమే కాదు.. ఆమెను మాటల ద్వారా, ఆర్థికంగా, భావోద్వేగాలపరంగా, లైంగికంగా వేధించినా.. 498 సెక్షన్ ప్రకారం దోషులను కఠినంగా శిక్షించవచ్చు.

**సమాన పనికి సమాన వేతనం..**

సమాన పనికి సమాన వేతనం పొందడం మహిళల హక్కు. మహిళా కూలీలు మొదలుకొని.. ఉన్నతోద్యోగాలు చేసే మహిళల కోసం ‘సమాన వేతన చట్టం’ అమలులో ఉన్నది. పనిచేసే మహిళలు.. వారి సహోద్యోగులతో సమానమైన వేతనాన్ని ఈ చట్టం ద్వారా డిమాండ్ చేయొచ్చు. కూలీలు, ఉద్యోగినులకు వేతనాలు, ఇతర అలవెన్సుల విషయంలో లింగ వివక్ష చూపడం నేరం కూడా!

**పని ప్రదేశాల్లో మహిళలకు రక్షణ...**

పని ప్రదేశంలో మహిళలపై లైంగిక వేధింపులను అరికట్టేందుకు ప్రత్యేకమైన చట్టం ఉన్నది. ఈ చట్టం ప్రకారం.. పనిలో లైంగిక వేధింపులకు గురైతే.. ఉన్నతాధికారులకు నివేదించే హక్కు మహిళలకు ఉంది. ఈ చట్టం ప్రకారం.. పనిలో లైంగిక వేధింపులకు సంబంధించిన ఫిర్యాదులను స్వీకరించడానికి, వాటిపై విచారణ చేపట్టడానికి సంస్థలు అంతర్గత ఫిర్యాదుల కమిటీని ఏర్పాటుచేయాలి. పది లేదా అంతకంటే



ఎక్కువమంది ఉద్యోగులు ఉన్న ప్రతి కంపెనీ.. ఈ కమిటీని ఏర్పాటు చేసుకోవాల్సిందే! ఎవరైనా మహిళా ఉద్యోగి వేధింపులకు గురైతే.. సదరు బాధితురాలు ఈ అంతర్గత ఫిర్యాదుల కమిటీకి ఫిర్యాదు చేయవచ్చు.

**రాత్రిపూట అరెస్టు వద్దు...**

సూర్యాస్తమయం తర్వాత, సూర్యోదయానికి ముందు.. మహిళలను అరెస్టు చేయకూడదు. ఏవైనా తప్పనిసరి పరిస్థితులు ఎదురైతే.. ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ ఆదేశంతో మాత్రమే రాత్రి సమయంలో మహిళలను అరెస్టు చేయడానికి అవకాశం ఉంటుంది. అంతేకాకుండా, మహిళా ఖైదీని ప్రశ్నించే సమయంలో మహిళా కానిస్టేబుల్‌తోపాటు మహిళకు చెందిన కుటుంబసభ్యులు లేదా స్నేహితులు కూడా ఆమె పక్కన ఉండొచ్చు.

**గోప్యత హక్కు..**

లైంగిక వేధింపులకు గురైన మహిళలకు.. ‘గోప్యత హక్కు’ ఉంటుంది. దీని ప్రకారం.. బాధితురాలి పేరు, ఇతర వివరాలను బయటికి వెల్లడించకూడదు. మేజిస్ట్రేట్ ఎదుట ఒంటరిగా లేదా మహిళా పోలీసు అధికారి సమక్షంలో తన వాంగ్మూలాన్ని నమోదు చేసుకునే హక్కు బాధితురాలికి ఉంటుంది.

**ఉచిత న్యాయ సహాయం**

లీగల్ సర్వీసెస్ అథారిటీస్ యాక్ట్.. అత్యాచార బాధితులకు ఉచిత న్యాయ సహాయాన్ని అందిస్తుంది. మహిళలు ఇబ్బందులు ఎదుర్కొన్నప్పుడు న్యాయసహాయం పొందడానికి ఈ చట్టం హామీ ఇస్తుంది.

**గౌరవానికి భంగం కలగకుండా చూసుకొనే హక్కు..**

లైంగిక వేధింపుల బాధితురాలికి.. తన గౌరవానికి భంగం కలగకుండా చూసుకొనే హక్కు ఉంటుంది. దీని ప్రకారం.. ఏదైనా వైద్య పరీక్షలు అవసరమైతే కేవలం మహిళా వైద్యురాలి ద్వారానే పరీక్షలు నిర్వహించాలి. ఇతరుల సమక్షంలో ఏ విధమైన శారీరక/ మానసిక పరీక్షలు నిర్వహించడం చట్టవిరుద్ధం.

# రీజినల్ రింగ్ రోడ్ అలైన్‌మెంట్ మార్పుతో రైతుల్లో ఆందోళన

**దీనివల్ల ప్రజాప్రతినిధులకు తప్ప రైతులకు ప్రయోజనం శూన్యం**

**పాతదానినే కొనసాగించాలని రైతుల డిమాండ్**

**విశ్వంభర, ఆమనగల్లు:** తెలంగాణ గుండెకాయ హైదరాబాదు చుట్టూ ఔటర్ రింగ్ రోడ్డు దాని చుట్టూ కొత్తగా గత ప్రభుత్వ హయాంలోనే రీజినల్ రింగ్ రోడ్ అలైన్మెంట్ దాదాపుగా ఖరారైన ట్రిపుల్ ఆర్ దక్షిణ భాగంలో వందల ఎకరాలు రైతుల భూములు ఉన్నచోట అలైన్మెంట్లో కీలక మార్పులు చేయడం కలకలం రేపుతున్నది. ఈ నేపథ్యంలో గత అలైన్మెంట్లో సర్కారు భూముల నుంచి వెళ్లిన రీజినల్ రింగు రోడ్డు ఇప్పుడు సన్న, చిన్నకారు, పాడిరైతుల కొద్దిపాటి భూములనుంచే పోతుండడంతో దీని ఆంతర్యం ఏమిటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు?... పైగా ప్రభుత్వం 300 అడుగుల వెడల్పుతో గ్రీన్ ఫీల్డ్ రోడ్లంటూ అవుటర్ నుండి రీజినల్ రోడ్డు సంధానానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీనివల్ల ఎవరికి ప్రయోజనం కలుగుతుందని ఫోర్త్ సిటీ మాట ఏమో గాని మా ప్రాణాధారమైన భూముల మాటేమిటని రైతులు ప్రశ్నిస్తున్నారు...? రంగారెడ్డి జిల్లా అమనగల్, తలకొండపల్లి నుంచి మాడ్గుల వరకు పాత అలైన్మెంట్లో అత్యంత కీలకమైన మార్పు జరిగింది. గత అలైన్మెంట్ లో మాడ్గుల మండలంలోని కొలుకులపల్లి-బ్రాహ్మణపల్లి-నర్సాయిపల్లి- పెద్ద మాడ్గుల-అప్పారెడ్డిపల్లి మీదుగా అమనగల్ మండలంలోని విఠాయిపల్లి నుంచి వెళ్లింది. కానీ తాజా అలైన్మెంట్ మాత్రం మాడ్గుల మండలంలోని అన్నబోయినపల్లి- బ్రాహ్మణపల్లి- నల్లచెరువు- మాడ్గుల-సింగంపల్లి మీదుగా అమనగల్ మండలంలోని మేడిగడ్డ తండా- గుడి తండా నుంచి వెళ్తుంది. ఇలా పాత దానికి ఇప్పటిదానికి మధ్య 3-4 కిలోమీటర్ల దూరం పెంచారు. తలకొండపల్లి మండలం చుక్కాపూర్ సమీపంలో నుంచి ట్రిపుల్ ఆర్ గత అలైన్మెంట్ ప్రాథ మికంగా నిర్ధారించారు. కానీఇటీవల కాంగ్రెస్ ప్రభుత్వం కీలక మార్పులు చేపట్టింది. ఈ మేరకు అధికారులు సర్వే చేసి అలైన్ మెంట్ ఖరారుకు గుర్తులు కూడా పెట్టారు. దీంతో గతంలో 189 కిలోమీటర్ల పొడవుగా ఉన్న దక్షిణ భాగం రింగురోడ్డు ఐదు కిలోమీటర్లు పెరిగి 194 కిలోమీటర్లకు చేరింది. ముఖ్యంగా ఆమనగల్, తలకొండపల్లి, మాడుగుల, చేవెళ్ల ప్రాంతంలోనే దాదాపు 2-5 కిలోమీటర్ల వరకు అలైన్ మెంట్ను దూరం జరిగింది. పాత అలైన్మెంట్లో మార్పులను గుట్టు చప్పుడు కాకుండా చేయడంతోపాటు వాటిని బయటకు చెప్పొద్దంటూ అధికారులకు సైతం ఆదేశాలు జారీ చేశారు. అలైన్ మెంట్ మార్పు వల్ల ప్రభుత్వ, కాంగ్రెస్ పెద్దల భూములకు ప్రయోజనం చేకూర్చేందుకే వంకర తిరిగినట్లుగా తెలుస్తున్నది. ఇప్పుడు దానిని 3-4 కిలోమీటర్ల దూరం అవతలికి జరిపారు. తాజాగా కొత్త అలైన్మెంట్ వంద ఎకరాలకు పైబడి ఉన్న ప్రజా ప్రతినిధుల





భూములకు దగ్గరలో ఉన్నాయి. తద్వారా ఈ భూములకు కిలోమీటరు లోపు దూరం నుంచే ట్రిపుల్ ఆర్ వెళ్తుందని స్థానికులు తెలిపారు. దీంతో మార్పులకు అనుగుణంగా అధికారులు సర్వే నిర్వహించి, గుర్తులు వేస్తుండటంతో చుట్టుపక్కల గ్రామాల రైతులకు కంటిమీద కునుకు కరువైంది. అనేకమంది రైతులు ఆందోళన చెందుతున్నారు. పెద్దోళ్ల భూముల కోసం తమ ఒకటీరెండు ఎకరాలను తీసుకోవాలని చూస్తున్నారంటూ ఆవేదన చెందుతున్నారు. కొన్నిచోట్ల రైతులు ప్రజా ప్రతినిధులను మరికొన్నిచోట్ల సర్కార్ కు వ్యతిరేకంగా ఆందోళనకు సిద్ధమమని చెప్తున్నారు ఈ కొత్త అలైన్మెంట్ వల్ల ప్రజా ప్రతినిధులకు తప్ప రైతులకు ఏం లాభం లేదని పాత అలట్మెంటే ఖరారు చేయాలని ఈ ప్రాంత రైతులు కోరుతున్నారు.

## కొత్తగూడెంలో విమానాశ్రయం ఏర్పాటు చేయండి



**విశ్వంభర, హైదరాబాద్ :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో విమానాశ్రయం ఏర్పాటు చేయాలని రాష్ట్ర వ్యవసాయ శాఖమంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. ఈ మేరకు కొత్తగూడెంలో విమానాశ్రయం ఏర్పాటు చేయాలని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడుని కలిసి వినతిపత్రం అందజేశారు. కాగా, కొత్తగూడెం జిల్లాలో విమానాశ్రయం ఏర్పాటు చేయాలని బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే కేంద్రప్రభుత్వాన్ని కోరిన విషయం తెలిసిందే. నాటి ప్రభుత్వం టెక్నో ఎకనామిక్ ఫీజ్‌బిలిటీ రిపోర్టును రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పి ంచింది. గతంలోనే భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో నిర్మించతలపెట్టిన విమానా శ్రయ భూములకు సంబంధించి సైట్ క్లియరెన్స్ ఇవ్వాలని ఎయిర్ పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా అధికారులు నివేదికలో ప్రభుత్వాన్ని కోరారు. ఎయిర్ పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా అధికారులు సైతం సానుకూల నివేదిక ఇవ్వడంతో జిల్లా ప్రజల చిరకాల కోరికగా ఉన్న విమానాశ్రయం ఏర్పాటు ప్రక్రియకు నాడే బీజం పడింది.

## బీఆర్ఎస్ నేత పెద్ది సుదర్శన్ రెడ్డి హౌస్ అరెస్ట్



**విశ్వంభర, వరంగల్ :** రాష్ట్రంలో అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రతి చిన్న విషయానికి ప్రతిపక్షాల నేతలను ముందుస్తుగా అరెస్ట్ చేయడం పరిపాటిగా మారింది. తాజాగా వరంగల్ జిల్లా నర్సంపేటలో మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, దామోదర రాజనర్సింహ పర్యటించి జిల్లా జనరల్ హాస్పిటల్, ప్రభుత్వ మెడికల్ కళాశాలను ప్రారంభించనున్నారు. కాగా, మంత్రులను అడ్డుకుంటారనే నెపంతో మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డిని పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు. కాగా, తెలంగాణ ఉద్యమ నాయకుడు నర్సంపేట నియోజకవర్గం అభివృద్ధికి ఎంతో పాటుపడిన సుదర్శన్ రెడ్డిని అరెస్ట్ చేయడం అన్యాయమని బీఆర్ఎస్ శ్రేణులు ఆగ్రహం వ్యక్తం చేశాయి. ఇలాంటి అరెస్ట్‌లతో ప్రశ్నించే గొంతులను అడ్డుకోలేరన్నారు. అందరినికి కలుపుకొని చేపట్టాల్సిన అభివృద్ధి పనులను ఇలా దొంగచాటుగా చేయడమేంటని ప్రశ్నించారు.

## టీచర్లను నియమించాలని
## రోడ్డెక్కిన ఆదర్శ పాఠశాల విద్యార్థులు



**విశ్వంభర, కొమురం భీం ఆసిఫాబాద్ :** రాష్ట్రంలో విద్యార్థుల ఆగమ్యగోచరంగా మారింది. విద్యా శాఖమంత్రి లేక గురుకులాలు, పాఠశాలల్లో అనేక సమస్యలతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. సమస్యల పరిష్కారం కోసం రోడ్డెక్కుతున్నారు. తాజాగా ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని తెలంగాణ ఆదర్శ పాఠశాల విద్యార్థులు ధర్నా చేపట్టారు. టీచర్లు లేక తాము విద్య పరంగా నష్టపోతున్నమని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల జరిగిన ఉపాధ్యాయుల బదిలీల్లో ఆసిఫాబాద్ ఆదర్శ పాఠశాల నుండి 17 మంది ఉపాధ్యాయులు బదిలీపై వెళ్లగా వారి స్థానంలో కేవలం ఇద్దరు ఉపాధ్యాయులు మాత్రమే రావడంతో పాఠాలు చెప్పే వారులేక ఇబ్బంది పడుతున్నారు. దీంతో గురువారం విద్యార్థులు భారీ సంఖ్యలో ర్యాలీగా బయలుదేరి రహదారిపై కూర్చొని ధర్నా చేపట్టారు. వారం రోజుల నుంచి ఉపాధ్యాయులు లేక తరగతులు నిర్వహించడం లేదని పదో తరగతి విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేశారు. పరీక్షలు కూడా వస్తున్న తరుణంలో తమకు పాఠాలు చెప్పనిదే పరీక్షల్లో ఏమి రాయాలని తమ గోడును వెళ్లబోసుకున్నారు. సంబంధిత అధికారులుచొరవ తీసుకొని తమ భవిష్య త్తులో అంధకారంలో నెట్టకుండా త్వరగా ఉపాధ్యాయులు వచ్చేలా చేసి తమకు న్యాయం చేయాలన్నారు. దాదాపు రెండు గంటల పాటు రోడ్డుపై కూర్చొని ధర్నా చేపట్టడంతో భారీగా ట్రాఫిక్ జామ్ అయింది.

## క్రీడాప్రాంగణాల్లో వాకింగ్ ట్రాక్‌ల శంకుస్థాపన



**విశ్వంభర, మహబూబాబాద్:** మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో ఉన్న ప్రభుత్వ జూనియర్ కాలేజ్ నందు వాకింగ్ ట్రాక్‌లను ను నాణ్యత ప్రమాణలతో పనులు పూర్తి చేయాలని ఎమ్మెల్యే మురళి నాయక్ అన్నారు. వాకింగ్ ట్రాక్ పనుల కోసం కొబ్బరికాయ కొట్టి పనులకు శంకు స్థాపన చేశారు. పరిశీలించిన వెంటనే ఆరోగ్యం బాగుంటేనే మనంబాగుంటమూ ..ఆరోగ్యం బాగుంటునే సమాజం బాగుంటుందన్నారు. నన్ను ఎంతో నమ్మకంతో గెలిపించిన ఈ మహబూబాబాద్ ప్రజానీకానికి, మనం ఏదైనా చేస్తే భావితరాలకు ఉపయోగపడే విధంగా ఉండాలని దాని నిమిత్తం వెంటనే ఎంత ఖర్చయినా సరే ఈ వాకింగ్ ట్రాక్ ను, అదేవిధంగా పక్కన మరుగుదొడ్ల నిర్మాణం తప్పకుండా చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ఉషోదయ వాకర్స్ అసోసియేషన్ సభ్యులు ఎమ్మెల్యే గారికి పుష్పగుచ్చం ఇచ్చి శాలువతో సన్మానిం చారు. మహబూబాబాద్ అర్బన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఘణపురపు అంజయ్య, వార్డ్ కౌన్సిలర్ పోతురాజు, జిల్లా మైనార్టీ అధ్యక్షులు మొహమ్మద్ ఖలీల్ , బోళ్ల రాజు, స్థానిక కాంగ్రెస్ పార్టీ వార్డ్ నాయకులు సీనియర్ నాయకులు వాకర్స్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

## హైదరాబాద్ మెట్రో ఎక్స్ అకౌంట్ హ్యాక్

**విశ్వంభర, హైదరాబాద్:** హైదరాబాద్ మెట్రో ఎక్స్ అకౌంట్ హ్యాక్‌కు గురైంది. దీనిపై మెట్రో యాజమాన్యం కీలక ప్రకటన చేసింది. తమ ఎక్స్ హ్యాండిల్ ఏ ltmhyd హ్యాక్ అయిందని, అకౌంట్‌ను సంప్రదించేందుకు ఎవరూ ప్రయత్నించవద్దని కోరింది. ఖాతాను త్వరగా పునరుద్ధరించేందుకు చర్యలు చేపట్టామని వెల్లడించింది. సమాచారం అందిస్తామని పేర్కొంది. అప్పటి వరకు అందులో వచ్చే పోస్టుల పట్ల జాగ్రత్త వహించాలని ప్రయాణికులకు సూచించింది.

## విద్యార్థుల మెరుపు ధర్నా



**విశ్వంభర, షాద్‌నగర్:** సమయానికి తమకు బస్సు సౌకర్యం కల్పించడంలో ఆర్టీసీ యాజమాన్యం విఫలమైందని వివిధ గ్రామాల విద్యార్థులు ఆరోపిస్తున్నారు. తమకు సమయానికి బస్సులు రాక క్లాసులకు ఆలస్యమవుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గురువారం షాద్ నగర్ పట్టణ చౌరస్తాలో విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో విద్యార్థులు మెరుపు ధర్నాకు దిగారు. దీంతో అరగంటకు పైగా ఎక్కడికక్కడ వాహనాలు నిలిచిపోయాయి. తమ సమస్యను ఎన్ని సార్లు ఆర్టీసీ అధికారులకు విన్నవించిన పట్టించుకోవడం లేదని విద్యార్థులు అన్నారు. చివరకి పోలీసులు రంగ ప్రవేశం చేసి ధర్నా చేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులను అదుపులోకి తీసుకున్నారు.

## బీఆర్ఎస్ నాయకుల ముందస్తు అరెస్టులు




**విశ్వంభర, కొందుర్గు:** ప్రజాభవన్ ముట్టడికి ఆందోళన చేయనున్న నేపథ్యంలో పోలీసుల అదుపులో కొందుర్గ్ మండల మాజీ వైస్ ఎంపీపీ రాజేష్ పటేల్,బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు శ్రీధర్ రెడ్డి, రామకృష్ణ, చంద్ర శేఖర్, వాసురి,రాజు. కొందుర్గ్ మండల బిఆర్ ఎస్ నాయకులను స్థానిక పోలీసులు ముందస్తు అరెస్టులు చేశారు. రైతులు అందరూ ఏకమై గ్రామాలు, మండలాలు, జిల్లాల వారిగా చలో ప్రజాభవన్ ఆందోళనలో పాల్గొని రుణ మాఫీ అయ్యేవరకు పోరాటం చేద్దామన్న పోలీసులు ముందస్తు చర్యలు చేశారు.

## బీఆర్ఎస్ నాయకుల అరెస్టు



**విశ్వంభర,కొత్తూరు:** బీఆర్ఎస్ అధిష్ఠానం ప్రజాభవన్ ముట్టడికి పిలుపునిచ్చిన నేపథ్యంలో కొత్తూరు పోలీసులు గురువారం బీఆర్ ఎస్ నాయకులను అరెస్టు చేశారు. అరెస్ట్ అయిన వారిలో బీఆర్ఎస్ మండల ప్రెసిడెంట్ మెండే కృష్ణ యాదవ్, సీనియర్ నాయకుడు దేవేందర్ యాదవ్, కౌన్సిలర్లు మాదారం నరసింహ గౌడ్, సోమ్లా నాయక్, నాయకులు మాజీ ఎంపీటీసీ రాజేందర్ గౌడ్, రవి నాయక్, కొండరెడ్డి విష్ణుమూర్తి, నాగరాజు గౌడ్ తదితరులు ఉన్నారు.

## పారదర్శకంగా ఆహార భద్రత కార్డులు జారీ: మాజీ ఎమ్మెల్యే కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి



విశ్వంభర, మహేశ్వరం: తెలంగాణ ప్రభుత్వం అర్హులైన పేదలందరికీ కొత్త రేషన్ కార్డులను మంజూరు చేస్తుందని మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్చార్జి, మాజీ ఎమ్మెల్యే కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి చెప్పారు. పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి నేతృత్వంలో క్యాబినెట్ సబ్ కమిటీ ఆహార భద్రత కార్డుల జారీపై విధివిధానాలు ప్రభుత్వానికి అందించగానే వచ్చే అక్టోబర్ నెలలోనే దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. ఆన్ లైన్, అఫ్ లైన్ దరఖాస్తులు మా తుక్కుగూడ కార్యాలయంలో కూడా అందుబాటులో ఉంచుతామని కేఎల్ఆర్ తెలిపారు. దాదాపు రాష్ట్రవ్యాప్తంగా 15 లక్షల కొత్త కార్డులు మంజూరు చేసేందుకు సీఎం రేవంత్ రెడ్డి సర్కార్ కసరత్తు చేస్తుందన్నారు. రేషన్ సరుకులపై ఎంత భారమైనా పేదోడికి అండగా ఉండేందుకు ప్రజాపాలన కొనసాగుతోందన్నారు కే ఎల్ ఆర్ లబ్ధిదారులు బ్రోకర్లకు డబ్బులు ఇచ్చి మోస పోవద్దన్నారు లక్ష్మారెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వం పారదర్శకంగా అర్హులైన పేదలందరికీ కార్డులు జారీ చేస్తుందని కేఎల్ఆర్ తెలిపారు.

## ఓటర్ జాబితాను సరిచేయాలి




**విశ్వంభర, మహేశ్వరం:** మహేశ్వరం మండలం నాగారం గ్రామ పంచాయతీ ఓటర్ జాబితా పై ఉన్న అభ్యంతరాలను, సమస్యలను ఎంపీడీఓ దృష్టికి తీసుకెళ్లిన బీసీ ఎస్సీ ఎస్టీ ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు పల్నాటి నరేష్ నేత, కాంగ్రెస్ గ్రామ అధ్యక్షులు ఘనపురం రాజు, వెంకటేష్ యాదవ్ మాట్లాడుతూ గ్రామంలో మరణించిన వారి పేర్లను వెంటనే జాబితా నుండి తొలగించాలి ఏ వార్డులో ఓటర్ నివసిస్తున్నాడో, ఆ వార్డులోనే ఓటు ఉండాలన్నారు. అలా కాకుండా ఓటర్నును ఒక వార్డ్ నుండి మరొక వార్డులోకి మారిస్తే ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉంది ఒక వార్డులో ఏ సామజిక వర్గం ఓట్లు ఎక్కువగా ఉన్నాయో, ఆ సామజిక వర్గం వారికే రిజర్వేషన్ వర్తించేలా చూడాలి ఉదాహరణకు బీసీలు అధికంగా ఉంటే వారికే ఇచేలా ఎస్సీ లు అధికంగా ఉంటే వారికే ఇచేలా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే ఒక గ్రామ పంచాయతీ లోని అన్ని వార్డ్ లకు ఒక నిర్థిష్ట సరిహద్దులను కేటాయించాలి, వార్డ్ యొక్క బౌగోలిక సరిహద్దులు స్పష్టంగా లేకపోవటంతో ఎవరి వార్డ్ ఎక్కడ ఉందో తెలియని పరిస్థితి ఉంది,వెంటనే వార్డ్‌లకు నంబర్స్ బోర్డ్ ఏర్పాటు చేయాలన్నారు.

## ఎస్సై పై చర్యలు తీసుకోవాలి



**విశ్వంభర, కాటారం:** వినాయకుని నిమజ్జనం రోజున మద్యం మత్తులో దుర్భాషలాడిన మధుసూదన్ రెడ్డిని చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని బిసి సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి, పద్మశాలి సంఘం జాతీయ నాయకుడు పంతకాని శ్రీనివాస్ గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డిమాండ్ చేశారు. వికారాబాద్ జిల్లా పూడూరు మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో ఏర్పాటుచేసిన వినాయకుని నిమజ్జనం చేసేందుకు ఏర్పాట్లు చేసుకుని తీసుకు వెళ్తున్న సమయంలో మద్యం మత్తులో వచ్చిన ఎస్ఐ మధుసూదన్ రెడ్డి నిర్వాహకులను, గ్రామ ప్రజలను తీవ్ర దుర్భాష లాడారన్నారు. వార్డు సభ్యురాలు సుజాతను చేపట్టి లాగి వేసి దాడి చేయడానికి ప్రయత్నం చేయగా అడ్డు వచ్చిన గ్రామస్థులను కూడా తీవ్రంగా దుర్భాషలాడారన్నారు. గ్రామస్తులు పోలీసు ఉన్నతాధికా రులకు ఫోన్ చేయగా సంఘటన స్థలానికి వచ్చిన పోలీస్ అధికారులు పరిస్థితి సమీక్షించి ఎస్సై మధుసూదన్ రెడ్డి పై చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని తెలిపారు. వెంటనే ఎస్ఐపై కఠినంగా శిక్షించాలని లేకపోతే బీసీ సంఘాలు, హిందూ సంస్థల ఆధ్వర్యంలో వికారాబాద్ జిల్లా ఎస్పీ కార్యాల యాన్ని ముట్టడిస్తామని పంతకానీ శ్రీనివాస్ హెచ్చరించారు.

## వరద సహాయకచర్యల్లో టీడీఎఫ్




**విశ్వంభర, కూసుమంచి:** భారీ వరదల నేపథ్యంలో తెలంగాణ డెవలప్‌మెంట్ ఫోరం మరోసారి మానవత్వం చాటుకుంది. ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం పాలేరు, నాయకునిగూడెం గ్రామాల్లో వరద సహాయక చర్యలు చేపట్టింది. భారీ వరదల వల్ల ఇంటిలోని ప్రతి వస్తువును కోల్పోయిన నిరుపేదలకు ఆహారం, కిరాణా సామాను పంపిణీ చేశారు. పాలర్ రిసార్వియో, టీడీఎఫ్ ఇండియా జనరల్ సెక్రటరీ ఎ.వినీల్ నేతృత్వంలో టీడీఎఫ్ వాలంటీర్లు వరద ప్రభావిత ప్రాంతాలను సందర్శించి వరద బాధితులకు ఆహారం. నిత్యవసర కిరాణా సరుకులు పంపిణీ చేశారు. కష్టకాలంలో తమకు పాఠశాల స్టేషనరీ, ప్రాథమిక మందులు, బట్టలు అం దించమని కోరారు. ఇంటి ఎలక్ట్రికల్‌ను రిపేర్ చేయాలన్నా రు. వైరింగ్ వ్యవస్థలు, గృహ ఎలక్ట్రికల్ ఉపకరణాలు వరదల వల్ల వారి ఇళ్లు మునిగిపోవడం వల్ల దెబ్బతిన్నాయి. ఈ అభ్యర్థనలను త్వరలో నెరవేరు స్తామని టీడీఎఫ్ ఇండియా ప్రెసిడెంట్ రాజేశ్వర్ రెడ్డి తెలిపారు. కష్ట సమయాల్లో నిరుపేదలను ఆదుకునేందుకు మరిన్ని నిధులు సమకూర్చేందుకు టీడీఎఫ్-యూఎస్ఏ, టీడీఎఫ్ కెనడా, టీడీఎఫ్ యూకే, యూరప్ వంటి వివిధ దేశాలకు చెందిన టీడీఎఫ్ చాప్టర్‌లతో కలిసి పనిచేస్తున్నట్లు తెలిపారు. కష్ట సమయాల్లో తమ మాతృభూమి తెలంగాణకు సహాయం చేయడానికి ముందుకు వచ్చి సహాయం చేసినందుకు దేశంలోని అన్ని ఛాప్టర్‌లకు ధన్యవాదాలు తెలిపారు. వరద సహాయక శిబిరాలను అమలు చేయడం కోసం విరాళాలు అందించిన ఎన్నారైలకు కూడా ధన్యవాదాలు తెలిపారు.

**రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని గురువారం మర్యాద పూర్వకంగా కలిసి మండల అభివృద్ధికి కృషి చేయాలని కోరిన తలకొండ పల్లి కాంగ్రెస్ పార్టీ మాజీమండల అధ్యక్షులు గుజ్జుల మహేష్..**
**విశ్వంభర, తలకొండపల్లి**



## మున్సిపల్ కార్పొరేషన్ అధికారులకు సన్మానం



**విశ్వంభర,మహేశ్వరం:** మీర్పేట్ మున్సిపల్ కార్పొరేషన్ జిల్లెలగూడ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మీర్పేట్ మున్సిపల్ కార్పొరేషన్ మంత్రాల చెరువులో సిటీ నలు మూల నుంచి గణేష్ నిమజ్జన కార్యక్రమం ను మీర్పేట్ మున్సిపల్ కార్పొరేషన్ అధ్యక్షులుఅర్కల కామేష్ రెడ్డి ఆధ్వర్యంలో స్థానిక ప్రజా ప్రతినిధులు మున్సిపల్ అధికారులు సిబ్బంది ఎటువంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా ప్రశాంతంగా నిమజ్జన కార్యక్రమ పటిష్టమైన ఏర్పాట్లు చేసి శాంతియుతంగా జరగటానికి కష్టపడి పని చేసినందుకు మున్సిపల్ కమిషనర్, డి ఈ, ఏ ఈ,మేనేజర్, శానిటేషన్ సిబ్బందిని ఘనంగా శాలువాతో సన్మానించి ధన్యవాదాలు తెలియజేసిన మహేశ్వరం నియోజకవర్గ ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ఈ సందర్భంగా సబితా ఇంద్ర రెడ్డి మాట్లాడుతూ చుట్టుప్రక్క ప్రాంతం నుంచి నిమజ్జనానికి విచ్చేసిన భక్తులు ఏర్పాట్లు బాగున్నాయని నా దృష్టికి తేవడం జరిగిందని, మీ అందరి కృషి అభినందనీయమని తెలియజేస్తూ మరొకసారి వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మీర్పేట్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్శ్రీమతి దుర్గా దీప్లాల్ చౌహాన్. డిప్యూటీ మేయర్ విక్రం రెడ్డి ఫ్లోర్ లీడర్ అరకల భూపాల్ రెడ్డి కార్పొరేటర్లు నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## తీవ్ర దుర్గంధంతో ఇబ్బందులు పడుతున్న గ్రామస్తులు..

**మున్సిపల్ కమిషనర్ చర్య తీసుకోవాలని వినతి**



**విశ్వంభర, షాద్‌నగర్:** షాద్ నగర్ పురపాలక సంఘం పరిధిలో ఐదవ వార్డ్ సోలిపూర్ గ్రామంలో డంపింగ్ యార్డ్ కాలుష్య కుంపటిగా తయారైయ్యి, రహదారిపై నిత్యం ప్రయాణించే వారిపై విషపూరిత వాయువులు వెదజల్లుతుంది. ప్రజల ఆరోగ్యాలకు హానికరంగా మారిన వాయు కాలుష్యంపై స్థానికులు రైతులు చేసిన ఫిర్యాదులపై నియంత్రణ కరువైందని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పురపాలక సంఘం పరిధిలో సంబంధిత అధికారులు పరిస్థితి అధ్యయనం చేసి పరిసర గ్రామాల ప్రజల ఇక్కట్లు తొలగించాలని స్థానికులు పరిసర గ్రామ ప్రజలు పడుతున్న అవస్థలు గమనించాలని సంబంధిత అధికారులను కోరుతున్నారు.

# నేటి నుంచి సివిల్స్ మెయిన్స్ పరీక్షలు..

## 30 నిమిషాల ముందే గేట్లు మూసివేస్తాం: అధికారుల వెల్లడి



**విశ్వంభర, హైదరాబాద్:** కేంద్ర ప్రభుత్వ సర్వీసుల్లోని ఉద్యోగాల భర్తీకి యూపీ ఎస్సీ నిర్వహించే సివిల్ సర్వీసెస్ పరీక్షలకు దేశ వ్యాప్తంగా ప్రతీయేట లక్షలాది మంది యువత పోటీ పడు తుంటారు. సివిల్ సర్వీసెస్ ఎగ్జామి నేషన్ సీఎస్ఈ 2024 ప్రిలిమినరీ పరీక్ష ఇప్పటికే పూర్తికాగా.. రేపట్నుంచి మెయిన్స్ పరీక్షలు ప్రారం భం కానున్నాయి. ఈ ఏడాది దేశవ్యాప్తంగా యూపీఎస్సీ జూన్ 16న ప్రిలిమ్స్ పరీక్ష నిర్వహిం చిగా.. ఫలితాలు జులై 1న విడుదలయ్యాయి. షెడ్యూల్ ప్రకారం మెయిన్స్ పరీక్షలు సెప్టెంబర్ 20, 21, 22, 28, 29 తేదీల్లో జరుగనున్నాయి. ఆయా తేదీల్లో రోజుకు రెండు సెషన్ల చొప్పున పరీక్షలు జరగనున్నాయి, ఉదయం 9 గంటల నుంచి మధ్యా హ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు ఈ పరీక్షల ను నిర్వహిస్తారు.ఒక్కో సెషన్ పరీక్ష మూడు గంటల పాటు జరుగు తుంది. మెయిన్స్ పరీక్షలు మొత్తం ఐదు రోజుల పాటు కొనసాగుతాయి.ఈ తేదీల్లో దేశవ్యాప్తంగా 24 పట్టణా ల్లో ఈ పరీక్షలను నిర్వహిం చనున్నారు. హైదరాబాద్ లో మెయిన్స్ పరీక్షల కోసం 6 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. వీటిల్లో 708 మంది అభ్యర్థులు పరీక్షలు రాయనున్నారు. పరీక్ష ప్రారంభానికి 30 నిమిషాల ముందే అభ్యర్థులు పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని, ఒక్క నిమిషం ఆలస్యమైనా లోపలికి అనుమతించ బోమని అధికారులు సూచించారు. మెయిన్స్ అనంతరం ప్రతిభకనబరచిన వారిని ఇంటర్వ్యూకి పిలుస్తారు. మెయిన్స్ అనంతరం అర్హత సాధించిన వారిని ఇంటర్వ్యూకి పిలుస్తారు. మెయిన్స్, ఇంటర్వ్యూలో వచ్చిన మార్కుల ఆధారంగా సర్వీసులను కేటాయిస్తారు.

## కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల్లోని ఖాళీల భర్తీ

### జిల్లా విద్యాశాఖ అధికారిని రేణుకా దేవి



**విశ్వంభర, వికారాబాద్:** జిల్లాలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల్లోని స్పెషల్ ఆఫీసర్, పీజీసీఆర్టీ, సీఆర్టీ పీఈటీలు అలాగే అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాలలోని స్పెషల్ ఆఫీసర్ సిఆర్టీల ఖాళీలలో తాత్కాలిక కాంట్రాక్టు పద్ధతిలో పనిచేయుటకు గత సంవత్సరం ఆన్లైన్ ద్వారా పరీక్ష నిర్వహించామని జిల్లా విద్యాధికారి రేణుకాదేవి అన్నారు. మెరిట్‌లిస్ట్ ఆధారంగా ఖాళీలను భర్తీ చేశామని తెలిపారు. ప్రస్తుతం 2024 - 25 విద్యా సంవత్సరంలో ఉన్నటువంటి ఖాళీలను గత సంవత్సరం నిర్వహించిన పరీక్ష మెరిట్ లిస్టులో ఉన్న అభ్యర్థులతో ప్రస్తుతం ఉన్న ఖాళీలను భర్తీ చేయమని ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారని ఆమె పేర్కొన్నారు. **ఖాళీల వివరాలు** : కస్తూర్బా గాంధీ విద్యాలయాల్లో స్పెషల్ ఆఫీసర్ - 03, పీజీ సీఆర్టీ ఇంగ్లీష్ - 05, పీజీ సీఆర్టీ ఫిజిక్స్ - 01, పీజీ సీఆర్టీ కెమిస్ట్రీ - 02, పీజీ సీఆర్టీ బాటనీ - 01, పీజీ సీఆర్టీ నర్సింగ్ I & II - 04, పీజీ సీఆర్టీ తెలుగు - 03, సీఆర్టీ తెలుగు - 01, సీఆర్టీ హిందీ - 03, సీఆర్టీ ఇంగ్లీషు - 02, సీఆర్టీ మాథ్స్ - 06, సీఆర్టీ ఫిజికల్ సైన్స్ - 04, సీఆర్టీ బయోలాజికల్ సైన్స్ - 04, సీఆర్టీ సోషల్ - 01, పిఈటీ - 05, అలాగే అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాలలో - స్పెషల్ ఆఫీసర్ - 01, సీఆర్టీ మాథ్స్- 01 తదితర ఖాళీలు ఉన్నాయని జిల్లా విద్యాశాఖాధి కారి రేణుకా దేవి తెలియశారు.

## ఇంకెంత మంది ప్రాణాలు కోల్పోవాలి..?

### రోడ్డుప్రమాదాలపై కేటీఆర్ ట్వీట్



**విశ్వంభర, హైదరాబాద్ :** హైదరాబాద్ నగరంలో వరుసగా జరుగుతున్న రోడ్డు ప్రమాదాలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎక్స్ వేదికగా స్పందించారు. నాచారం వద్ద ఎల్‌పీజీ ట్రక్కు ఢీకొనడంతో ఓ మహిళ ప్రాణాలు కోల్పోవడం తీవ్ర దిగ్భ్రాంతిని కలిగించిందని కేటీఆర్ పేర్కొన్నారు. ఆమహిళ మృతిచెందడం ఆమె కుటుంబానికి ఊహించని పీడకల అన్నారు. తన బిడ్డను స్కూల్లో వదిలిపెట్టి ఇంటికి తిరిగి రాకుండానే రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిం దన్నారు. పదో తరగతి చదువుతున్న ఓ యువతి కూడా ఈ ప్రాంతంలో ఇలాంటి పరిస్థితిని ఎదుర్కొ న్నదని కేటీఆర్ గుర్తు చేశారు.చర్యలు తీసుకునే ముందు ఇంకెంత మంది ప్రాణాలు కోల్పోవాలి..? అని కేటీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. పిల్లలు పాఠశాలకు వచ్చే వేళ, ఇంటికి తిరిగి వెళ్లే సమయాల్లో భారీ వాహనాలను స్కూల్ జోన్ల పరిధిలోకి అనుమతించకూడదని కేటీఆర్ సూచించారు. అధికారులు ముందే మేల్కొని రోడ్డు భద్రతా చర్యలు తీసుకుంటే ఇలాంటి ప్రమాదాలు జరగడానికి ఆస్కారం ఉండదని కేటీఆర్ అన్నారు. అధికారులు తమ ప్రాథమిక విధులను సక్రమంగా నిర్వర్తిస్తే ఎలాంటి ప్రాణ నష్టం జరగదని కేటీఆర్ పేర్కొన్నారు.

## కాంట్రాక్టర్ పై క్రిమినల్ కేసు పెట్టాలి



**విశ్వంభర, మహేశ్వరం:** తుక్కుగూడ ఫ్యాబ్ సిటీ పారిశ్రామిక ప్రాంతంలో ప్రీమియర్ సోలార్ పరిశ్రమలో, గ్లిట్జ్ కాంట్రార్ కార్మికులను కనీస వేతనాలను అమలు చేయకుండా బెదిరింపులకు పాల్పడుతున్న కాంట్రాక్టర్ పై క్రిమినల్ కేసు పెట్టి శిక్షించాలని డిమాండ్ చేస్తూ జాయింట్ లేబర్ కమిషనర్ శ్యాంసుందర్ రెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి పానుగంటి పర్వతాలు మాట్లాడుతూ పరిశ్రమలలో కార్మికుల శ్రమ దోపిడీ అధికం అయ్యిందని ప్రశ్నించిన కార్మికులను పనిలో నుండి తొలగించి అభద్రత భావానికి గురిచేసి కార్మికులను భయపెట్టి పనిచేయుచుకుంటున్నారని ఆరోపించారుబ్రతుకు తెరువు కోసం ఇతర జిల్లాల నుండి వలస వచ్చి పరిశ్రమలలో పనులు చేస్తున్న కార్మికుల శ్రమను దోపిడి చేసే కాంట్రాక్టర్ల పై చర్యలుతీసుకోవాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి బి. దత్తు నాయక్ డిమాండ్ చేశారు.

## ఖమ్మం ప్రభుత్వ మెడికల్ కాలేజీలో ఉద్యోగాలు

**విశ్వంభర, ఖమ్మం:** ప్రభుత్వ వైద్య కళాశాల నందు ఖాళీగా ఉన్న పలు పోస్టులను అవుట్ సోర్సింగ్ పద్ధతిలో నియామకానికి అర్హులైన అభ్యర్థులు ఈ నెల 30 తేదీ లోపు ఆఫ్ లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డా. ఎస్. రాజేశ్వర రావు ఒక ప్రకటనలో తెలిపారు. ఖాళీ పోస్టు ల్లో ల్యాబ్ అటెండెంట్స్-15, స్టోర్ కీపర్/ డాటా ఎంట్రీ ఆపరేటర్/ స్టెనో/ టైపిస్ట్/రికార్డ్ క్లర్క్/రికార్డ్ అసిస్టెంట్-7, రేడియోగ్రఫీ టెక్నీషియన్(ఆర్టి)-3, రేడియోగ్రఫీ టెక్నీషియన్(ఇసిజి)-2, రేడియోగ్రఫీ టెక్నీషియన్(సిటీ-స్కాన్)-3, అనేస్థీషియా టెక్నీషియన్-4, ధోబీ/ ఫ్యాకర్స్-4, ఎలక్ట్రిషియన్-2, ప్లంబర్-1, డ్రైవర్ హెవీ వెహికిల్-1, థియేటర్ అసిస్టెంట్-4, గ్యాస్ ఆపరేటర్-2, వార్డు బాయ్-4, మొత్తం 52 పోస్టులు ఉన్నట్లు ఆయన అన్నారు. విద్యార్హతలు, నియమ నిబంధనలు కళాశాల వెబ్‌సైట్ www.gmckhammam.gov, జిల్లా వెబ్‌సైట్ https: khammam.telangana.gov.in నందుపొందుపర్చినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు.

## పేద విద్యార్థులకు బీర్ల ఫౌండేషన్ చేయూత



**విశ్వంభర, ఆత్మకూరు(ఎం) :** యాదాద్రి భువనగిరి జిల్లా మోటకొండూరు మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహంలో(హాస్టల్) విద్యార్థులకు బీర్ల ఫౌండేషన్ ద్వారా పంపించిన బెడ్ల పంపిణీ కార్యక్రమం ఆలేరు మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పచ్చిమట్ల మదార్ గౌడ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ తండ పాండురంగం గౌడ్, మాజీ జడ్పిటిసి గంగాపురం మల్లేష్ , జిల్లా కాంగ్రెస్ నాయకులు భూమండ్ల శ్రీనివాస్‌ల చేతుల మీదుగా పంపిని చేయడం జరిగింది.మాజీ ఎంపిటిసి బాల్ద రామకృష్ణ, కురుమ సంఘం అధ్యక్షులు బాల్ద సిద్ధులు, కాంగ్రెస్ పార్టీ మండల ఉపాధ్యక్షులు భూమండ్ల అశోక్, యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి సంగు శేఖర్ ,ఆలేరు అసెంబ్లీ యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి బుగ్గ మహేష్, మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ బుగ్గ కొమురయ్య, కొల్లూరు యాదగిరి, లోడేమల్లేష్, భూమండ్ల ఇస్తారి, బాల్ద శ్రీశైలం, వడ్డే బోయిన జహంగీర్, యూత్ కాంగ్రెస్ నాయకులు జూకంటి మధు, ప్రతికంఠం గౌతం రాజ్, పేరబోయిన కార్తీక్, గవ్వల సిద్ధులు,బాల్ద సిద్ధులు, భూమండ్ల ఉమేష్, బోళ్ల నరసింహ, జివిలికపల్లి నరసింహ, మేకల రాజు పాల్గొన్నారు.

## ఫార్మసీ, ఫార్మ్ డీ కోర్సుల్లో ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదల



**విశ్వంభర, హైదరాబాద్:** టీజీ ఎప్‌సెట్ -2024(ఎంపీసీ స్ట్రీమ్) ప్రవేశాల ప్రక్రియ కొనసాగుతోంది. బీ ఫార్మసీ, ఫార్మ్ డీ కోర్సుల్లో ప్రవేశాలకు సంబంధించి నోటిఫికేషన్ విడుదలైంది. ఇప్పటికే సర్టిఫికెట్ వెరిఫికేషన్ పూర్తయిన విద్యార్థులు.. ఈ నెల 24 నుంచి 25వ తేదీ వరకు ఆప్షన్స్ ఎక్సర్‌సైజ్ చేసుకోవచ్చు. 25న ఆప్షన్లు ఫ్రీజింగ్ చేసుకోవాల్సి ఉంటుంది. 27న ప్రొవిజినల్ అలాట్‌మెంట్ జరగనుంది. సీట్లు పొందిన విద్యార్థులు ఈ నెల 27, 28 తేదీల్లో వెబ్‌సైట్ ద్వారా ట్యూషన్ ఫీజు చెల్లించి, సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాల్సి ఉంటుంది. అనంతరం 28, 29 తేదీల్లో ఆయా కాలేజీల్లో రిపోర్టింగ్ చేయాలి. తదితర వివరాల కోసం tgeapcetb.nic.in అనే వెబ్‌సైట్‌ను లాగిన్ అవొచ్చు.

## కాలువ పనులను పరిశీలించిన ఎమ్మెల్యే



**విశ్వంభర, మాడుగుల:** కల్వకుర్తి ఎత్తిపోతల డి-82 కాల్వ పనులు త్వరితగతిన పూర్తిచేసి రైతులకు అందుబాటులోకి తీసుకొస్తాం అని కల్వకుర్తి ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణ రెడ్డి అన్నారు ఆయన గురువారం మాడుగుల మండలం నాగిల్ల దొడ్లపహాడ్ గ్రామ శివారు లోని 59 కిలోమీటర్ వద్ద కల్వకుర్తి ఎత్తిపోతల డి-82 కాలువ ఆక్విడక్ట్ పనులను పర్యవేక్షించారు జిల్లా మరియు మండల అధికారులు ఎస్.ఈ ఏఎస్ఎన్ రెడ్డి, ఈ.ఈ శ్రీకాంత్, డి,ఈ దేవానంద్, పి,ఎం వెంకట రావు, ఏ.ఈ రాఘవేంద్ర రెడ్డి కు పలు సూచనలు చేశారు తదుపరి పనులు త్వరితగతిన కాలువ పనులు పూర్తి చేసి రైతులకు తొందరగా అందుబాటులోకి తీసుకురావాలని అధికారులకు కాంట్రాక్టర్ కు ఆదేశాలు జారీచేశారు. ఈ కార్యక్రమంలో మండల ముఖ్య నాయకులు యాదయ్య, జగ్ పాల్ రెడ్డి, హరీష్ రెడ్డి అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## రక్తదాన శిబిరం



**విశ్వంభర,ఆత్మకూరు(ఎం):** యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలో గురువారం రోజున ప్రధానమంత్రి నరేంద్ర మోడీ జన్మదినం పురస్కరించుకొని బీజేవైఎం జిల్లా ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన చేసిన సేవా మహా యజ్ఞంలో రక్తదానం చేసిన బీజేవైఎం మండల అధ్యక్షులు పైళ్ళప్రశాంత్. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా అధ్యక్షులు పాశం భాస్కర్, సేవా మహా యజ్ఞం జిల్లా కన్వీనర్ తుమ్మల మురళీధర్ రెడ్డి, యువ మోర్చా జిల్లా అధ్యక్షులు పట్నం కపిల్, బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శులు, యువ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శులు, కిసాన్ మోర్చా అధ్యక్షులు, జిల్లా నాయకులు, మండల బిజెపి పార్టీ అధ్యక్షులు, యువమోర్చా నాయకులు పాల్గొన్నారు.

# నియోజకవర్గ అభివృద్ధికి సహకరించాలి

### అధికారులతో ఎమ్మెల్యే రివ్యూ..



**విశ్వంభర, భూపాలపల్లి:** భూపాలపల్లి నియోజకవర్గ వ్యాప్తంగా వివిధ పథకాల కింద చేపడుతున్న అభివృద్ధి పనులు, ఆయానిధులతో కొనసా గుతున్న ప్రగతి కార్యక్రమాలపై మంజూరునగర్ లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జడ్పీ సీఈవో, జిల్లా ఇన్చార్జి అదనపు కలెక్టర్(స్థానిక సంస్థలు) విజయ లక్ష్మి, బీసీ సంక్షేమ శాఖ, విద్యుత్, ఆర్ అండ్ బీ, పీఆర్, ఆర్ డబ్ల్యూ మరియు రెవెన్యూ శాఖల అధికారులతో భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు రెండున్నర గంటల పాటు సుదీర్ఘంగా సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈసమీక్షా సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. భూపాలపల్లి నియోజకవర్గాన్ని అన్నివిధాలా అభివృద్ధి చేసేందుకు అన్ని శాఖల అధికా రులు పూర్తి సహకారం అందించాలని అన్నారు. ప్రతీరోజూ గ్రామాలల్లో పర్యటిస్తున్న సందర్భంలో ప్రజల నుండి గ్రామాల్లో మౌలిక వసతులకు సంబంధించి చాలా విజ్ఞాపనలు వస్తున్నాయని ఎమ్మెల్యే తెలిపారు. తన పై నమ్మకంతో గెలిపించిన నియోజకవర్గ ప్రజ లకు రానున్న ఐదేళ్ల కాలం పాటు స్థానికంగానే అందుబాటులో ఉంటూ సేవలందిస్తానని ఎమ్మెల్యే వెల్లడించారు. అధికారుల పూర్తి సహకారం ఉన్నప్పుడే ప్రజల సమస్యలను సకాలంలో పరిష్కరించేందుకు వీలవు తుందని, ఈ మేరకు అన్ని శాఖల అధికారులు తోడ్పాటును అందించాలని సూచించారు. క్రమం తప్పకుండా సమీక్షలు జరుపుతూ నియోజకవర్గ అభివృద్ధికి బాటలు వేస్తానని అన్నారు. ప్రజల నుండి వచ్చే సమస్యలు, వినతులపై తక్షణమే స్పందిస్తూ, నిర్ణీత గడువులోపు వాటిని పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. నియోజక వర్గంలో పెండింగ్‌లో ఉన్న రోడ్లు, మంచినీటి పైపులైన్లు, సైడ్ డ్రైనేజీ పనుల పురోగతిపై ఎమ్మెల్యే అధికారులను అడిగి తెలుసుకున్నారు. అభివృద్ధిపై అలుపె రకుండా శ్రమిస్తున్నానని, అధికారులు అభివృద్ధిపనులపై అలసత్వం వహిస్తే ఊరుకునేది లేదన్నారు. పంచాయతీ రాజ్ అధికారులు సమీక్షా సమా వేశానికి ఆలస్య ంగా రావడం పట్ల ఎమ్మెల్యే అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

## సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ



**విశ్వంభర, మహేశ్వరం:** మీర్పేట్ మున్సిపల్ కార్పొరేషన్ జిల్లెల గూడ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో మీర్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్, తుక్కుగూడ మున్సిపాలిటీ, జల్‌పల్లి మున్సిపాలిటీ కి సంబంధించి మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను లబ్ధిదారులకు అందజేసిన మహేశ్వరం నియోజకవర్గ ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి చెక్కులు స్వీకరించిన లబ్ధిదారులు సబితా ఇంద్రారెడ్డి కి ధన్యవాదాలు తెలియజేశారుఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు కార్యకర్తలు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

# ఓటర్ల జాబితాలో అభ్యంతరాలు తెలియజేయాలి



**విశ్వంభర, త్రిపురారం:** త్రిపురారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో విజయ కుమారి ఆధ్వర్యంలో అన్ని పార్టీల నాయకులతో గ్రామ పంచాయతీ ఓటర్ లిస్ట్‌లో చెర్పులు మార్పులు ,నూతన ఓటు వార్డుల సవరన తదితర విషయాలపై వివిధ రాజకీయ పార్టీల మండల నాయకులు, కార్యదర్శులు గ్రామపంచాయతీ ముసాయిదా ఓటర్ల జాబితా సవరణ పై సమావేశం నిర్వహించారు. వార్డుల వారీగా విభజించిన గ్రామపంచాయతీ ముసాయిదా ఓటర్ల జాబితాను చూపించారు.ఇంకా ఏమైనా సవరణలు, అభ్యంతరాలు ఉన్నచో లిఖిత పూర్వకముగా సంబంధిత పంచాయతీ కార్యదర్శులకు ఈనెల 21వ తేదీలోపు తెలియజేయాలని సూచించారు. రాజకీయ పార్టీల నాయకులు బుచ్చిరెడ్డి, అనుముల శ్రీనివాసరెడ్డి, అనంతరెడ్డి, కామెర్ల జానయ్య, దైద శ్రీనివాస్, మజ్జిగపు వెంకట్‌రెడ్డి మజ్జిగపు శ్రీనివాసరెడ్డి చిలువుల శ్రీనివాస్,హరీష్,పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## ముగ్గురిపై అట్రాసిటీ కేసు నమోదు

**విశ్వంభర,ఎల్బీనగర్:** కులం పేరుతో దూషించిన ముగ్గురిపై ఎస్సీ ,ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదైన సంఘటన సరూర్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఇన్స్పెక్టర్ సైదిరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం బుధవారం రాత్రి చెరుకు తోట కాలనీ వాసుల గణేష్ ని మజ్జనానికి తరలిస్తుండగా కొత్తపేట అరవింద కళాశాల వద్దకు రాగానే కొంతమంది వ్యక్తులు మద్యం మత్తు లో మహిళలు, యువకులను దూషించి దాడి చేశారు. చెరుకు తోట కాలనీవాసి స్వరూప, ధనరాజ్, మాలతి, కాజా జస్వంత్, శ్రీజ, సాయి తేజ, వరుణ్‌లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులుకేసు నమోదు చేసుకుని మనసురాబాద్‌కు చెందిన జక్కిడి రఘువీర్ రెడ్డి, విజయ్, జక్కిడి ప్రతీక్‌ల పై ఎస్సీ ఎస్టీ కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

## ఉత్సాహంగా వినాయకుని లడ్డూ వేలం



**విశ్వంభర, రామన్నపేట:** యాదాద్రి భువనగిరి జిల్లా, రామన్నపేట మండల కేంద్రంలో కురుమ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వినాయకుని మండపం వద్ద లడ్డు వేలంపాట ఉత్సాహంగా జరిగింది. పాటలో బిజెపి సీనియర్ నాయకులు సిందం లింగయ్య, లక్ష్మీబాయి దంపతులు 91116/-రూపాయలకు కైవసం చేసుకోవడం జరిగింది. ఉత్సవ కమిటీ వారు దంపతులు ఇరువురికి శాలువాతో సత్కరించి, లడ్డూను అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా సిందం లింగయ్య మాట్లాడుతూ, రామన్నపేట పట్టణ ప్రజలు ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో, సుఖ సంతోషాలతో, ఉండాలని భగవంతుని ప్రార్థించినట్టు తెలిపారు. పాల్గొన్న సంఘం అధ్యక్షులు మోటి లక్ష్మణ్, నాయకులు ఈతాపుల క్రాంతి కుమార్, మోటె మల్లేష్, గొరిగె నరసింహ, బండ లింగస్వామి, మిర్యాల మల్లేష్, గొరిగె బీరప్ప, ఎర్ర అంజయ్య, యువజన సంఘ నాయకులు జమ్మి నరేష్, గురిగె నరేష్, మోటి రమేష్, మోటే మదన్ తదితరులు పాల్గొన్నారు.

# భద్రాచలం ఆలయ ప్రధాన అర్చకుడిపై వేటు

### కోడలిపై లైంగికదాడి వ్యవహారంలో చర్యలు కుమారుడిని కూడా సస్పెండ్ చేసిన ఈవో

**విశ్వంభర, భద్రాచలం:** భద్రాచలం సీతారామచంద్రస్వామి ఆలయ ప్రధాన అర్చకుడు పొడిచేటి సీతారామానుజాచార్యులు, ఆయన కుమారుడు వెంకట సీతారంను ఆలయ ఈవో సస్పెండ్ చేశారు. వారిపై లైంగిక వేధింపుల ఆరోపణలు రావటంతో అర్చకత్వం నుంచి తప్పించారు. తనను లైంగికంగా వేధిస్తున్నారని సీతారామానుజాచార్యులు కోడలు పోలీసులను ఆశ్రయించి కేసు పెట్టడంతో దేవాదాయశాఖ అధికారులు చర్యలకు దిగింది. పోలీసులు, బాధితురాలు వెల్లడించిన వివరాల ప్రకారం.. పొడిచేటి సీతారామానుజాచార్యులు భద్రాచలం ఆలయ ప్రధాన అర్చకుడిగా వ్యవహరిస్తున్నారు. ఆయనకు సంతానంగా కుమార్తెలు మాత్రమే ఉండడంతో.. వెంకట సీతారాంను కొన్నేళ్ల కిందట దత్తత తీసుకున్నాడు. అనంతరం భద్రాచలం ఆలయ అర్చకుడిగా ఉద్యోగం ఇప్పించాడు. వెంకట సీతారాంకు ఏపీలోని తాడేపల్లిగూడెంకు చెందిన యువతితో 2019లో పెళ్లి జరిగింది. వివాహం జరిగిన కొన్ని నెలలకే సీతారాం వరకట్నం తేవాలని భార్యను వేధింపులకు గురి చేయటం మొదలుపెట్టాడు. ఆ తర్వాత.. మామ సీతారామానుజాచార్యులు ఆమెపై కన్నేశాడు. తనకు కుమారులు లేరని.. తన పోలికలతో ఒక బాబు కావాలని కోడలిపై సీతారామానుజాచార్యులు లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఈ విషయాన్ని బాధితురాలు తన భర్తకు చెప్పగా వినిపించుకోలేదు. సీతారామానుజాచార్యులు అలాంటి వాడు కాదని.. రివర్స్‌లో భార్యతోనే తండ్రికి క్షమాపణ చెప్పించాడు.





దీంతో బాధితురాలు ఈ ఏడాది ఆగస్టులో తాడేపల్లిగూడెం పోలీసులను ఆశ్రయించి కేసు పెట్టింది. తన మామ సీతారామానుజాచార్యులు తనపై లైంగిక దాడికి పాల్పడ్డారని.. అత్త, భర్త, ఇతర కుటుంబ సభ్యులు తనను రూ.10 లక్షల కోసం వేధించారని ఆగస్టు 14న ఫిర్యాదు చేసింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి రాగా.. తాజాగా ఎండోమెంట్ కమిషనర్ ఆదేశాల మేరకు భద్రాద్రి దేవస్థానం ఈవో రమాదేవి ప్రధాన అర్చకుడు సీతారామానుజాచార్యులు, ఆయన దత్తపుత్రుడు వెంకట సీతారాం ఇద్దరిని సస్పెండ్ చేస్తూ అధికారిక ఉత్తర్వులు జారీ చేశారు. అయితే ఈ ఘటన స్థానికంగా కలకలం రేపింది. ఆలయ ప్రధాన అర్చకుడు, ఆయన కుమారుడు లైంగిక, వరకట్న వేధింపుల వ్యవహారంలో సస్పెండ్ కావటం చర్చకు దారి తీసింది.

## భద్రాచలం నుంచి తిరుమలకు పాదయాత్ర



**విశ్వంభర, భద్రాచలం:** త్రివేణి కృష్ణవేణి విద్యాసంస్థల ఆధ్వర్యంలో గత 20 సంవత్సరాలుగా పాదయాత్ర చేస్తున్న విద్యాసంస్థల బృందం ఈరోజు భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్ర స్వామి వారి ఆలయం నుంచి తిరుమల తిరుపతి కు పాదయాత్ర మొదలుపెట్టారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కు చెందిన త్రివేణి కృష్ణవేణి విద్యాసంస్థల బృందం 2004లో విద్యాసంస్థ ప్రారంభించిన నాటి నుంచి ప్రతి లీపు సంవత్సరం పాదయాత్ర చేస్తున్నట్లు తెలిపారు. సర్వేజనా సుఖినోభవంతు అంటూ లోక క్షేమం కోసం, విశ్వశాంతి కోసం, దేశ ప్రజలంతా ఆయురారోగ్యాలుతో ఉండాలని పాదయాత్ర చేస్తున్నట్లు తెలిపారు. భద్రాచలం నుంచి సుమారు 615 కిలోమీటర్లు పాదయాత్ర జరుపుతున్నట్లు తెలిపారు.

## యాదయ్య కుటుంబానికి అండగా ఉంటాం

### రూ.77 వేల ఆర్థిక సహాయం



**విశ్వంభర, మహేశ్వరం:** గడ్డం యాదయ్య కుటుంబానికి అండగా ఉంటామని బ్యాంకు చైర్మన్ తడక రమేష్, వైస్ చైర్మన్ భారత రాజేంద్రప్రసాద్ అన్నారు. పోచంపల్లి కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు దేవరకొండ శాఖ నందు ఏటీఎం సెక్యూరిటీ గార్డ్ గా పని చేస్తున్న గడ్డం యాదయ్య ఇటీవల అనారోగ్యంతో మరణించినందున వారి కుటుంబానికి బ్యాంకు చైర్మన్ తడక రమేష్, వైస్ చైర్మన్ భారత రాజేంద్రప్రసాద్, బ్యాంకు పాలకవర్గం సభ్యులు, సీఈఓ సీత శ్రీనివాస్, వివిధ శాఖల మేనేజర్లు సిబ్బందితో కలిసి వారి కుటుంబానికి 77 వేల రూపాయలు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. మరణించిన యాదయ్య కుటుంబానికి అండగా నిలవడం పట్ల దేవరకొండ బ్యాంకు ఖాతాదారులు వాటాదారులు హర్షం వ్యక్తం చేశారు.

# తిరుమల వెంకన్న లడ్డూలో జంతువుల కొవ్వులు..!

### ల్యాబ్ నివేదికను విడుదల చేసిన టీడీపీ నేత ఆనం..!





**విశ్వంభర, తిరుమల:** కలియుగ ప్రత్యక్ష దైవం తిరుమల వేంకటేశ్వరస్వామి. క్షేత్రాన్ని నిత్యం వేలాది మంది భక్తులు దర్శించుకుంటారు. తిరుమల అంటేనే అందరికీ గుర్తుకు వచ్చేది లడ్డూ ప్రసాదమే. అయితే, ఎంతో పవిత్రంగా భావించే లడ్డూ ప్రసాదంలో వినియోగించిన నెయ్యిలో జం తువుల కొవ్వులు ఉన్నట్లు ఎన్‌డీడీబీ సీఏఎల్ఎఫ్ ల్యాబ్ నిర్ధారించిన విసయం తెలిసిందే. ఈ ఏడా ది జులైలో లడ్డూని ల్యాబ్‌కు పంపగా.. అదే నెల 17న నివేదిక ఇచ్చింది. సోయాబీన్, పొద్దు తిరుగుడు, ఆలివ్, గోధుమ బీన్, మొక్కజొన్న, పత్తి గింజల నూనెతో పాటు చేప నూనె, జంతుల కొవ్వు, పామాయిల్, పందికొవ్వు కొవ్వులు వాడిన ట్లుగా నివేదిక ఇచ్చింది. ఈ ల్యాబ్ నివేదికను టీడీపీ సీనియర్ నేత ఆనం వెంకటరమణారెడ్డి గురువారం మీడియాకు అందజేశారు. తిరుమల వేంకటేశ్వరస్వామి ప్రసాదంలో కల్తీ నెయ్యి వ్యవహారంలో ఖచ్చితంగా సీనియర్‌గా విచారణ చేయిస్తామని ఆయన స్పష్టం చేశారు. పవిత్రంగా భావించే వెంకన్న లడ్డూ ప్రసాదంలో జంతువుల కొవ్వును వినియోగించేలా కుంభకోణానికి పాల్పడ్డ వ్యక్తులు సర్వనాశనమైపోతారని మండిపడ్డారు. నాణ్యమైన నెయ్యిని కొనుగోలు చేయాలంటే కిలోకు రూ.1000 వరకు వెచ్చించాల్సి ఉంటుందని.. గత ప్రభుత్వం రూ.320 టెండర్లు పిలిచిందని ఆరోపించారు. నలుగురు వ్యక్తులకు టెండర్లు ఇచ్చారని.. నాణ్యతతో కూడిన నెయ్యిని రూ.320కి ఎవరైనా ఇస్తారా? అంటూ ఆనం ప్రశ్నించారు. తిరుమల లడ్డూ వ్యవహారంపై ప్రస్తుతం దేశవ్యాప్తంగా సంచలనంగా మారింది. చంద్రబాబు వ్యాఖ్యలపై విశ్వహిందు పరిషత్ స్పందించింది. ఇది తీవ్రమైన సమస్య అని.. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసింది. వీహెచ్‌పీ జాతీయ అధికార ప్రతినిధి వినోద్ బన్సాల్ మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్‌లో గత వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వం చేసిన హిందూ వ్యతిరేక చర్యలు, అకృత్యాల గురించి అందరికీ తెలుసునన్నారు. అయితే, కల్తీ నెయ్యి విషయంలో ప్రభుత్వం చేసిన వ్యాఖ్య లను వైఎస్సార్‌సీపీ నేతలు ఖండించారు. భక్తుల మనోభావాలను దెబ్బతీసేలా ఉన్నాయని వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత, రాజ్యసభ ఎంపీ వైవీ సుబ్బారెడ్డి అన్నారు. ఆరోపణలు నమ్మశక్యంగా లేవన్నారు. తాను వేంకటేశ్వరస్వామిని నమ్ముతానని.. అందరూ ఆయన భక్తులేనన్నారు. ఈ విషయంలో ప్రమాణం చేసేందుకు తాను సిద్ధంగా ఉన్నానన్నారు. మరో వైపు మాజీ చైర్మన్ బీ కరుణాకర్‌రెడ్డి సైతం రాజకీయ లబ్ధి కోసమే చంద్రబాబు ఈ ఆరోపణలు చేశారని కొట్టిపడేశారు. మరో ఈ వ్యవహారంపై సీబీఐతో విచారణ చేయించాలని ఏపీ పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల డిమాండ్ చేశారు.

## తిరుమల లడ్డూ ప్రసాదంపై సీబీఐతో విచారణ జరిపించాలి : వైఎస్ షర్మిల



**విశ్వంభర, అమరావతి:** తిరుమలలో లడ్డు తయారిలో నెయ్యికి బదులు జంతువుల నూనెలు నిజంగా వాడి ఉంటే తక్షణం ఉన్నత స్థాయి కమిటీ వేయాలని, లేదా సీబీఐతో విచారణ జరిపించాలని ఏపీ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మహాపాపానికి, ఘోర అపచారానికి పాల్పడిన నీచులెవరో తేల్చాలని ఎక్స్ వేదిక ద్వారా కోరారు. తిరుమలను అపవిత్రం చేస్తూ, హిందువుల మనోభావాలను, టీడీపీ, వైసీపీలు నీచ రాజకీయాలు చేస్తున్నాయని బండిపడ్డారు. సీఎం హెూదాలో లడ్డూ ప్రసాదంలో నెయ్యికి బదులు జంతువుల నూనెలు వాడారంటూ చంద్రబాబు నాయుడు చేసిన వ్యాఖ్యలు తిరుమల పవిత్రతకు, ప్రతిష్టకు భంగం కలిగించేలా ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కోట్లాదిమంది హిందువుల ఆరాధ్య దైవం వేంకటేశుడికే మచ్చ తెచ్చేలా ఉన్నాయని, ఆ ఆరోపణల్లో రాజకీయ కోణం లేకుంటే, సెంటి మెంట్ మీద రాజకీయం చేసే ఉద్దేశ్యమే మీకు లేకుంటే విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.

## ప్రకాశం బ్యారేజీ వద్ద రెండో పడవ తొలగింపు



**విశ్వంభర, అమరావతి :** విజయవాడ ప్రజలను భయాందోళనకు గురిచేసిన ప్రకావం బ్యారేజీ వద్ద కొట్టుకు వచ్చిన బోట్ల తొలగింపు ప్రక్రియ శరవేగంగా కొనసాగుతుంది. గురువారం మరో బోటును నీటి అడుగుబాగాన నుంచి తీసి ఒడ్డుకు చేర్చడంలో బెకెంఇన్‌ఫ్రా ఇంజినీర్లు సఫలికృతమయ్యారు. గత పదిరోజులుగా బోట్ల తొలగింపులో అనేక అవస్థలు పడ్డ అధికారులు, ఇంజినీర్లు మరో ప్రయత్నంగా ఇనుపగడ్డర్లతో రెండు పడవలను అనుసంధానించి అడ్డుపడిన పడవను వెలికితీశారు. నీటమునిగిన పడవను చైన్ పుల్లర్లతో ఎత్తుకు లేపి బ్యారేజీ ఎగువ ఉన్న పున్నమి ఘాట్ వద్దకు తరలించారు. బ్యారేజీ వద్ద ఇంకా బోల్తా పడి ఉన్న మూడో బోటును రేపు బయటకు తీసి ఒడ్డుకు తరలించే యత్నాన్ని చేయనున్నారు. బుధవారం ఒక బోటును తీసిన నిపుణులు, రెండో బోటును నిన్నటి ప్రయత్నంతోనే బయటకు తీశారు. ఈనెల 1వ తేదీన భారీ ప్రవాహానికి ఎగువ నుంచి కొట్టుకువచ్చిన 5 బోట్లు బ్యారేజీ గేట్లను బలంగా ఢీకొట్టాయి. దీంతో 67, 69, 70 గేట్ల వద్ద కౌంటర్ వెయిట్లు ధ్వంసమయ్యాయి. ప్రవాహంలో ఒక పడవ దిగువకు కొట్టుకు పోగా, మరో 3 భారీ పడవలు, ఒక మోస్తరు పడవ గేట్లవద్దే చిక్కుకున్నాయి. ఈ బోట్లు బ్యారేజీ గేట్లకు అడ్డుపడి ప్రవాహాన్ని అడ్డుకుంటున్నాయి. దీంతో భారీ పడవలను తొలగించేందుకు పలు ప్లాన్? అమలు చేసిన అధికారులు, తాజాగా సఫలీకృతం అయ్యారు.

# వైసీపీకి మరో కీలక నేత గుడ్ బై..

### 22న మాజీ ఎమ్మెల్యే ఉదయభాను జనసేనలో చేరిక



**విశ్వంభర, అమరావతి :** ఆంధ్రప్రదేశ్‌లో వైసీపీ కి చెందిన కీలకనేతలు పార్టీలు మారుతున్నారు. వైసీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌కు దగ్గరి బంధువైన బాలినేని శ్రీనివాస్‌రెడ్డి ఆ పార్టీకి రాజీనామా చేసిన 24 గంటల్లోనే మరో కీలక నేత రాజీనామాచేయనున్నారు. జగ్గయ్యపేట మాజీ ఎమ్మెల్యే సామినేని ఉదయభాను ఈనెల 22న జనసేన పార్టీలో చేరబోతున్నట్లు గురువారం ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో జనసేన బలోపేతం కోసం కృషి చేస్తామని వెల్లడించారు. .. ఏ షరతులు లేకుండా జనసేనలో చేరుతున్నానని స్పష్టం చేశారు. వైఎస్ జగన్ విధానాలు నచ్చకే పార్టీని వీడి జనసేనలో చేరుతున్నానని అన్నారు. 12 సంవత్సరాల పాటు వైసీపీకి అన్ని రకాలుగా సహాయసహకారాలు అందించాను. జిల్లా అధ్యక్షుడిగా పనిచేశానని తెలిపారు. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు సీఎం జగన్‌కు జిల్లా సమస్యల పరిష్కారానికి వినతిపత్రం ఇస్తే ఏనాడు వాటి గురించి పట్టించుకోలేదని విమర్శించారు. ఎన్నికల్లో అధికారం కోల్పోయినా కూడా నాయకులు, కార్యకర్తల పట్ల జగన్ నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆరోపించారు. వైసీపీలో ఉంటే ప్రజలకు ఎలాంటి సహాయం చేయలేకపోతున్నామనే బాధ, నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయాలనే ఉద్దేశంతో వైసీపీకి రాజీనామా చేయనున్నట్లు తెలిపారు.

## సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల అందజేత

**విశ్వంభర, మీర్‌పేట:** జిల్లెల గూడ ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీసులో మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి గురువారం లబ్ధిదారులకు మంజూరైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను అందజేశారు. ముదేటి సౌమ్య రూ.25000,అమరమ్మ రూ.51,000, మెగవత్ జగ్గురాం రూ.39000, రొక్కం వెంకట్‌రెడ్డి రూ. 30,000, మాదగోని జంగమ్మ రూ.20,500,కిలారి సావిత్రి రూ.36,000, సందీప్ రూ.19000లకు 7 చెక్స్‌ను అందచేశారు. సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి సహాయ నిధి సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మీర్పేట్ మున్సిపల్ కార్పొరేషన్ 9వ డివిజన్ బిఆర్ఎస్ ఇంచార్జ్ రామిడి నర్సిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


## నంది అవార్డులు, ఉత్సవాలపై త్వరలో నిర్ణయం



**విశ్వంభర, అమరావతిల:** ఏపీలో నంది అవార్డులు, నంది ఉత్సవాలపై త్వరలో నిర్ణయం తీసుకుం టామని ఏపీ సినిమాటోగ్రఫి, టూరిజంశాఖ మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. గురువారం రాజమహేంద్రవరంలో ఎంపీ పురందదేశ్వరితో కలిసి మీడియా సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో పర్యాటకానికి పెద్దపీట వేస్తున్నామని వివరించారు. ఈనెల27న విజయవాడలో ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా అవార్డులు అందజేయనున్నామని వెల్లడించారు. గత వైసీపీ ప్రభుత్వం పర్యాటక రంగాన్ని పూర్తిగా నాశనం చేసిందని ఆరోపించారు. గోదావరి జిల్లాలను కలు పుకుని ఆఖండ గోదావరి టూరిజం ప్రాజెక్టును తయారు చేస్తున్నామని. అరకు, లంబసింగి, బొర్రా గుహల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. రాష్ట్రంలో 15 హరితటూరిజం కేంద్రాలను మెరుగుపరుస్తున్నామన్నారు. ఇటీవల కురిసిన వర్షాలు, వరదలు వల్ల పర్యాటకం బాగా దెబ్బతిందని తెలిపారు.

## చంద్రబాబు వ్యాఖ్యలు వెనక్కి తీసుకోకపోతే

### న్యాయపరంగా చర్యలు : టీటీడీ మాజీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి



**విశ్వంభర, అమరావతి :** తిరుమల లడ్డూ ప్రసాదంపై ఏపీ సీఎం చంద్రబాబు చేసిన తీవ్రఆరో పణలను టీటీడీ మాజీ చైర్మన్, రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి ఖండించారు. లడ్డూతయారీలో పందితో నెయ్యిని ఉపయోగించారని నీచమైన ఆరోపణలు చేశారని, చంద్రబాబు తన వ్యాఖ్యలు వెనక్కి తీసుకోకపోతే చట్టపరంగా, న్యాయపరంగా ముందుకు వెళ్తామని వెల్లడించారు. వైసీపీ పార్టీని బదనాం చేయడానికి దుష్ప్రచారం చేస్తు న్నారని మండిపడ్డారు. తాడేపల్లి వైసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. రాజకీయ దురుద్దేశంతో తీసుకున్న నిర్ణయం కాదని, తిరుమల పవిత్రను కాపాడు కోవడానికి, ప్రపంచ వ్యాప్తంగా ఉన్న శ్రీవారి భక్తుల మనోభవాలు దెబ్బతినకుండా ఉండడానికి న్యాయస్థానాలను ఆశ్రయిస్తామని వెల్లడించారు. అవసరమైతే ఆరోపణలు చేసిన వ్యక్తులపై పరువునష్టం దావా వేస్తానని హెచ్చరించారు. రాష్ట్రంలోనూ, దేశంలోనూ ఉమ్మడి ప్రభుత్వాలు అధికారంలో ఉన్నందున తిరుమలపై చేస్తున్న ఆరోపణలపై ఎలాంటి విచారణనైనా వేసుకోవాలని సూచించారు. నాలుగు సంవత్సరాల పాటు చైర్మన్‌గా పనిచేసిన సమయంలో ఎలాంటి అవినీతి, అక్రమాలకు పాల్పడలేదని శ్రీవారి పాదాల చెంత నేను ప్రమాణం చేయడానికి సిద్ధంగా ఉన్నా.. మీ ఆరోపణలకు కట్టుబడి ఉంటే చంద్రబాబు కూడా ప్రమాణం చేయాలని డిమాండ్ చేశారు. 2019 నుంచి 2024 వరకు మధ్య క్వాలిటీ చెక్ చేసి నాణ్యత లేదని పదిసార్లు నెయ్యి ట్యాంకర్లు వెనక్కి పంపామని తెలిపారు.

# వైసీపీలో నేను ఏడ్చిన రోజులున్నాయ్..

### మాజీ మంత్రి బాలినేని సంచలన వ్యాఖ్యలు



**విశ్వంభర, అమరావతి :** మాజీ సీఎం వైఎస్ జగన్ దగ్గరి బంధువు, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాస్‌రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు . వైసీపీలో పడ్డ బాధలను, అవమానాలు తట్టుకోలేక ఏడ్చిన రోజులున్నాయని పేర్కొన్నారు. నిన్న వైసీపీకి రాజీనామా చేసిన బాలినేని జనసేన అధ్యక్షుడు, ఏపీ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌ను గురువారం కలిశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. గతంలో వైసీపీ తనను ఎన్ని ఇబ్బందులు పెట్టినా పార్టీని వీడలేదని, జగన్‌ను నమ్మి ఆస్తులు పోగొట్టుకున్నానని తెలిపారు. రాజశేఖర్‌రెడ్డి కుటుంబం కదా అని ఇన్ని రోజులు భరించానని అన్నారు. ప్రజా సమస్యలు చెబితే జగన్‌కు నచ్చేది కాదని ఆరోపించారు. జగన్‌ను బ్లాక్‌మెయిల్ చేసినట్లు వస్తున్న వార్తాలను ఖండించారు. ఇటీవల జరిగినా ఎన్నికల్లో ప్రజలు తగిన బుద్ధి చెప్పినా గాని జగన్ పద్ధతి మార్చుకోలేదని విమర్శించారు. త్వరలో స్వచ్ఛందంగా జనసేనలో చేరుతున్నానని, పదవులు ఆశించి కాదని వెల్లడించారు. పవన్ ఆదేశాల మేరకు నడుచుకుంటాను. తనకు పదవులు ముఖ్యం కాదు. గౌరవం కావాలని, అందరిని కలుపుకుని జనసేన అభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు.

# మహిళా చట్టాలను సద్వినియోగం చేసుకోవాలి: ఎస్సై విజయలక్ష్మి

**విశ్వంభర, భద్రాచలం:** మహిళల కోసం ఏర్పడ్డ చట్టాలను సద్వినియోగం చేసుకోవాలని పట్టణ ఎస్సై విజయలక్ష్మి కోరారు. ఐద్వా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మూడో మహాసభ సందర్భంగా పట్టణ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన మహిళా ప్రదర్శన ర్యాలీని ఎస్సై విజయలక్ష్మి ప్రారంభించగా ర్యాలీ అగ్రభాగాన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి ఉపాధ్యక్షురాలు బుగ్గ వీటి సరళతో పాటు జిల్లా ప్రధాన నాయకత్వం నిలిచిన ఈ ర్యాలీని ప్రారంభిస్తూ పట్టణ ఎస్ఐ విజయలక్ష్మి మాట్లాడుతూ మహిళలందరూ ఐక్యంగా తమ హక్కుల కోసం నినదించటం అభినందనీయమని అన్నారు. ప్రస్తుత సమాజంలో మహిళలు అన్నిట్లో సమానంగా నిలుస్తున్నారని అదే ఈ దేశ అభివృద్ధికి మూలమని అభిప్రాయపడ్డారు. మహిళల రక్షణ కోసం పోలీస్ శాఖలో అనేక విభాగాలను ఏర్పాటు చేయడం జరిగిందని షీ టీమ్ లతో పాటు సఖి సెంటర్లను ఏర్పాటు చేశామని తెలిపారు. మహిళల రక్షణ కోసం 24 గంటల పాటు పోలీస్ శాఖ అందుబాటులో ఉంటుందని హామీ ఇచ్చారు. మహాసభల సందర్భంగా నిర్వహించిన ఈ ర్యాలీలో ఆదివాసి సంస్కృతి సంప్రదాయాలను ప్రతిబింబిస్తూ రేలా నృత్యంతో పాటు కోలాటాలు నిర్వహిస్తూ హక్కుల కోసం నినదిస్తూ పట్టణంలో పురవీధుల్లో ప్రదర్శన నిర్వహించి స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సభను నిర్వహించారు.



# ప్రతిపౌరునికి చట్టాలపై అవగాహన ఉండాలి

## క్రాంతి విద్యాలయంలో న్యాయ అవగాహన సదస్సు




**విశ్వంభర, భద్రాచలం:** భద్రాచలం పట్టణంలోని క్రాంతి విద్యాలయంలో భద్రాచలం మండల సేవల కమిటీ ద్వారా న్యాయ అవగాహన సదస్సు కార్యక్రమం నిర్వహించారు. క్రాంతి విద్యాలయం చైర్మన్ పానుగంటి సమత అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో భద్రాచలం ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ వెంకటేశ్వర్లు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ సమత మాట్లాడుతూ పాఠశాల విద్యార్థులకు అవగాహన సదస్సు అందించటం ద్వారా చిన్నతనం నుంచి చట్టంపై అవగాహన కలుగుతుందన్నారు. అనంతరం మెజిస్ట్రేట్ ఎమ్.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ భారతదేశం తమ పౌరులకు అనేక చట్టాలను అందించిందని, వీటిపై ప్రతి పౌరుడుకు అవగాహన ఉండాలని ఉద్దేశంతో సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు క్షేత్రస్థాయిలో ఇటువంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. రైట్ టు ఎడ్యుకేషన్, బాల కార్మిక నిర్మూలన, పోక్సో, బాల్య వివాహాలు, వినియోగదారుల వ్యవస్థ, మాదకద్రవ్యాలు, లైసెన్సు లేకుండా వాహనాలు నడపటం వంటి అనేక విషయాలపై ఆయన మాట్లాడారు. ఆయా చట్టాలు ఏమి చెబుతున్నాయి అనే విషయమై మెజిస్ట్రేట్ అందరికి అర్థమయ్యే రీతిలో వివరించారు. చట్ట వ్యతిరేక కార్యాకలాపాలలో ఉంటే విద్యార్థుల భవిష్యత్తులో ఎటువంటి ఇబ్బందులు కలిగి అవకాశం ఉందో తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు చైతన్య, పట్టణ ఎస్సై విజయలక్ష్మి, సీనియర్ న్యాయవాదులు నాగ అంబేద్కర్, పడిసిరి శ్రీనివాసరావు, కోర్టు సిబ్బంది, ఇతర న్యాయవాదులు, పాఠశాల అధ్యాపక అధ్యాపకేతర బృందం, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## స్పందన డిజిటల్ స్టూడియో ప్రారంభం



**విశ్వంభర వనస్థలిపురం:** వనస్థలిపురంలోని ఎస్బీహెచ్ రోడ్ సమీపంలో స్పందన డిజిటల్ స్టూడియో ప్రారంభోత్సవం ఘనంగా జరిగింది. స్టూడియో యజమాని కలాల్ శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ మా యొక్క బ్రాంచీలు దిల్‌సుఖ్ నగర్ అమీర్‌పేట్‌లో ఉన్నాయన్నారు. ప్రతి క్షణాన్ని ఒక మధుర జ్ఞాపకంగా చూపించగలిగేది ఏదైనా ఉన్నదంటే అది ఒక ఫోటో మాత్రమేనని అన్నారు. ఫోటో అనేది ఒక చక్కటి ప్రతిబింబమని అన్నారు.

## లక్కీడ్రాలో లడ్డూను దక్కించుకున్న శ్యామ్




**విశ్వంభర, సరూర్ నగర్:** సరూర్ నగర్ చౌడిలో రామ్ సేనా యువజన సంఘం ఆధ్వర్యంలో నెలకొల్పిన గణనాథుని లడ్డూ గడ్డి అన్నారం డివిజన్ వాస్తవ్యులు శ్యామ్ ని వరించింది. రామ్ సేనా యువజన సంఘం ఆధ్వర్యంలో గణేశ్ మండపం వద్ద రూ. 21 లను చెల్లించి.. భక్తులు లక్కీ డ్రా టోకెన్ పొందారు. 1200మంది భక్తులు లక్కీడ్రాలో పాల్గొన్నారు. నవరాత్రులు పూజలు అందుకున్న గణనాథుని లడ్డూ ప్రసాదాన్ని బుధవారం రాత్రి లక్కీ డ్రా తీశారు. ఈ లక్కీ డ్రాలో శ్యామ్‌కి దక్కింది. రామ్ సేనా యువజన సంఘం ప్రతినిధులు లడ్డూ ప్రసాదాన్ని శ్యామ్‌కి అందజేశారు.

## ఉన్నత శిఖరాలు అధిరోహించాలి



**విశ్వంభర, ఖమ్మం:** ఖమ్మం జిల్లా చింతకాని మండలం లచ్చగూడెం గ్రామానికి చెందిన సరికొండ సూర్య గణేష్ రాజు 2017- 18 విద్యా సంవత్సరంలో శ్రీ గ్లోబల్ హై స్కూల్ నందు పదోతరగతిలో అత్యధిక మార్కులు సాధి ంచి ఉత్తీర్ణులైనారు. పాఠశాల ఫౌండర్ను ఇనుకుల దివాకర్ రెడ్డి ప్రోత్సాహంతో డిప్లమా నందు ట్రిపుల్‌ఈ లో ఉత్తీర్ణత సాధించి ,బీటెక్ పూర్తి చేసినారు. మొదటి ప్రయత్నంలోనే టీఎస్ జెన్కోలో ఏఈగా ఉత్తీర్ణత సాధించారు. కృషి ఉంటే సాధించలేనిది ఏమీ లేదు అని నిరూపించిన సూర్య గణేష్ రాజుకు పాఠశాల ఫౌండర్ఇనుకుల్ల దివాకర్ రెడ్డి అభినందనలు తెలియజేసినారు. పాఠశాల కరస్పాండెంట్ అయిన వాహిని , సుధాకర్ రెడ్డి , తిరుపతి రెడ్డి, ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు అభినందనలు తెలియపరుస్తూ ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని అభినందించారు.

## వాణిజ్య సముదాయం ప్రారంభం



**విశ్వంభర, ఆత్మకూరు(ఎం):** యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూర్ మండల కేంద్రంలో గురువారం నాగార్జున రైతు సేవ సంఘం లిమిటిటెడ్ మోత్కూరు వాణిజ్య సముదాయన్నీ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య ,తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ ప్రారంభించారు. హాజరైన ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్యకి మోత్కురు పి ఎస్ సి ఎస్, చైర్మన్ ,డైరెక్టర్లు ,రైతులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు పెద్దఎత్తున్న స్వాగతం పలికారు.

# ముస్లిం సోదరుల ర్యాలీ



**విశ్వంభర,పరిగి:** పట్టణంలో గురువారం ఈద్ మిలాద్ ఉన్ నబిలో భాగంగా కాజి జహీర్ అజార్, కౌన్సిలర్ మునీర్, ఆధ్వర్యంలో ముస్లిం సోదరులు ర్యాలీ నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. ఇస్లాం మతంలో ఈద్ మిలన్ ఉన్ నబికి ఎంతో ప్రాధాన్యత కలదన్నారు. మహమ్మద్ ప్రవక్త దేవుని నుండి వచ్చిన దూత అని, దయధర్మబద్ధమైన జీవితంను ఎలా జీవించాలో ప్రజలకు చూపించడం జరిగిందన్నారు. మహమ్మద్ ప్రవక్త జన్మదిన దైవఘట్టంగా జరుపుకొని ఆయన పట్ల ప్రేమను భక్తిని చాటుకోవడం జరుగుతుందన్నారు. మనందరి మధ్య సామరస్యం, ఐక్యత, సంతోషం శ్రేయస్సు అన్నింటా వ్యాపించాలని కోరుకున్నట్లు తెలిపారు. సమాజంలో శాంతి, సమానత్వం కోసం కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ముస్లిం సోదరులు హజార్, అసిఫ్, సల్మాన్ ,ఇంతియాజ్, సమాజ్ పాల్గొన్నారు.

## పరిసరాల పరిశుభ్రతకు బాధ్యతగా కృషి చేయాలి

**విశ్వంబర, పరిగి:** తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన స్వచ్ఛతా హి సేవా కార్యక్రమంలో భాగంగా గురువారం ఎంపీడీవో ఎంఎ కరీం ఆధ్వర్యంలో పరిగి మండల పరిధిలోని రంగాపూర్ గ్రామంలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులచే మానవహారం కార్యక్రమం నిర్వహించి పేపర్స్, బ్యాగులు, ప్లాస్టిక్ కవర్లు డ్రైనేజీలో వేయకూడదని ప్రతిజ్ఞ చేయించినట్లు ఎంపీడీవో ఎంఎ కరీం తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. తడి, పొడి చెత్తను గ్రామపంచాయతీ వాహనంలో వేరుగా వేయాలని, పరిసరాల పరిశుభ్రతకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు బసవేశ్వరి, పంచాయతీ కార్యదర్శి విశ్వతేజ, విద్యార్థులు పాల్గొన్నారు.

# నాయకుల ముందస్తు అరెస్టులు



**విశ్వంభర,నారాయణపురం:** రుణమాఫీ మాటనిలబెట్టుకోవాలని రైతులు ఛలో ప్రజాభవన్‌కు పిలుపునిచ్చిన నేపథ్యంలో నారాయణపురం మండలంలో వివిధ పార్టీల నాయకులను తెలంగాణ సర్పంచ్ ల ఫోరం జాయింట్ యాక్షన్ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు సుర్వి యాదయ్య గౌడ్, భారతీయ జనతా పార్టీ రైతు జిల్లా నాయకుడు భాస్కర్ నరసింహ, సిపిఐ పార్టీ మండల కార్యదర్శి దుబ్బాక భాస్కర్, నారాయణపూర్ బిఆర్ఎస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు తెలంగాణ బిక్షం,మన్నె చిత్రసేనారెడ్డి,చిలువేరు శంకర్‌లను ముందస్తుగా అరెస్టు చేసి పోలీస్ స్టేషన్ కు తరలించారు.

## ఎమ్మెల్యే ఆర్థికసాయం



**విశ్వంభర, ములకలపల్లి:** ములకలపల్లి మండలం జిన్నెలగూడెంలో ఈసం రాముడి 8సంవత్సరాల కుమారుడు సాయి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా అశ్వారావు పేట మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లు వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో పోతుగంటి లక్ష్మణ్, మాజీ సర్పంచులు బైటి రాజేష్ ,వాడే నాగరాజు , దేవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## అధైర్య పడొద్దు అండగా ఉంటాం



**విశ్వంభర, కడ్తాల్:** అధైర్య పడొద్దు కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్లవేళలా అండగా ఉంటుందని ధైర్యంగా ఉండాలని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. కడ్తాల మండలం మైసిగండి గ్రామానికి చెందిన మాజీ ఎంపీపీ భర్త కాంగ్రెస్ నాయకుడు మోత్యా నాయక్ అనారోగ్యంతో బాధపడుతున్నాడని ఇంట్లో చికిత్స తీసుకుంటున్నాడని తెలుసుకున్న ఆయన కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని ఏదైనా అవసరం ఉంటే నన్ను కలవాలని కాంగ్రెస్ సీనియర్ నాయకులు గూడూరు భాస్కర్ రెడ్డి, మాజీ సర్పంచ్ లక్ష్మీనరసింహారెడ్డి, లాయక్ అలీ నాయకులతో కలిసి వారి నివాసంలో మోత్యా నాయకున్ని పరామర్శించారు.

## అంగన్వాడీ కేంద్రాలలో మౌలిక సదుపాయాలు కల్పించాలి



**విశ్వంభర భూపాలపల్లి:** అంగన్వాడీ కేంద్రాల లోనే బాల్యం బలోపేతం కావాలని భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. గురువారం ఐడి ఓసి కార్యాలయపు కాన్ఫరెన్స్ హాల్లో మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారు లు, టీఎస్ డబ్లుఐడిసి ఇంజినీరింగ్ అధికారులతో అంగన్వాడి కేంద్రాల్లో మౌలిక సదుపాయాల కల్పనపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని అంగన్వాడీ కేంద్రాలలోని చిన్నారులకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించాలని అన్నారు. సాక్ష్యం అంగన్వాడీ పథకం ద్వారా 50 అంగన్వాడీ కేంద్రాలలో మౌలిక సదుపాయాల కోసం నిధులు మంజూరు చేయడం జరిగిందని, అట్టి పనులను త్వరిత గతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం అంగన్వాడీ కేంద్రాల బలోపేతానికి ప్రత్యేక శ్రద్ధ కేంద్రీకరించినట్లు తెలిపారు. అంగన్వాడీ కేంద్రాల నవీకరణకు నిధులు మంజూరు చేయడం జరిగిందని నవీకరణలో భాగంగా మరుగు దొడ్లు నిర్మాణం, త్రాగునీరు సౌకర్యం, పెయింటింగ్ పనులు, పండ్లు కూరగాయల తోటలు పెంపకం లాంటి మౌలిక సదుపాయాలు కల్పన పనులను త్వరిత గతిన పూర్తి చేయాలని టీఎస్ డబ్లుఐడిసి అధికారులను ఆదేశించారు. చిన్న పిల్లలకు, గర్భిణీలకు, బాలింతలకు అంగన్వాడీ కేంద్రాల ద్వారా నాణ్యమైన పౌష్టిక ఆహారాన్ని అందించాలని మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులను జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఆదేశించారు. ఈ సమావేశంలో సంక్షేమ అధికారి చిన్నయ్య, సీడీపీవో లు అవంతి,రాధిక, టీఎస్ డబ్లుఐడిసి ఇంజినీరింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రత్యేక ఓటర్ సవరణ కార్యక్రమం పకడ్బందీగా నిర్వహించాలి



**విశ్వంభర భూపాలపల్లి:** ప్రత్యేక ఓటరు సవరణ కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని రాష్ట్ర ఉప ఎన్నికల ప్రధాన అధికారి హరిసింగ్ తెలిపారు. గురువారం ఐడిఓసి కార్యాలయంలో జిల్లా మరియు భూపాలపల్లి నియోజకవర్గ సహాయ ఎన్నికల రిటర్నింగ్ అధికారులు, బూతుస్థాయి ఆధికారులతో ప్రత్యేక ఓటరు సవరణ కార్యక్రమంపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనవరి 1, 2025 నాటికి 18 సంవత్సరాలు నిండే ప్రతి ఒక్కరూ నూతన ఓటరుగా నమోదు చేయడానికి ఇంటింటి సర్వే ప్రక్రియ పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమంలో నూతన ఓటరు నమోదు, ఓటరు చిరునామాలో మార్పులు, చేర్పులు, పోలింగ్ కేంద్రాలు మార్పుకు అవకాశం ఉందని తెలిపారు. ఈ నెల 26వ తేదీ వరకు ఇంటింటి సర్వే ప్రక్రియ పూర్తి చేయాలని అన్నారు. 1.1.2025 తేదీని ప్రామాణికంగా తీసుకుని నూతన ఓటరు నమోదు, ఓటరు జాభితాలో మార్పులు, చేర్పులు, పోలింగ్ కేంద్రం మార్పు, మరణించిన వ్యక్తుల ఓటు హక్కు తొలగింపు తదితర కార్యక్రమాలు పూర్తి చేయాలని అన్నారు. 19.10.2024 నుండి 28.10.2024 వరకు అన్ని పోలింగ్ కేంద్రాల్లో ఓటరు జాభితా పరిశీలనకు అందుబాటులో ఉంచడం జరుగుతుందని, ప్రతి ఒక్కరూ భాద్యతగా ఓటు ను పరిశీలించి ఏదేని పొరపాట్లు ఉంటే నిర్ణీత ఫారాన్ని సమగ్రంగా పూర్తి చేసి బూతు స్థాయి అధికారులకు అందచేయాలని ఆయన పేర్కొన్నారు. ముసాయిదా ఓటరు జాబితా 29.10.2024 ప్రకటించబడుతుందని, అట్టి ముసాయిదాపై 29.10.2024 నుండి 28.11.2024 వరకు అభ్యంతరాలు స్వీకరిస్తామని వచ్చిన అబ్యంతరాలను 24.12.2024వ తేదీ వరకు పరిష్కరిస్తారని అన్నారు. అభ్యంతరాలు పరిష్కారం తదుపరి 1.1.2025న ముసాయిదా ఓటర్ల జాబితా ప్రచురణ, 6.1.2025 తేదీన తుది ఓటరు జాభితా ప్రకటించడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో భూపాలపల్లి నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి మంగిలాల్, అన్ని మండలాల సహాయ రిటర్నింగ్ అధికారులు, బూతు స్థాయి అధికారులు పాల్గొన్నారు.

## రెండు నెలల్లోనే మూడుసార్లు ముందస్తు అరెస్ట్



**విశ్వంభర,కడ్తాల్:** కాంగ్రెస్ ప్రభుత్వం చెప్పుకుంటున్న ప్రజా పాలనలో రెండు నెలల్లోనే మూడుసార్లు కడ్తాల్ మాజీ జెడ్పిటిసి జర్పుల దశరథ్ ముందస్తుగా అరెస్టు అయ్యారు. గురువారం రుణమాఫీ కానీ రైతులు చలో ప్రజాభవన్ ముట్టడికి పిలుపునిచ్చారు. ఆయనను ముందస్తుగా అరెస్ట్ చేశారు. ఉదయాన్నే పొలానికి వెళ్తున్న సమయంలో కడ్తాల్ పోలీసులు అరెస్టుచేసి పోలీస్ స్టేషన్ తరలించారు. ప్రజాపాలన అంటే ప్రజల తరఫున పోరాడే నాయకులను అరెస్టులుచేయడమేన ప్రశ్నించారు. ముందస్తుగా అరెస్టు చేసిన వారిలో మాజీ వైస్ ఎంపీపీ ఆనంద్,మాజీ సర్పంచులు లక్ష్మీనరసింహ రెడ్డి, మాజీ ఎంపీటీసీ ప్రియా రమేష్,సువాలిపంతు,చందు తదితరులున్నారు.

# పీఆర్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం నూతన కమిటీ ఎన్నిక

## సూర్యాపేట జిల్లా అధ్యక్షునిగా శ్రీధర్‌నాయుడు

**విశ్వంభర చివ్వెంల:** పంచాయతీరాజ్ మినిస్ట్రీయల్ ఉద్యోగుల సంఘం జిల్లా ఎన్నికలు బుధవారం రాత్రి సూర్యాపేట జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ కార్యాలయంలో జరిగాయి. జిల్లా అధ్యక్షునిగా పంతిని శ్రీధర్ నాయుడు(సీనియర్ అసిస్టెంట్ మండల ప్రజా పరిషత్ చివ్వెంల) అసోసియేషన్ ప్రెసిడెంట్ గా ఎం. శ్రీనివాసరావు (జూనియర్ అసిస్టెంట్ ఎంపీపీ చిలుకూరు), జనరల్ సెక్రటరీగా కె.రణధీర్ రెడ్డి (ఎంపీపీ తుంగతుర్తి)లు ఎన్నికయ్యారు. ఎన్నిక అధికారిగా మేళ్లచెరువు మండల పరిషత్ ఆఫీసర్ (ఎం పి ఓ) తిరునగరు గోపి వ్యవహరించారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఏపాల సత్యనారాయణ రెడ్డి జిల్లా ఎన్నిక జిల్లా అధ్యక్ష పదవి కోసం పంతిణి శ్రీధర్ నాయుడు, భాస్కర్, జనరల్ సెక్రటరీ పదవి కోసం నారాయణరెడ్డి, రణధీర్ రెడ్డి, అసోసియేట్ ప్రెసిడెంట్ గా దినేష్, ఎం శ్రీనివాసరావులు బరిలో నిలిచారు. మిగిలిన వైస్ ప్రెసిడెంట్, జాయింట్ సెక్రటరీ, ఆర్గనైజింగ్ సెక్రటరీ, జెసిసి మెంబర్స్, ట్రెజరర్, స్టేట్ కౌన్సిల్ మెంబర్స్ ఏకగ్రీవంగా ఎంపికైనట్లు ఎన్నికల అధికారులు తెలిపారు.ఉపాధ్యక్షులుగా ఎండి యాసిన్, పి.దశరధ, పి.శ్రీకాంత్, ఏ పెదకోటేశ్వరరావు, జాయింట్ సెక్రెటరీ గా రామచంద్రారెడ్డి, జె.వెంకటేశ్వర్లు, ఏ. ఇందిరమ్మ, నవీన్ కుమార్, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా ఎండి హసన్ అలీ, కే. రామకృష్ణ, ఎన్. పిచ్చయ్య, జి. దిలీప్, జెసిసి మెంబర్‌గా ఎస్కే. మోయునుద్దీన్, కోశాధికారిగా కె. నాగాంజనేయులు, స్టేట్ కౌన్సిల్ మెంబర్స్ గా బి భద్రయ్య, జి వరుణ్ కుమార్, జి.ప్రసాద్, విజయ కుమారి లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతన అధ్యక్షునిగా ఎంపికైన పంతిణీ శ్రీధర్ నాయుడు, పంచాయతీరాజ్ ఉద్యోగుల సంఘం నాయకులు సన్మానించారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఏపాల సత్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ నూతన బాడీ పంచాయతీరాజ్ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ రాజ్ మినిస్ట్రీయల్ ఉద్యోగ సంఘం యాదాద్రి భువనగిరి జిల్లా గౌరవ అధ్యక్షులు చంద్రమౌళి, అధ్యక్షులు శ్రీకాంత్ రెడ్డి, స్టేట్ ఈసీ మెంబర్ నాగరాజు నల్గొండ జనరల్ సెక్రెటరీ నరేందర్ రెడ్డి, శ్రీనివాసరెడ్డి సీనియర్ నాయకులు ఎండి ఫసియుద్దీన్, తోట రమేష్ వివిధ మండలాల ఉద్యోగులు పాల్గొన్నారు.



## అక్టోబర్ 22న చలో హైదరాబాద్



**విశ్వంభర, హైదరాబాద్:** బీఆర్‌టీయూ రాష్ట్ర కార్యాలయం లో గురువారం ఆటో జేఏసీ సమావేశం బీఆర్‌టీయూ ఆటో యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు వేముల మారయ్య అధ్యక్షతన జరిగింది.బీ.వెంకటేష్ (ఏఐటీయూసీ), పుప్పాల శ్రీకాంత్ (సీఐటీయూ)ప్రవీణ్ (ఐఎఫ్‌టీయూ), సలీం (యూటీఏడీడబ్ల్యు ఏ) రఫత్ ఆటో యజమానుల అసోసియన్ నాయకులు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ఆటో డ్రైవర్లు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం తెలంగాణ రాష్ట్ర ఆటో జేఏసీ ఆధ్వర్యంలో అక్టోబర్ 22న చలో హైదరాబాద్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గత 10సంవత్సరాల నుండి తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఆటో డ్రైవర్ల సమస్యల పరిష్కారం కాక చాలా ఇబ్బందులకు గురి అవుతున్నారు. నగరంలో ఆటో మీటర్లు చార్జీలు పెంచకపోవడం చాలా బాధాకమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆటో డ్రైవర్లకు సంవత్సరానికి రూ.12వేలు, రవాణా రంగ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చి 8 నెలలు అవుతున్నా ఎ డ్రైవర్ సమస్యలు పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందన్నారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మహాలక్ష్మి పథకం ద్వారా రాష్ట్రంలోని మహిళలకు ఫ్రీబస్సు సౌకర్యం కల్పించడం వలన. ఆటోడ్రైవర్లకు నష్టం జరిగిందన్నారు. పాల్గొన్న నాయకులుశాతం రమేష్ సిటీజనరల్ సెక్రెటరీ రామకృష్ణ సిటీఉపాధ్యక్షులు చంద్రమౌళి ఏటిసి నాయకులు అశోక్ జంగయ్య ఎండ్ అఫ్జల్ పాల్గొన్నారు.

## ఓటర్ల ముసాయిదా జాబితాపై అఖిలపక్ష సమావేశం
## నిర్వహించిన ఎంపిడిఓ రాములు నాయక్



**విశ్వంభర,ఆత్మకూరు(ఎం):** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం)మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఓ రాములు నాయక్ స్థానిక సంస్థల ఎన్నికలపై వార్డుల వారీగా ఓటర్ లిస్ట్ సవరణ కొరకు నిర్వహించిన మండల అఖిలపక్ష సమావేశంలో పాల్గొని అధికారులకు పలు సలహాలు సూచనలు చేసిన ఆత్మకూరు(ఎం)మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు యాస లక్ష్మారెడ్డి, కాంగ్రెసు పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ ముద్దసానీ సిద్దయ్య గౌడ్,బిజెపి మండల పార్టీ అధ్యక్షుడు గజరాజు కాశీనాథ్,సిపిఐ మండల కార్యదర్శి మారపాక వెంకటేశ్వర్లు, వివిధ పార్టీలకు చెందిన నాయకులు మామిడి మోహన్ రెడ్డి,తదితర అఖిల పక్షం నాయకులు పాల్గొన్నారు.

## దసరాలోపు రైతు భరోసా డబ్బులు..!!

**విశ్వంభర, హైదరాబాద్:** దసరాలోపు రైతుభరోసా నిధులు విడుదల చేసేందుకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం సన్నాహాలు చేస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి. శుక్రవారం జరిగే మంత్రివర్గ సమావేశంలో రైతు భరోసా నిధుల పైన ఓ కీలక నిర్ణయం తీసుకోన్నట్లు తెలిసింది. ఎకరానికి 15వేల రూపాయల చొప్పున ఏడాది మొత్తంలో రైతుల ఖాతాలో జమ చేస్తామని కాంగ్రెస్..ఎన్నికల ప్రచారంలో హామీ ఇచ్చింది. ఇప్పుడు ఆ డబ్బులను దసరాలోపు జమచేయాలని అనుకుంటోంది.ప్రస్తుత లెక్కల ప్రకారం 1. 53 కోట్ల ఎకరాలకు 11475 కోట్లు ఖర్చు అవుతుందని రేవంత్ రెడ్డి ప్రభుత్వం అంచనా వేసింది.

## అక్టోబర్ 3 నుండి 8 వరకు ఓపెన్ స్కూల్ పరీక్షలు

**విశ్వంభర భూపాలపల్లి:** భూపాలపల్లి జిల్లాలో తెలంగాణ సార్వత్రిక విద్యా పీఠం ఓపెన్ స్కూల్ పది,ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు అక్టోబర్ 3 నుంచి 8 వరకు నిర్వహించబడునని జిల్లా విద్యా శాఖ అధికారి రాజేందర్ ఒక ప్రకటనలో తెలిపారు.పదవ తరగతి అభ్యాసకులు ఉదయం 9 నుండి 12 వరకు జిల్లా ఉన్నత పాఠశాల భూపాలపల్లి నందు మరియు ఇంటర్ అభ్యాసకులు మధ్యాహ్నం 2:30 నుండి 5:30 వరకు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల జంగేడు నందు హాజరు కావాల్సిందిగా ఆయన తెలిపారు. పరీక్షలకు హాజరు అయ్యే అభ్యాసకులు సంబంధిత పాఠశాల కో ఆర్డినేటర్ నుండి హాల్ టికెట్ తీసుకోవాల్సిందిగా తెలిపారు. ఆక్ట్ 25/1997 అమలులో ఉంటుందని తెలిపారు.

## అమ్మ కోసం కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలి

**విశ్వంభర భూపాలపల్లి:** రాష్ట్ర ప్రభుత్వం గర్భిణీ స్త్రీల కోసం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన అమ్మ కోసం కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని వైద్యాధికారిణి డాక్టర్ నవత సూచించారు. అమ్మ కోసం కార్యక్రమంలో భాగంగా గురువారం ఆమె గర్భిణీ స్త్రీలతో పాటు ఓపి పేషెంట్లకు వైద్య పరీక్షలు నిర్వహించి మెడిసిన్స్ అందజేశారు. అనంతరం ఆమె గర్భిణీ స్త్రీలనుద్దేశించి మాట్లాడారు. స్త్రీలు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రతి గురువారం గర్భిణీ స్త్రీలకు, బాలింతలకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మెడిసిన్స్ అందజేయడం జరుగుతుందన్నారు. రక్తహీనతతో బాధపడుతున్న గర్భిణీ స్త్రీలకు పలు సూచనలు చేసి మెడిసిన్స్ అందజేయడం జరుగుతుందని, గర్భిణీ స్త్రీలు పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు.

## మహేశ్వరి కుటుంబానికి అండగా ఉంటా: వడ్ల నందు



**విశ్వంభర, వికారాబాద్:** వికారాబాద్ జిల్లా బంట్వారం మండల పరిధిలోని సల్బత్తాపూర్ గ్రామానికి చెందిన జి.మహేశ్వరి రెండు కిడ్నీల సమస్యతో సహాయం కోసం వేచి చూడగా, వికారాబాద్ నియోజకవర్గ బిజెపి పార్టీ కోఆర్డినేటర్ "వడ్ల నందు" బీరంగూడ లోని శ్రీ వేద హాస్పిటల్ యాజమాన్యాన్ని సంప్రదించి దాదాపు 10 లక్షల వరకు అయ్యే వైద్య ఖర్చులు 6 లక్షల 50 వేల వరకు తగ్గించి వడ్ల నందు తన వంతుగా లక్ష రూపాయలు, టెస్టులు చేయిస్తాను అని ,ఆ కుటుంబానికి అండగా ఉంటానని హామీ ఇచ్చారు.

# సీఎం కప్ పోటీలను విజయవంతం చేద్దాం

## పోటీల నిర్వహణలో క్రీడా సంఘాల సహకారం అవసరం
## స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి



**విశ్వంభర, హైదరాబాద్:** త్వరలో నిర్వహించబోయే సీఎం కప్ 2024 విజయవంతానికి క్రీడా సంఘాల సహకారం అవసరమని స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ కే శివసేనారెడ్డి అన్నారు. ఎల్ బి స్టేడియంలో తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో క్రీడా సంఘాల ప్రతినిధులతో సీఎం కప్ 2024 సన్నాహక సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ శివసేనారెడ్డి మాట్లాడుతూ, గ్రామీణ యువ క్రీడా ప్రతిభకు ప్రోత్సాహం కల్పించే లక్ష్యంతో,మట్టిలో మాణిక్యాలను గుర్తించే ఉద్దేశంతో చీఫ్ మినిస్టర్ కప్ -2024 పోటీలను నిర్వహించాలని తెలంగాణ క్రీడా ప్రాధికార సంస్థ భావిస్తోందని వివరించారు. నాలుగు అంచెల్లో గ్రామీణ, మండల, జిల్లా , రాష్ట్ర స్థాయిలో ఈ క్రిడా పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఇందుకోసం సాంకేతికంగా, నిర్వహణపరంగా క్రీడా సంఘాల మద్దతు అవసరమని ఆయన అన్నారు. ఎన్నో టోర్నమెంట్లు నిర్వహించిన క్రీడా సంఘాల ప్రతినిధుల, అనుభవజ్ఞుల సలహాలు సూచనలతో ఈ సీఎం కప్ ను విజయవంతం చేద్దామని ఆయన కోరారు. గతంలో మాదిరి కాకుండా మరింత మెరుగ్గా గ్రామీణ యువ క్రీడా ప్రతిభను ప్రోత్సహించే విధంగా ఈ క్రీడోత్సవాలు జరగాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు ఆయన తెలిపారు. సీఎం కప్ నిర్వహణలో పారా క్రీడాంశాలకు కూడా తగిన ప్రాధాన్యత ఇస్తామని, ఇందుకోసం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తామని ఆయన తెలిపారు. గత పది సంవత్సరాల నుండి క్రీడారంగాన్ని పూర్తిగా విస్మరించిన కేసీఆర్ ప్రభుత్వం.. క్రీడా సంఘాల సమస్యలను ఏమాత్రం పట్టించుకోలేదన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దశలవారీగా క్రీడారంగ అభివృద్ధికి పటిష్ఠమైన ప్రణాళికతో ముందుకెళ్లాలని పట్టుదలతో ఉన్నారని తెలిపారు. సంఘాల అన్ని రకాల సమస్యలను పరిష్కరించడానికి తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ సిద్ధంగా ఉందని చైర్మన్ శివసేన రెడ్డి అన్నారు.వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ బాలాదేవి మాట్లాడుతూ, సీఎం కప్ నిర్వహణ విజయవంతానికి వివిధ సంఘాలు ఆయా జిల్లా సంఘాల ప్రతినిధుల ద్వారా కృషి చేయాలని, ఎటువంటి లోటుపాట్లు లేకుండా సక్రమంగా నిర్వహించేందుకు అవసరమైన సూచనలను రాతపూర్వకంగా స్పోర్ట్స్ అథారి టీకి తెలియజేయాలని కోరారు. డిప్యూటీ డైరెక్టర్లు చంద్రారెడ్డి, రవీందర్, తెలంగాణ ఒలింపిక్ అసోసియేషన్ ప్రతినిధులు జగదీశ్వర్ యాదవ్,ప్రేమ్ రాజ్ మహేశ్వర్ వివిధ క్రీడా సంఘాల అధ్యక్ష కార్యదర్శులు పాల్గొన్నారు డిప్యూటీ డైరెక్టర్లు చంద్రారెడ్డి, రవీందర్, తెలంగాణ ఒలంపిక్ అసోసియేషన్ ప్రతినిధులు జగదీశ్వర్ యాదవ్,ప్రేమ్ రాజ్ మహేశ్వర్ వివిధ క్రీడా సంఘాల అధ్యక్ష కార్యదర్శులు పాల్గొన్నారు.

## పాఠశాల పిల్లలకు అవగాహన



**విశ్వంభర, మెట్ పల్లి:** మెట్‌పల్లి మున్సిపల్ పరిధిలో విస్డం గ్రామర్ హైస్కూల్లో మున్సిపల్ కమిషనర్ మోహన్ స్వచ్ఛతాహి సేవ 2024-25 కార్యక్రమంలో భాగంగా పిల్లలతో స్వచ్ఛత పై అవగాహన కల్పిస్తూ తడి చెత్త పొడి చెత్త వేరు చేసి ఇవ్వాలని పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్రతిజ్ఞ చేయించారు. ప్రతిజ్ఞలో భాగంగా నేను సంవత్సరంలో 100 గంటలు, వారంలో రెండు గంటలు పనిచేస్తానని మా వీధులు చుట్టుపక్కల పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకుంటానని పక్క వారికి కూడా తెలియజేస్తానని నాదేశ పరిశుభ్రతలో మావంతు సహాయంగా ముందుకు తీసుకు వెళ్తే సహాయపడతానని చెట్లను మురికి కాలువల్లో గాని రోడ్లపై కానీ వెయ్యనని చుట్టుపక్కల వారి కి కూడా తెలియజేస్తానని స్కూలు పిల్లలతో ప్రతిజ్ఞ చేయించడం జరిగింది మరియు వ్యాసరచన పోటీలు నిర్వహించడం జరిగిందని కమిషనర్ టి మోహన్ తెలిపారు ఈ కార్యక్రమంలో డిఈ నాగేశ్వరరావు. ఇన్చార్జి సానిటరీ ఇన్స్పెక్టర్ రత్నాకర్ హెల్త్ అసిస్టెంట్ ప్రవీణ్ ఎన్విరాన్మెంట్ ఇంజనీర్ విష్ణు నిజాం ముజీబ్ అశోక్ స్కూల్ యాజమాన్యం , విద్యార్థులు పాల్గొన్నారు.

## స్కానింగ్ సెంటర్స్ ఆకస్మిక తనిఖీ

**విశ్వంభర, మహబూబాబాద్:** తొర్రూరులోని ఆసుపత్రులను గురువారం మాతా శిశు సంక్షేమ ప్రోగ్రాం అధికారి డాక్టర్ సారంగం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఆసుపత్రికి వచ్చిన వారి వివరాలు, స్కానింగ్ నిర్వహించిన వారి వివరాలు, పూర్తి ఇంటి పేరు, ఇంటి నెం. చిరునామా, ఖచ్చితంగా నమోదు చేయాలన్నారు. అలాగే ప్రైవేట్ ఆసుపత్రుల వారు అందించే సేవలకు తీసుకునే రుసుమును ధరల పట్టికరూపంలో అందరికీ కనిపించే విధముగా ఆసుపత్రి ఆవరణలో ప్రదర్శించాలని16 ఫామ్ రికార్డులు సక్రమంగా ఉండాలని ప్రతి నెల 5వ తేదీ లోపల జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ కార్యాలయంనకు ఖచ్చితంగా పంపించాలని ఆయన పేర్కొన్నారు. ఎట్టి పరిస్థితిలో లింగ నిర్ధారణ చేయకూడదని, ఎంటిపి నియమకాలకు వ్యతిరేకంగా అబార్షన్‌లు చేయకూడదని అలాగే సాధారణ ప్రసవాలరేటు పెంచాలని అన్నారు. ఆసుపత్రులలో పిల్లలమరణాలు, మాతృ మరణాలు సంభవించినట్లైతే వివరాలను కార్యాలయంలో అందించాలన్నారు. ఆసుపత్రికి వచ్చిన వారికి సాదారణ ప్రసవం గూర్చి ముందు నుండే సలహాలు, కౌన్సిలింగ్ ఇవ్వాలన్నారు. ఈ తనిఖీలో ప్రోగ్రాం అధికారి డాక్టర్ సారంగం, జిల్లా డిప్యూటీ మాస్ మీడియా ఆఫీసర్ ప్రసాద్, అరుణ్‌లు పాల్గొన్నారు.

మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్ జనగామకి విచ్చేసిన సందర్భంగా శాలువాతో సత్కరిస్తూ స్వాగతం పలుకుతున్నబీజేపీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ మహంకాళి హరిశ్చంద్ర గుప్త



## కలెక్టర్ వినతి పత్రం అందజేసిన గ్రామస్థులు



**విశ్వంభర, కేశంపేట:** కేశంపేట మండల పరిధిలో పొమాల్ పల్లి గ్రామ సమీపం నుంచి 765 కెవి హైటెన్షన్ విద్యుత్ లైన్ నిర్మాణం అపాలంటూ పోమాల్‌పల్లి గ్రామస్తులు రంగారెడ్డి జిల్లా కలెక్టర్ శశాంకకు వినతి పత్రం అందజేశారు. మహేశ్వరం నుంచి బీదర్ (కర్ణాటక) వరకు నిర్మి స్తున 765 కెవి హై టెన్షన్ విధ్యుత్ లైన్ మార్కింగ్ మార్చాలని కోరారు.మొదట మార్కింగ్ ఇచ్చి న విధంగానే విద్యుత్ లైన్ నిర్మాణం చేపట్టాలని కోరారు.గ్రామ సమీపంలో నుంచి 100 మీటర్ల అతి సమీపం నుండి విద్యుత్ లైన్ వస్తే గ్రామ విస్తరణకు ప్రమాదం పొంచి ఉందని వివరించారు. ప్రమాదకరమైన విద్యుత్ లైన్‌ను తమ గ్రామానికి దూరంగా వేయాలని కోరారు.ఈ కార్యక్ర మంలో మాజీ సర్పంచ్ కృష్ణయ్య యాదవ్ మాజీ ఉపసర్పంచ్ అనుమగల రమేష్, నాయకులు, భూపాల్ రెడ్డి,నిదురం అంజయ్య,ముత్యాల్ రెడ్డి,కర్ణకోట శ్రీనివాసులు,చేంద్ర రెడ్డి, చంద్రయ్య, కుమ్మరి మహేష్ మరియు పూజారి రవి శర్మ,నర్సింలు,మస్తాన్ వర్మ,దాసరి అంజయ్య, రాఘవేందర్, నీలకంఠ, గ్రామ నాయకులు పాల్గొన్నారు.

## 68వ మండల స్థాయి పాఠశాలల క్రీడాపోటీలు



**విశ్వంభర, ఆత్మకూరు(ఎం):** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం)మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో 68వ మండల స్థాయి(ఎస్జీఎఫ్)పాఠశాలల క్రీడా పోటీలు ఆత్మకూరు(ఎం)మండల నోడల్ ఆఫీసర్ గెజిటెడ్ హెడ్మాస్టర్ మహాదేవ్ రెడ్డి ఆధ్వర్యంలో17,14 సంవత్సరాల బాల బాలికలు మండలంలోని వివిధ పాఠశాలలా నుండి దాదాపుగా 150 మంది విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. పాల్గొన్నవారిలో వారివారి క్రీడా ప్రదర్శనతో కబడ్డీ, ఖో-ఖో, వాలీబాల్, అథ్లెటిక్స్ విభాగలలో అత్యుత్తమ ప్రదర్శన కనబర్చి జిల్లా స్థాయికి ఎంపికలు జరిగాయి. ఇందులో ఎంపికయిన క్రీడాకారులు అక్టోబర్‌లో యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలో జరగబోయే జిల్లా స్థాయి క్రీడాంశాల్లో పాల్గొంటారని ఆత్మకూరు(ఎం)మండల క్రీడా ఇంచార్జి జెట్ట రవీందర్ తెలిపారు.ఈ సందర్భంగా గెజిటెడ్ హెడ్ మాస్టర్ మిరియాల దామోదర్, వ్యాయమ ఉపాధ్యాయులు ఇందిరా ప్రియా, నాగమల్లు, లక్ష్మణ్,మహేష్,నరేష్,రామనుజమ్మ పాల్గొన్నారు.

## సీఎంఆర్ఎఫ్ ఎల్ఓసీ అందజేత

**విశ్వంభర, ఫరూఖ్ నగర్:** ఫరూఖ్ నగర్ మండలంలోని వెలిజర్ల గ్రామానికి చెందిన మట్ట యాదగిరి కు నిమ్స్ ఆసుపత్రి నందు చికిత్స నిమిత్తం ముఖ్య మంత్రి సహాయ నిధి ద్వారా మంజూరు అయిన 1.25 లక్షల ఎల్ఓసి లెటర్‌ను షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అందజేశారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మాజీ ఎంపీటీసీ సభ్యులు వాడ్యాల నర్సింహా రెడ్డి, మాజీ ఉప సర్పంచ్ రాజు, కాంగ్రెస్ నేతలు జాంగారి జంగయ్య, గణేష్ గౌడ్, కాంగ్రెస్ యువ నాయకులు జాంగారి రవి, వర్కింగ్ ప్రెసిడెంట్ మట్ట వెంకటేష్ గౌడ్,పాల్గొన్నారు.

## ఓటర్ల జాబితాలో అభ్యంతరాలు తెలియజేయాలి

**విశ్వంభర, ఆమనగల్లు:** ఆమనగల్లు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల మండల నాయకులు, కార్యదర్శులు గ్రామపంచాయతీ ముసాయిదా ఓటర్ల జాబితా సవరణ పై సమావేశం నిర్వహించారు. వార్డుల వారిగా విభజించిన గ్రామపంచాయతీ ముసాయిదా ఓటర్ల జాబితాను చూపించారు.ఇంకా ఏమైనా సవరణలు, అభ్యంతరాలు ఉన్నచో లిఖిత పూర్వకముగా సంబంధిత పంచాయతీ కార్యదర్శులకు ఈనెల 21వ తేదీ లోపు తెలియజేయాలని సూచించారు. ఈ సమావేశంలో తహసిల్దార్ లలిత, ఎంపీడీవో కుసుమ మాధురి, ఎంపీ ఓ సుజాత వివిధ రాజకీయ పార్టీల మండల అధ్యక్షులు పోనుగోటి అర్జున్ రావు, కృష్ణా నాయక్, వివిధ రాజకీయ పార్టీల నాయకులు , గ్రామ పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## ఏకదంతుని ఆశీస్సులతో గ్రామ ప్రజలు సుభిక్షంగా ఉండాలి
## మాజీ సర్పంచ్ ఉజ్జిని హేమలత నరేందర్ రావు



**విశ్వంభర చింతపల్లి:** చింతపల్లి మండలంలోని గడియ గౌరవం గ్రామంలో అంబేద్కర్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణేష్ నవరాత్రి ఉత్సవాలలో భాగంగా గురువారం నిర్వహించిన గణేష్ నిమజ్జనం కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఉజ్జిని హేమంత-నరేందర్ రావు పాల్గొని మొదట వినాయకునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ గ్రామ ప్రజలందరూ చల్లగా ఉండాలని పాడిపంటలతో సుఖ సంతోషాలతో ఎలాంటి ఆర్థిక నష్టం వాటిల్లకుండా మండల ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని గణేష్ మహారాజ్ ని మనసారా ప్రార్థించినట్లు వారు తెలిపారు. వారి వెంట మాజీ ఎంపిటిసి కంబాలపల్లి స్వాతి యాదయ్య, నాగమల్ల యాదగిరి, గుణమోని కొండల్ యాదవ్, ఆదిరాల కృష్ణయ్య, సైదులు, నరేష్, ప్రభాకర్, చిన్న పెద్దయ్య, శేఖర్, మహేందర్, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ముగిసిన వినాయక నవరాత్రి వేడుకలు



విశ్వంభర, రామన్నపేటఃయాదాద్రి భువనగిరి జిల్లా, రామన్నపేట మండలం, బోగారం గ్రామానికి చెందిన భజరంగ్ యూత్ నిర్వహించిన వినాయక నవరాత్రి ఉత్సవాలలో భాగంగా యువతను ఆదరించి డీజే సౌండ్ బాక్స్ ల దాతగా ముందుకు వచ్చి, సహకరించిన కూనూరు సాయికుమార్ గౌడ్ ను సన్మానించారు. అనంతరం అక్కడ నిర్వహించిన లడ్డు వేలంపాటలో గ్రామానికి చెందిన చిరగోని ఉష - బిట్టు దంపతులు వేలంపాటలో పాల్గొని గ్రామంలోనే అధికమైన అమౌంట్ బ్రేక్ చేసి అత్యధికంగా రూ.33,216/- రూపాయలకు లడ్డూను కైవసం చేసుకున్నారు. భజరంగ్ యూత్ కి పలు రకాలుగా సహకారాలు అందించిన వారందరికీ యూత్ సభ్యులు మండపం పరిధిలో ఘనంగా సన్మానించారు. కనుకు రాము, బోగ అనిల్, తనుకు గిరి, తనుకు శివ, చిరగొని సాయి, బొడ్డుపల్లి నాని, కూనూరు గణేష్, కూనూరు ఉమేష్, బొగబాణు ప్రసాద్, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఆలూర్ గంగారెడ్డి ద్వితీయ వర్ధంతి
## నివాళులు అర్పించిన వినయ్ రెడ్డి

విశ్వంభర,నిజామాబాద్ : దివంగత నేత ఆలూర్ గంగారెడ్డి ద్వితీయ వర్ధంతి సందర్భంగా ఆలూర్ మండల కేంద్రం లో ఏర్పాటు చేసిన ఆయన విగ్రహానికి ఆర్మూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ప్రొద్దుటూరి వినయ్ కుమార్ రెడ్డి పూలమాల వేసి నివాళులు అర్పించారు.ఈ కార్యక్రమంలో ఆర్మూర్ మున్సిపల్ చైర్మన్ వన్నెల్ దేవి లావణ్య అయ్యప్ప శ్రీనివాస్ ,భారతి రెడ్డి ,ఆలూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ముక్కెర విజయ్ ,మాజి సర్పంచ్ మారుతి రెడ్డి ,కౌన్సిలర్లు లిక్కి శంకర్ ,శాల ప్రసాద్ ,ఆకుల రాము ,మల్ల రెడ్డి, మహేష్ పాల్గొన్నారు.

# వ్యతిరేక శక్తులతో చేతులు కలుపుతోన్న హస్తం పార్టీ

- రాహుల్‌గాంధీ అండగా నిలుస్తున్నారు
- పాకిస్థాన్, కాంగ్రెస్ ఒక తాను ముక్కలే
- పాక్ రక్షణ మంత్రి వ్యాఖ్యలపై అమిత్‌షా ఎక్స్ వేదికగా స్పందన



**దిల్లీ:** ఆర్టికల్ 370 పునరుద్ధరణ విషయంలో పాకిస్థాన్ ప్రభుత్వానిది కాంగ్రెస్-నేషనల్ కాన్ఫరెన్స్ కూటమిది ఒకే మాటని పాక్ రక్షణశాఖ మంత్రి ఖావాజా ఆసిఫ్ చేసిన వ్యాఖ్యలపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా స్పందించారు. కాంగ్రెస్ పార్టీ వైఖరి మరోసారి తేటతెల్లమైందని విమర్శించారు. పాకిస్థాన్, కాంగ్రెస్లు ఎప్పుడూ ఒకే గొంతుక వినిపిస్తాయనడానికి ఇదో నిదర్శనమన్నారు. దేశ వ్యతిరేక శక్తులతో హస్తం పార్టీ చేతులు కలుపుతుందని ఆరోపించారు. "ఆర్టికల్ 370, 35ఏల పునరుద్ధరణ విషయంలో పాకిస్థాన్ రక్షణ మంత్రి వ్యాఖ్యలతో కాంగ్రెస్, జేకేఎన్సీ వైఖరి మరోసారి బయటపడింది. పాకిస్థాన్, కాంగ్రెస్‌కు ఒకే విధమైన ఉద్దేశాలు, ఒకే అజెండాలున్నాయని ఈ ప్రకటన మరోసారి స్పష్టం చేసింది. దేశ ప్రజల మనోభావాలు దెబ్బతీస్తూ, భారత వ్యతిరేక శక్తులకు రాహుల్ గాంధీ అండగా నిలుస్తున్నారు. కొన్నేళ్లుగా ఇలాగే వ్యవహరిస్తున్నారు" అని పేర్కొన్నారు. పాకిస్థాన్పై వైమానిక లేదా సర్జికల్ స్ట్రైక్స్ క్కు ఆధారాలు చూపించాలని అడగడం, భారత సైన్యంపై ఆయన అభ్యంతరకర విషయాలు మాట్లాడటం చూస్తుంటే పాకిస్థాన్-కాంగ్రెస్‌ల గొంతుక ఒక్కటేనని అర్థమవుతోందని దుయ్యబట్టారు.

# పాకిస్తాన్‌కు కాంగ్రెస్, నేషనల్ కాన్ఫరెన్స్ వత్తాసు: తరుణ్ ఛుగ్




**శ్రీనగర్:** కాంగ్రెస్ ఎంపీ, లోక్‌సభ విపక్ష నేత రాహుల్ గాంధీ, నేషనల్ కాన్ఫరెన్స్ చీఫ్ ఫరూక్ అబ్దుల్లా పాకిస్తాన్ భాష మాట్లాడుతున్నారని, పాక్ కనుసన్నల్లో నడుస్తున్నారని బీజేపీ ప్రధాన కార్యదర్శి, పార్టీ జమ్ము కశ్మీర్ ఇన్‌చార్జ్ తరుణ్ ఛుగ్ ఆరోపించారు. పాకిస్తాన్ రక్షణ మంత్రి ప్రకటన ఈ విషయం విస్పష్టంగా వెల్లడిస్తున్నదని అన్నారు. పాకిస్తాన్ ట్యూన్స్‌కు వీరు డ్యాన్స్ చేస్తున్నారని మండిపడ్డారు. పాకిస్తాన్ తోలుబొమ్మల్లా నేషనల్ కాన్ఫరెన్స్, కాంగ్రెస్ వ్యవహరిస్తున్నాయని ఆరోపించారు. కాగా, ఆర్టికల్ 370పై కాంగ్రెస్, నేషనల్ కాన్ఫరెన్స్ వైఖరిని పాకిస్తాన్ రక్షణ మంత్రి సమర్థించడం పట్ల ఫరూక్ అబ్దుల్లా స్పందించారు. పాకిస్తాన్ ఏం చెప్పిందనేది తనకు తెలియదని వ్యాఖ్యానించారు. జమ్ము కశ్మీర్‌లోని ఉధంపూర్‌లో ఆయన గురువారం మీడియా ప్రతినిధులతో మాట్లాడారు. తాను పాకిస్తానీ కాదని, భారత పౌరుడినని అన్నారు.జమ్ము కశ్మీర్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాల గురించి ప్రస్తావించగా అక్టోబర్ 8 వరకూ వేచిచూడాలని, అప్పుడు అన్ని విషయాలు స్పష్టమవుతాయని పేర్కొన్నారు. మరోవైపు పాక్ రక్షణ మంత్రి ప్రకటనపై బీజేపీ ప్రతినిధి షెహజాద్ పూనావాలా అభ్యంతరం వ్యక్తం చేశారు. పాకిస్తాన్‌తో కాంగ్రెస్ పార్టీ, నేషనల్ కాన్ఫరెన్స్‌కు ఉన్న సంబంధాన్ని ఏమని పిలుస్తారని ప్రశ్నించారు. కాంగ్రెస్, నేషనల్ కాన్ఫరెన్స్, విపక్ష ఇండియా కూటమి నిత్యం పాకిస్తాన్‌తో చేతులు కలిపేందుకు ఎలా ప్రయత్నిస్తున్నాయో మనం చూస్తున్నామని వ్యాఖ్యానించారు.

# అనూహ్య పేలుళ్లతో వణికిపోతున్న లెబనాన్

### పేజర్లు, వాకీటాకీ పేలుళ్లు.. 32 మంది మృతి, 3 వేల మందికి గాయాలు

**బీరుట్:** అనూహ్య పేలుళ్లతో లెబనాన్‌ను వణికిపోతున్నది. వరుసగా పేజర్లు, వాకీటాకీలు, రేడియోలు పేలిపోతున్నాయి. దీంతో మృతుల సంఖ్య క్రమంగా పెరిగతున్నది. దేశవ్యాప్తంగా రెండు రోజుల్లో ఇప్పటివరకు 32 మంది మరణించగా, 3,250 మంది గాయపడ్డారు. పేజర్లు పేలిన ఘటనలో 12 మంది మృతిచెంగా, వాకీటాకీల పేలుళ్లలో మరో 20 మంది చనిపోయారు. స్మార్ట్‌ఫోన్‌లు, ఇంటర్‌కామ్‌లు, సోలార్ ప్యానళ్లు సైతం పేలిపోతున్నట్టు స్థానికులు చెప్తున్నారు. రాజధాని బీరుట్ సహా తూర్పు, దక్షిణ లెబనాన్‌లోని వేర్వేరు ప్రాంతాల్లో హెజ్బొల్లా సభ్యులే లక్ష్యంగా ఏకకాలంలో ఈ పేలుళ్లు సంభవించాయి. ఇజ్రాయెలే ఈ దాడులకు దిగిందని భావిస్తున్నామని లెబనాన్ ఆరోగ్యశాఖ వెల్లడించింది. ఈ పేలుళ్ల ఘటనలో మరణాల సంఖ్యల మరింత పెరిగే అవకాశం ఉందని చెప్పుకొచ్చారు. ఈ పరిణామాల నేపథ్యంలో మధ్యప్రాచ్యంలో ఉద్రిక్తతలు మరోసారి భగ్గుమన్నారు. కాగా, లెబనాన్‌లో పేలిన వాకీటాకీలు జపాన్‌తో తయ్యారయ్యాయి. వాటిపై ఐకామ్ అని ఉన్నది. ఐకామ్ అనేది రేడియో కమ్యూనికేషన్స్, టెలిఫోన్ల కంపెనీ. అయితే లెబనాన్‌లో పేలిన వాకీటాకీల ఉత్పత్తిని 2014లోనే నిలిపివేశామని ఐకామ్ వెల్లడించింది. పేలుళ్లు జరిగిన టూవే రేడియో పరికరాలపై ఐకామ్ అని ఉన్నట్లు ప్రపంచ మీడియా పేర్కొన్నదని.. వాటిపై తాము దర్యాప్తు జరుతున్నామని ప్రకటించింది. ఈ ఘటన చుట్టూ నిజానిజాలను తేల్చుతామన్నారు. త్వరలో దీనికి సంబంధించిన వివరాలను అందుబాటులో ఉంచుతామని పేర్కొన్నది.



# బీహార్‌లో దారుణం.. దళితుల ఇళ్లకు నిప్పు

- బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుం: సీఎం నితీశ్ కుమార్
- దళితులపై దమనకాండను అడ్డుకోవడంలో డబుల్ ఇంజన్ సర్కార్ వైఫల్యం
- బీహార్‌లో సంఘవిద్రోహ శక్తుల ఆగడాలకు ఎన్డీయే ప్రభుత్వం ఊతమిస్తోంది
- మోడీ మౌనం దాల్చారు
- మండిపడ్డ మల్లిఖార్జున ఖర్గే





**పాట్నా:** అల్లరి మూకలు రెచ్చిపోయాయి. దళితుల ఇళ్లలోకి చొరబడి వారిని కొట్టారు. 20కు పైగా దళితుల ఇళ్లకు నిప్పుపెట్టారు. అగంతకులు తుపాకులతో గాల్లోకి కాల్పులు జరిపినట్లు బాధిత దళిత కుటుంబాలు ఆరోపించాయి. ఈ సంఘటనపై పోలీసులు వెంటనే చర్యలు చేపట్టారు. ప్రధాన నిందితుడితో సహా 15 మందిని అరెస్టు చేశారు. బీహార్‌లోని నవాడా జిల్లాలో ఈ సంఘటన జరిగింది. దళితులు నివసిస్తున్న భూమిపై వివాదం ఉంది. ఈ నేపథ్యంలో బుధవారం రాత్రి కొందరు వ్యక్తులు ఆ ప్రాంతానికి వెళ్లారు. దళితుల ఇళ్లలోకి చొరబడ్డారు. దళిత కుటుంబాలపై దాడులు చేశారు. వారి ఇళ్లకు నిప్పుపెట్టారు. ఆ వ్యక్తులు గాల్లోకి కాల్పులు జరిపారని బాధిత కుటుంబాలు ఆరోపించాయి.కాగా, ఈ విషయం తెలిసిన వెంటనే పోలీసులు, ఫైర్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకున్నారు. మంటలను ఆర్పివేశారు. 21 దళితుల ఇళ్లు మంటలకు కాలిపోయినట్లు పోలీసులు తెలిపారు. అయితే గాల్లోకి కాల్పులు జరిగాయన్న ఆరోపణలను ఖండించారు. అక్కడ బుల్లెట్ షెల్స్ లభించలేదని అన్నారు. ఈ సంఘటనలో ఎవరూ గాయపడలేదని చెప్పారు. ప్రధాన నిందితుడితో సహా 15 మందిని అరెస్టు చేసినట్లు జిల్లా ఎస్పీ తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా భారీగా పోలీసులను మోహరించినట్లు వెల్లడించారు. మరోవైపు బీహార్ సీఎం నితీశ్ కుమార్ ఈ సంఘటనపై స్పందించారు. సీనియర్ అధికారులతో గురువారం సమావేశం నిర్వహించారు. సంఘటనా స్థలాన్ని సందర్శించి దర్యాప్తును పర్యవేక్షించాలని అదనపు డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (లా అండ్ ఆర్డర్)ను ఆదేశించారు. అలాగే మరింత దర్యాప్తు కోసం ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని (సిట్)ను కూడా ఏర్పాటు చేశారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని, ఎవరినీ విడిచిపెట్టబోమని ఆయన అన్నారు.

**దళితులపై దమనకాండను అడ్డుకోవడంలో డబుల్ ఇంజన్ సర్కార్ వైఫల్యం**

బీహార్‌లోని నవాడ జిల్లాలో దళితులపై జరిగిన హింసను అడ్డుకోవడంలో ఎన్డీయే డబుల్ ఇంజన్ సర్కార్ విఫలమైందని కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున్ ఖర్గే ఆరోపించారు. దళితుల పట్ల బీజేపీ వివక్షను ఈ ఘటన వెల్లడిస్తోందని ఆయన పేర్కొన్నారు. ఓ ఆస్తి వివాదంలో నవాడలోని దళితవాడలో 25 మంది దళితుల ఇండ్లను దగ్ధం చేసిన ఘటనను ఖర్గే ఖండించారు.నవాడలోని దళితవాడలో భయోత్పాతం సృష్టించారు..ఎన్డీయే డబుల్ ఇంజిన్ ప్రభుత్వ ఆటవిక పాలనకు ఇది నిదర్శనమని ఎక్స్‌లో పోస్ట్ చేశారు. దాదాపు 100 దళితుల ఇండ్లకు నిప్పంటించారని, కాల్పులు జరిపారని, అర్ధరాత్రి పేదల ఇండ్లను లూటీ చేశారని ఖర్గే ఆందోళన వ్యక్తం చేశారు. బిహార్‌లో శాంతిభద్రతలను కాపాడటంలో జేడీయూ, బీజేపీతో కూడిన డబుల్ ఇంజిన్ సర్కార్ ఘోరంగా విఫలమైందని దుయ్యబట్టారు.దళితులు, అణగారినవర్గాల ప్రయోజనాలు కాపాడటంలో బీజేపీ దాని మిత్రపక్షాలు నేరపూరిత నిర్లక్ష్యం ప్రదర్శించాయని విమర్శించారు. బిహార్‌లో సంఘవిద్రోహ శక్తుల ఆగడాలకు ఎన్డీయే ప్రభుత్వం ఊతమిస్తోందని ఆరోపించారు. దళితులపై దమనకాండ జరిగినా ప్రధాని మోదీ యధాప్రకారం మౌనం దాల్చారని మండిపడ్డారు. నితీష్ కుమార్ అధికార దాహంతో ఇవేమీ పట్టించుకోరని, ఎన్డీయే భాగస్వామ్య పక్షాలు మౌన ప్రేక్షకుల మాదిరి వ్యవహరిస్తున్నాయని ఖర్గే ఆవేదన వ్యక్తం చేశారు.

# రాహుల్ ఫెయిల్ ప్రొడక్ట్

- మార్కెట్లో విజయవంతం చేసేందుకు కాంగ్రెస్ మెరుగులు దిద్దే ప్రయత్నం
- కాంగ్రెస్ కాపీ..పేస్ట్ పార్టీల మారింది
- ఖర్గే లేఖకు నడ్డా కౌంటర్



**ఢి:** దేశంలోని ప్రధాన పార్టీలైన బీజేపీ, కాంగ్రెస్ పార్టీల జాతీయ అధ్యక్షులు లేఖాస్త్రాలు సంధించుకున్నారు. తమ అగ్రనేత రాహుల్ గాంధీ పై కమలం పార్టీ నేతలు అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఇటీవల ప్రధాని మోదీ కి లేఖ రాశారు. దీనికి గురువారం బీజేపీ అధ్యక్షుడు జేపీనడ్డా కౌంటర్ ఇచ్చారు. రాహుల్ గాంధీని లక్ష్యంగా చేసుకొని బీజేపీ నేతలు అత్యంత అభ్యంతరకర, హింసాత్మక ప్రకటనలు చేస్తున్నారని, వారిని క్షమశిక్షణలో పెట్టాలని కోరుతూ ఖర్గే లేఖ రాశారు. దానికి నడ్డా బదులిస్తూ.. రాహుల్ ఫెయిల్డ్ ప్రొడక్ట్ అని తీవ్ర వ్యాఖ్య చేశారు. ఆ ప్రొడక్ట్ను మార్కెట్లో విజయవంతం చేసేందుకు కాంగ్రెస్ మెరుగులుదిద్దే ప్రయత్నం చేస్తోందని ఎద్దేవా చేశారు. రాహుల్ ఒత్తిడి కారణంగా కాంగ్రెస్ కాపీ పేస్ట్ పార్టీలా మారిందని విమర్శించారు. "మోదీజీపై రాహుల్ గాంధీ తల్లి సోనియాగాంధీ అవమానకర వ్యాఖ్యలు చేయలేదా..? వాటికి మీరు ప్రచారం కల్పించలేదా..? అప్పుడు కాంగ్రెస్ పార్టీ రాజకీయ నైతికతను మర్చిపోయిందా..? మీ నేతలు మోదీని వివిధ పేర్లతో పిలవడమే గాకుండా, ఆయన తల్లిదండ్రుల్ని అవమానించారు" అని ఆ లేఖలో పేర్కొన్నారు. రాహుల్ విదేశాలకు వెళ్లినప్పుడు.. రిజర్వేషన్ల రద్దు గురించి మాట్లాడాడా గుర్తుచేశారు. భారత ప్రజాస్వామ్యాన్ని అత్యంత అవమానానికి గురిచేసింది కాంగ్రెస్సే. "ఆ పార్టీ ఎమర్జెన్సీని విధించింది. రాజ్యాంగ సంస్థల పరువుకు భంగం కలిగించడమే కాకుండా, వాటిని బలహీన పరిచింది" అని ఆగ్రహం వ్యక్తంచేసింది. ఇదిలాఉంటే.. ఇటీవల రాహుల్గాంధీపై శివసేన ఎమ్మెల్యే సంజయ్ గైక్వాడ్ వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన సంగతి తెలిసిందే. భారత్లో రిజర్వేషన్ల వ్యవస్థను తొలగించాలనే ఆలోచనలో ఉన్నట్లు విదేశీ పర్యటనలో ఉండగా రాహుల్ వ్యాఖ్యానించారని, దీన్నిబట్టి కాంగ్రెస్ అసలు రూపం బయటపడిందని గైక్వాడ్ విమర్శించారు. "రాహుల్ వ్యాఖ్యలు ప్రజలకు ద్రోహం చేసేలా ఉన్నాయి. ఓ వైపు మరాఠాలు, ధంగార్లు, ఓబీసీలు రిజర్వేషన్ల కోసం పోరాటం చేస్తుంటే.. దాని ఫలితాలు పొందకముందే వాటిని రద్దు చేసేందుకు కాంగ్రెస్ చూస్తోంది. భాజపా అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్ని మారుస్తుందంటూ విషప్రచారం చేస్తున్న కాంగ్రెస్ పార్టీ.. ఇప్పుడు భారత్ను 400 ఏళ్లు వెనక్కి తీసుకెళ్లేందుకు ప్రణాళికలు రచిస్తోంది" అని ఆయన దుయ్యబట్టారు.

రాహుల్ గాంధీ నాలుకను ఎవరైనా కోస్తే వారికి రూ.11లక్షల రివార్డు అందిస్తానంటూ హద్దు దాటి విమర్శించారు. దీనిపై కాంగ్రెస్ మండిపడింది. మనసంతా ద్వేషం నిండిన సేవకులే అటువంటి వ్యాఖ్యలు చేస్తారని, వారే నిజమైన ఉగ్రవాదులని అభివర్ణించింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షాల ప్రోత్సాహంతోనే వారు అలా వివాదాస్పదంగా మాట్లాడుతుంటారని ఆగ్రహం వ్యక్తంచేసింది. ఈ నేపథ్యంలోనే ఖర్గే లేఖ రాశారు.

# టెలికాం కంపెనీలకు చుక్కెదురు

- ఏజీఆర్ బకాయిలపై పునర్విచారించాలి
- సుప్రీంలో టెలికాం కంపెనీలు పిటిషన్ దాఖలు
- తిరస్కరించిన దేశ అత్యున్నత న్యాయస్థానం



**దిల్లీ:** తమ అడ్జస్టెడ్ గ్రాస్ రెవెన్యూ (ఏజీఆర్)బకాయిలపై సుప్రీం నిర్ణయాన్ని పునర్విచారించాలంటూ టెలికాం కంపెనీలు దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు గురువారం తిరస్కరించింది. వొడాఫోన్ ఐడియా, భారతీ ఎయిర్టెల్ ఇతర కంపెనీలు 2019లో అత్యున్నత న్యాయస్థానం ఇచ్చిన ఆదేశాలపై గతేడాది క్యూరేటివ్ పిటిషన్ దాఖలు చేశాయి. దీనిపై ఓపెన్ కోర్టులో నిర్ణయం ప్రకటించాలని కోరాయి.టెలికామ్ డిపార్ట్మెంట్ (డీవోటీ) ఏజీఆర్ బకాయిల గణనలో భారీ తప్పిదం చోటుచేసుకొందని కంపెనీలు వాదిస్తున్నాయి. తమ పిటిషన్ ను ఓపెన్ కోర్టులో విచారించాలని ఎయిర్టెల్, ఒడాఫోన్ గతేడాది కోర్టును కోరిన విషయం తెలిసిందే. ఈ ఏజీఆర్ చార్జీలు ప్రభుత్వం-కంపెనీలు ఆదాయం పంచుకొనే విధానంలో ఉన్నాయని పేర్కొన్నాయి. దీనికిందే లైసెన్సింగ్ ఫీజులు, స్పెక్ట్రమ్ వినియోగ ఫీజులు చెల్లిస్తాయని వెల్లడించాయి. కానీ, డీవోటీ మాత్రం ఏజీఆర్ శాతాలుగా గణించాయని చెబుతున్నాయి. 2005 నుంచి ఏజీఆర్ అనేది ఇబ్బందికర అంశంగానే ఉన్నట్లు కంపెనీలు చెబుతున్నాయి. తాజాగా దాఖలైన క్యూరేటివ్ పిటిషన్ సీజేఐ డీవై చంద్రచూడ్, జస్టిస్ సంజీవ్ కుమార్, జస్టిస్ బీఆర్ గవయ్లుతో కూడిన ధర్మాసనం వద్ద క్యూరేటివ్ పిటిషన్ లిస్టైంది. కానీ, దీనిని నేడు న్యాయస్థానం తిరస్కరించింది. సాధారణంగా ఇటువంటి పిటిషన్లను న్యాయమూర్తులు ఛాంబర్ లో పరిశీలించి విచారణకు అర్హమైనవో, కాదో నిర్ణయిస్తారు. ప్రత్యేకమైన అభ్యర్థనలు ఉంటే ఓపెన్ కోర్టు విచారణను అనుమతిస్తారని న్యాయ నిపుణులు చెబుతున్నారు. తాజాగా న్యాయస్థానం నిర్ణయం వెలువడటంతో వొడాఫోన్ ఐడియా షేర్లు 10శాతం కుంగాయి.

# మంచులో చిక్కుకున్న సైనికుడు..

### మూడు రోజుల తర్వాత రక్షించిన రెస్క్యూ సిబ్బంది



**దిల్లీ:** భారత్-చైనా సరిహద్దులో గస్తీ నిర్వహిస్తున్న సైనికుడు అదృశ్యమయ్యాడు. అయితే మూడు రోజులుగా మంచులో చిక్కుకున్న అతడ్ని రెస్క్యూ సిబ్బంది కాపాడారు. ఈ విషయం తెలుసుకున్న సైనికుడి కుటుంబం ఊరట చెందింది. బీహార్‌లోని బక్సర్‌కు చెందిన అనిల్ రామ్, ఇండో-టిబెటన్ బోర్డర్ పోలీస్‌లో విధులు నిర్వహిస్తున్నాడు. భారత్-చైనా సరిహద్దులో మున్సియారి నుంచి మిలామ్ వరకు గస్తీ కోసం మోహరించిన బృందంలో అతడు ఉన్నాడు. కాగా, మూడు రోజుల కిందట జవాన్ అనిల్ రామ్, పోర్టర్ దేవేంద్ర సింగ్ అదృశ్యమయ్యారు. ఈ విషయం తెలిసి వారి కుటుంబాలు ఆందోళన చెందాయి. ఈ నేపథ్యంలో రెస్క్యూ టీమ్ రంగంలోకి దిగింది. ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొంటూ ఆ ప్రాంతంలో వెతికింది. మరోవైపు జవాన్ అనిల్, అతడి పోర్టర్ దేవేంద్ర సింగ్, భారీ మంచు కారణంగా దారి తప్పారు. మంచులో చిక్కుకున్న వారిద్దరూ మున్సియారీకి 84 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఒక గుహలో ఆశ్రయం పొందారు. మూడు రోజులుగా ఆ గుహలోనే ఉన్నారు. కాగా, రెస్క్యూ బృందం 36 గంటలపాటు వారి కోసం వెతికింది. ఎట్టకేలకు మూడో రోజు అనిల్, దేవేంద్రలను గుర్తించారు. మంచుతో కప్పి ఉన్న గుహ నుంచి వారిని కాపాడారు. జవాన్ అనిల్‌ను ఉత్తరాఖండ్‌లోని ఆర్మీ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

# ఉక్రెయిన్‌లో భారత తయారీ ఆయుధాలు.. రష్యా అభ్యంతరం

**దిల్లీ:** భారతీయ ఆయుధ కంపెనీలు తయారు చేసే ఆర్టిల్లరీ షెల్స్.. యురోపియన్ కస్టమర్ల నుంచి ఉక్రెయిన్‌కు తరలివెళ్తున్నట్లు ఓ రిపోర్టు రిలీజైంది. అయితే ఆ వాణిజ్యాన్ని భారత్ అడ్డుకోవడం లేదన్న ఆరోపణలు వస్తున్నాయి. యురోప్ మీదుగా ఉక్రెయిన్‌కు ఆయుధాలు సరఫరా అవుతున్నట్లు రష్యా పేర్కొన్నది. భారత, యురోప్ ప్రభుత్వ ర, రక్షణ అధికారులు ఈ విషయాన్ని ధ్రువీకరించారు. ఏడాది కాలం నుంచి ఉక్రెయిన్‌కు భారత తయారీ షెల్స్ వెళ్తున్నట్లు తెలుస్తోంది. అయితే రెండు సందర్భాల్లో రష్యా అభ్యంతరం వ్యక్తం చేసింది.రష్యా విదేశాంగ మంత్రి సెర్గి లవ్రోవ్‌తో జరిగిన భేటీ సమయంలో ఈ ప్రస్తావన వచ్చినట్లు తెలుస్తోంది. భారత్‌కు చెందిన మందుగుండు సామాగ్రి ఉక్రెయిన్‌కు చేరుకున్న అంశంపై ఓ అంతర్జాతీయ వార్తా సంస్థ ధ్రువీకరిస్తూ కథనాన్ని రాసింది. రష్యా, భారత్‌కు చెందిన రక్షణ, విదేశాంగ మంత్రులు ఇంకా ఈ అంశంపై స్పందించలేదు. ఉక్రెయిన్‌కు ఎటువంటి ఘన ఆర్టిల్లరీ షెల్స్‌ను అమ్మలేదని జనవరిలో విదేశాంగ శాఖ ప్రతిని రణ్‌ధీర్ జైస్వాల్ తెలిపారు.

# తేజస్ తొలి మహిళా ఫైటర్ పైలట్‌గా మోహనాసింగ్

**జోధ్‌పూర్:** భారత ఏవియేషన్ చరిత్రలో స్క్వాడ్రన్ లీడర్ మోహనాసింగ్ తన పేరును చిరస్థాయిగా లిఖించుకున్నారు. దేశీయంగా అభివృద్ధి చేసిన తేలికపాటి యుద్ధ విమానం తేజస్ ఫైటర్ జెట్ స్క్వాడ్రన్ నిర్వహించే ఎలైట్ 18 'ఫ్లయింగ్ బులెట్స్' స్క్వాడ్రన్‌లో తొలి మహిళా ఫైటర్ పైలట్‌గా రికార్డులకెక్కారు. భారత వైమానిక దళంలోని ముగ్గురు మహిళా పైలట్లలో స్క్వాడ్రన్ లీడర్ మోహనాసింగ్ ఒకరు. మిగతా ఇద్దరిలో ఒకరు స్క్వాడ్రన్ లీడర్ భావనాకాంత్ కాగా, మరొకరు స్క్వాడ్రన్ లీడర్ అవనీ చతుర్వేది. ఇటీవలి వరకు ఆమె సుఖోయ్ ఎస్‌యు-30 ఎంకేఐ ఫైటర్ జెట్స్ నడిపారు. ఆ తర్వాత ఆమె గుజరాత్ సెక్టార్‌లోని నలియా ఎయిర్‌బేస్‌లో మోహరించిన ఎల్‌సీఏ స్క్వాడ్రన్‌కు బదిలీ అయ్యారు. 2016లో ప్రభుత్వం మహిళల కోసం ఫైటర్ స్ట్రీమ్‌ను ప్రారంభించిన తర్వాత ఐఏఎఫ్‌లో దాదాపు 20 మంది మహిళా ఫైటర్ పైలట్లు ఉన్నారు.

# టీ20ల్లో ముగిసిన బ్రావో శకం..



**విశ్వంభర (క్రీడా విభాగం):** పొట్టి ఫార్మాట్‌లో వెస్టిండీస్ లెజెండ్ డ్వేన్ బ్రావో శకం ముగిసింది. ఇప్పటికే వన్డేలకు, టెస్టులతో పాటు ఐపీఎల్ నుంచి వైదొలిగిన బ్రావో సొంతగడ్డపై ఫ్రాంఛైజీ క్రికెట్‌లో ఆఖరి మ్యాచ్ ఆడేశాడు. కరీబియన్ ప్రీమియర్ లీగ్ లో ట్రిన్‌బగో నైట్ రైడర్స్ జట్టు తరఫున అతడు చివరిసారి బరిలోకి దిగాడు. ఈ సందర్భంగా జట్టు సభ్యులు 'థ్యాంక్యూ డీజే' అనే పేరు రాసున్న జెర్సీలు ధరించి బ్రావోకు 'గార్డ్ ఆఫ్ హానర్' సమర్పించారు. ఆ ఫొటోలను టీకేఆర్ ఫ్రాంచైజీ ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసింది. సీపీఎల్ సీజన్ ఆరంభానికి ముందే బ్రావో తన వీడ్కోలు నిర్ణయం ప్రకటించిన విషయం తెలిసిందే.కరీబియన్ ప్రీమియర్ లీగ్‌లో బ్రావో ఐదు సార్లు ట్రోఫీ అందుకున్నాడు. అది కూడా ట్రిన్‌బగో నైట్ రైడర్స్ తరఫున అతడు మూడు టైటిళ్లు ముద్దాడాడు. అతడి కెప్టెన్సీలో 2017, 2018లో టీకేఆర్ జట్టును చాంపియన్‌గా అవతరించింది. ఆ తర్వాత పేట్రియాట్స్ జట్టును నడిపించిన బ్రావో 2021లో విజేతగా నిలిపాడు.మళ్లీ 2024లో పాత జట్టు అయిన టీకేఆర్ తరఫున ఆడాడు. 'కరీబియన్ ప్రీమియర్ లీగ్ తొలి ఎడిషన్ నుంచి మా జట్టుతో కొనసాగినందుకు బ్రావోకు కృతజ్ఞతలు. ఈరోజు వరకూ అతడు ఈ లీగ్ ప్రచారం కోసం చేసిన కృషికి వెలకట్టలేం' అని ఆండ్రూ రస్సెల్ వెల్లడించాడు.వెస్టిండీస్ తరఫున రెండు టీ20 వరల్డ్ కప్‌లు గెలుపొందిన బ్రావో ఐపీఎల్‌లో అదరగొట్టాడు. ముంబై ఇండియన్స్, చెన్నై సూపర్ కింగ్స్ ఫ్రాంచైజీలకు ఆడిన అతడు అత్యధిక వికెట్ల వీరుడిగా పేరొందాడు. ఐపీఎల్‌లో ఈ వెటరన్ ఆల్‌రౌండర్ 161 మ్యాచ్‌లు ఆడి 183 వికెట్లు తీశాడు. బ్యాటుతోనూ విధ్వంస సృష్టిస్తూ 1,560 రన్స్ చేశాడు. ఈ లీగ్‌లో అతను 5 అర్థ సెంచరీలు ఉన్నాయి. తన సుదీర్ఘ ఐపీఎల్ కెరీర్‌కు బ్రావో 2023లో వీడ్కోలు పలికి బౌలింగ్ కోచ్‌గా అవతారమెత్తాడు. ప్రస్తుతం బ్రావో అఫ్గనిస్థాన్ జట్టుకు అమూల్యమైన సేవలు అందిస్తున్నాడు.



# అశ్విన్ అజేయ శతకం

## చెలరేగిన రవీంద్ర జడేజా.. పటిష్ఠ స్థితిలో భారత్

**విశ్వంభర (క్రీడావిభాగం):** టీ20 వరల్డ్ కప్ తర్వాత స్వదేశంలో తొలి సిరీస్‌లో భారత జట్టు మొదట్లో తడబడినా ఆఖరికి నిలబడింది. పాకిస్థాన్‌పై టెస్టు సిరీస్ విజయోత్సాహాన్ని కొనసాగించిన బంగ్లా భారత్‌ను ఆదిలో ఇరుకున పెట్టింది. పేసర్ హసన్ హహమూద్ (4/58) ధాటికి టాపార్డర్ విఫలమైనా యశస్వీ జైస్వాల్(56) మెరుపులతో కోలుకుంది. ఇక మిడిలార్డర్‌లో రవిచంద్రన్ అశ్విన్(102 నాటౌట్), రవీంద్ర జడేజా(85నాటౌట్)ల ఎదురు దాడితో బంగ్లాదేశ్ కుదేలైంది. రెండో సెషన్ నుంచి మొదలైన టీమిండియా ఆధిపత్యం ఆఖరి సెషన్‌లో తారా స్థాయికి చేరింది.అశ్విన్, జడేజాలు దూకుడే మంత్రగా చెలరేగడంతో బంగ్లా బౌలర్లు, ఫీల్డర్లు బిక్కమొహాలు వేశారు. ఈ ఇద్దరూ ఏడో వికెట్‌కు 195 పరుగుల భాగస్వామ్యంతో రోహిత్ సేన పటిష్ఠ స్థితిలో నిలిచింది. తొలి రోజు ఆట ముగిసే సరికి టీమిండియా స్కోర్.. 339/6. రెండో రోజు కూడా వీళ్లు ఇదే తరహాలో ఆడితే బంగ్లాకు కష్టకాలమే.

### అశ్విన్ అజేయ శతకం..


**భారత సీనియర్ ఆల్‌రౌండర్ రవిచంద్రన్ అశ్విన్(101) టెస్టుల్లో మరోసారి వంద కొట్టేశాడు. అది కూడా సొంత మైదానంలో.. జట్టు పీకల్లోతు కష్టాల్లో ఉన్న సమయంలో అద్భుత సెంచరీతో ఆదుకున్నాడు. చెపాక్ స్టేడియంలో బంగ్లాదేశ్ బౌలర్లకు మూడు చెరువుల నీళ్లు తాగించిన అశ్విన్ టెస్టుల్లో ఆరో శతకం బాదేశాడు. షకీబుల్ హసన్ బౌలింగ్‌లో డబుల్స్, సింగిల్ తీసి అతడు వంద పూర్తి చేసుకున్నాడు. చెపాక్ స్టేడియంలో అశ్విన్ తన మార్క్ ఆటతో రెచ్చిపోయాడు. టాపార్డర్ విఫలైమన చోట సాధికారిక ఇన్నింగ్స్‌తో వారెవ్వా అనిపించాడు. బంగ్లా బౌలర్ల ఎత్తులను చిత్తు చేస్తూ అశ్విన్ కేవలం 108 బంతుల్లోనే శతకగర్జన చేశాడు. ఒకదశలో 144 వద్ద 6 వికెట్లు కోల్పోయిన జట్టును అశ్విన్ తన సెంచరీతో ఆదుకున్నాడు.**


### హసన్ విజృంభణతో..

టాస్ గెలిచిన బంగ్లాదేశ్ కెప్టెన్ నజ్ముల్ హుసేన్ శాంటో భారత్‌ను బ్యాటింగ్‌కు ఆహ్వానించాడు. పిచ్ పేస్‌కు అనూకలించడం బంగ్లా పేసర్లకు వరమైంది. హసన్ హహమూద్(4/58) సూపర్ బౌలింగ్‌తో తొలి సెషన్‌లోనే మూడు కీలక వికెట్లు తీసి టీమిండియాను ఒత్తిడిలోకి నెట్టాడు. అతడి విజృంభణకు రోహిత్ శర్మ(6), శుభ్‌మన్ గిల్(0), విరాట్ కోహ్లీ(6)లు క్రీజులో నిలవలేకపోయారు. ఆ దశలో యశస్వీ జైస్వాల్(56), రిషభ్ పంత్(39) సమయోచితంగా ఆడి స్టోర్ బోర్డును ముందుకు నడిపారు. లంచ్ తర్వాత పంత్ త్వరగానే ఔటయ్యాడు. ఆ తర్వాత కేఎల్ రాహుల్(16) జతగా ఇన్నింగ్స్ నిర్మించిన యశస్వీ అర్ధ శతకంతో ఆకట్టుకున్నాడు.

### స్కోర్ 200 దాటుతుందా?

ప్రమాదకరంగా మారుతున్న యశస్వీని నిషద్ రానా వెనక్కి పంపాడు. ఆ కాసేపటికే రాహుల్ అతడిని అనుసరించాడు. అప్పటికీ 144 పరుగులకే ఆరు వికెట్లు పడ్డాయి. అంతే.. టీమిండియా స్కోర్ 200 అయినా దాటుతుందా? లేదా? అని స్టేడియంలో కూర్చున్న, టీవీల ముందున్న అభిమానుల్లో చిన్న సందేహం. కానీ, ఒత్తిడిలో పలుమార్లు చిరస్మరణీయ ఇన్నింగ్స్‌లు ఆడిన అశ్విన్(102 నాటౌట్), జడేజా(85 నాటౌట్)లు క్రీజులో పాతుకుపోయారు.





# నవంబర్‌లో ఐపీఎల్ మెగా వేలం

**విశ్వంభర (క్రీడావిభాగం):** ఇండియన్ ప్రీమియర్ మెగా వేలంపై నెలకొన్న ఉత్కంఠకు తెరపడింది. ఫ్రాంచైజీలతో పాటు అభిమానులు ఆసక్తిగా ఎదురు ఆక్షన్ తేదీ ఫిక్స్ అయింది. వచ్చే నవంబర్ మూడో వారం లేదా నాలుగో వారంలో వేలం పాటను నిర్వహించేందుకు బీసీసీఐ సిద్ధమవుతోంది. అయితే.. ఈసారి కూడా విదేశాల్లోనే ఆక్షన్ నిర్వహిస్తారనే వార్తలు వినిపిస్తున్నాయి. మధ్య ఆసియా దేశాలైన అబుదాబీ, సౌదీ అరేబియాలో వేలం జరిపేందుకు బీసీసీఐ ఆసక్తి చూపిస్తున్నట్టు సమాచారం. ఐపీఎల్ వేలం నిర్వహణకు ఈ దేశాలు కూడా సుముఖంగా ఉన్నట్టు తెలుస్తోంది. అయితే.. అధికారిక ప్రకటన వస్తేగానీ తేదీ, వేదికపై పూర్తిగా స్పష్టత రానుంది. 17వ సీజన్ మినీ వేలాన్ని దుబాయ్‌లోని కొకకోలా ఎరెనాలో జరిపారు. ఆద్యంతం ఆసక్తిగా సాగిన ఈ వేలంలో ఆస్ట్రేలియా పేసర్ మిచెల్ స్టార్క్ అత్యధికంగా రూ.24.75 కోట్లు పలికిన విషయం తెలిసిందే.

### రిటెన్షన్‌పై అప్పుడే..?

ఐపీఎల్ మెగా వేలం తేదీ అయితే వచ్చింది గానీ.. రిటెన్షన్ విషయంపై ఇంకా ఊహాగానాలు కొనసాగుతూనే ఉన్నాయి. అయితే.. కనీసం ఈసారి 4 -5 మందిని అట్టిపెట్టుకునే అవకాశం ఇస్తారని ఫ్రాంచైజీలు భావిస్తున్నాయి. వేలం జరగడానికి ముందు అంటే.. నవంబర్‌లోనే రిటెన్షన్ పాలసీపై బీసీసీఐ ప్రకటన వెల్లడించే అవకాశం ఉందని విశ్వసనీయ వర్గాలు చెబుతున్నాయి.

### జేసన్ రాయ్, హ్యారీ బ్రూక్

అంతేకాదు వేలంలో అమ్ముడైన తర్వాత హ్యాండిచ్చిన విదేశీ ఆటగాళ్లపై రెండేండ్ల నిషేధంపై కూడా అప్పుడే క్లారిటీ రానుంది. హ్యారీ బ్రూక్ , మిచెల్ మార్ష్, జేసన్ రాయ్, ఆడం జంపా, మార్క్ వుడ్‌లు వంటి ఫారెన్ క్రికెటర్లు 17వ సీజన్ మినీ వేలంలో భారీ ధర పలికారు. కానీ, తీరా టోర్నీ ఆరంభానికి ముందు మేము రావడం లేదంటూ ఫ్రాంచైజీలకు షాకిచ్చారు. అందుకని వీళ్లు మళ్లీ వేలంలో పాల్గొనకుండా రెండేండ్లు నిషేధం విధించాలని పలు ఫ్రాంచైజీలు బీసీసీఐకి మొర పెట్టుకున్నది విదితమే.

# మహిళా క్రికెటర్ పట్ల అసభ్యంగా ప్రవర్తించిన హెడ్‌కోచ్

## 20 ఏండ్ల నిషేధం విధించిన ఆస్ట్రేలియా

**విశ్వంభర (క్రీడావిభాగం):** మహిళా క్రికెటర్ పట్ల అసభ్యంగా ప్రవర్తించిన హెడ్‌కోచ్ దులీప్ సమరవీర భారీ మూల్యం చెల్లించుకున్నాడు. అతడి తీరును తీవ్రంగా తప్పుపట్టిన ఆస్ట్రేలియా క్రికెట్ 20 ఏండ్ల పాటు నిషేధం విధించింది. మహిళా క్రికెటర్ పట్ల అసభ్యకర ప్రవర్తన కారణంగానే అతడిపై వేటు వేసినట్టు ఆసీస్ బోర్డు తెలిపింది.ఇకపై తమ బోర్డుకు సంబంధించిన బిగ్‌బాష్ లీగ్‌లో కూడా ఏ పదవి చేపట్టకుండా దులీప్‌పై ఈ కఠిన నిర్ణయం తీసుకున్నట్టు ఆసీస్ బోర్డు వెల్లడించింది. 'దులీప్ సమరవీరపై 20 ఏండ్ల నిషేధం విధిస్తూ క్రమశిక్షణ కమిటీ తీసుకున్న నిర్ణయాన్ని మేము స్వాగతిస్తున్నాం. అతడిపై ఫిర్యాదు చేసిన బాధిత క్రికెటర్ ధైర్యాన్ని అభినందిస్తున్నాం అని క్రికెట్ విక్టోరియా చీఫ్ నిక్ కమిన్స్ ఓ ప్రకటనలో అన్నాడు.దులీప్ ఈ ఏడాది మే నెలలో విక్టోరియా మహిళల జట్టు హెడ్‌కోచ్‌గా నియమితులయ్యాడు. కోచ్‌గా ఆటలో మెలకువలు నేర్పాల్సిన అతడు ఓ క్రికెటర్ పట్ల తన వంకర బుద్ధి చూపించాడు.దాంతో, సదరు మహిళ ఈ విషయాన్ని ఆసీస్ బోర్డు క్రమశిక్షణ కమిటీ దృష్టికి తీసుకెళ్లింది. అంతే.. దులీప్‌ను ఉపేక్షించకూడదనే నిర్ణయానికి వచ్చిన కమిటీ అతడిపై 20 ఏండ్ల నిషేధం విధించింది. 52 ఏండ్ల దులీప్ లంక తరఫున 7 టెస్టులు, 5 వన్డేలు ఆడారు.

# ఇన్‌స్టాలో బ్యూటీ ఫిల్టర్లకు మెటా గుడ్బై..

విశ్వంభర (బిజినెస్) ఇన్‌స్టాలో ఎక్కువ మంది ఇష్టపడే బ్యూటీ ఫిల్టర్ల విషయంలో మెటా కీలక నిర్ణయం తీసుకుంది. థర్డ్‌పార్టీ ఏఆర్ ఫిల్టర్లకు మంగళం పాడింది. 2025 జనవరి నుంచి తమ యాప్స్ ఈ బ్యూటీ ఫిల్టర్లు అందుబాటులో ఉండవని ప్రకటించింది. దీంతో వాట్సప్, ఫేస్బుక్, ఇన్స్టాలో యూజర్లు రూపొందించిన సుమారు 20 లక్షలకు పైగా ఫిల్టర్లు మాయం కానున్నాయి. ఇటీవల 18 ఏళ్లలోపు వయసు వారికి టీన్ ఖాతాలు ప్రకటించిన ఆ సంస్థ.. తాజాగా బ్యూటీ పిల్టర్లపై నిర్ణయం తీసుకోవడం గమనార్హం. ఇన్స్టాగ్రామ్ ప్రధాన ఫీచర్లలో బ్యూటీ ఫీచర్లు చాలా ప్రాచుర్యం పొందాయి. వ్యక్తులు తమ రూప సౌందర్యం మెరుగుపర్చడానికి వీటిని వాడుతూ ఉంటారు. మెటా స్పార్క్ స్టూడియో ఉపయోగించి యూజర్లు వీటిని రూపొందిస్తుంటారు. అయితే, ఈ బ్యూటీ ఫిల్టర్లు యువతుల మానసిక ఆరోగ్యంపై ప్రభావం చూపుతోందన్న నిర్ధరణకు వచ్చిన మెటా.. వీటికి చరమగీతం పాడాలని నిర్ణయించింది. అయితే, ఇన్స్టా తాజా నిర్ణయంతో ఉన్నట్లుండి ఇన్స్టాలో ఫిల్టర్లన్నీ మాయమైపోవు. మెటా అందించే ఫస్ట్ పార్టీ ఫిల్టర్లు యథావిధిగా కొనసాగుతాయి. అయితే, థర్డ్‌పార్టీ ఫిల్టర్లతో పోలిస్తే వీటి సంఖ్య చాలా తక్కువ. సుమారు 140 ఫిల్టర్లు అందుబాటులో ఉన్నాయి. ఇన్స్టాతో పాటు ఇతర యాప్స్ లోనూ ఈ ఫస్ట్ పార్టీ ఫిల్టర్లు కొనసాగుతాయి. వినియోగదారులకు అవసరమైన ఉత్పత్తులపైనే దృష్టిపెట్టాలని మెటా వ్యూహంలో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు కంపెనీ ఓ ప్రకటనలో తెలిపింది. జనవరి వరకు యూజర్లు, క్రియేటర్లు ఈ ఫిల్టర్లను ఉపయోగించుకోవచ్చు.

# జీవిత కాల గరిష్టానికి బంగారం

## రూ.91 వేలకు చేరిన వెండి..!

**విశ్వంభర (బిజినెస్):** యూఎస్ ఫెడ్ రిజర్వ్ వడ్డీరేట్లు తగ్గించడం, పెండ్లిండ్లతోపాటు ఫెస్టివల్ సీజన్ నేపథ్యంలో దేశీయంగా గిరాకీ పెరగడంతో బంగారం ధరలు తాజా జీవిత కాల గరిష్టానికి చేరుకున్నాయి. దేశ రాజధాని ఢిల్లీలో గురువారం తులం బంగారం (24 క్యారట్స్) ధర రూ.100 వృద్ధితో రూ.75,650లకు చేరుకున్నది. మరోవైపు, కిలో వెండి ధర రూ.500 పుంజుకుని రూ.91 వేలు పలికింది. బుధవారం తులం బంగారం (24 క్యారట్స్-99.9 స్వచ్ఛత) ధర రూ.75,500 పలికితే, కిలో వెండి ధర రూ.90,500 వద్ద ముగిసింది. గత ఆరు సెషన్లలో కిలో వెండి ధర రూ.7,200 వృద్ధి చెందింది. గురువారం 99.5 స్వచ్ఛత గల తులం బంగారం ధర రూ.75,300 పలికింది. ఫ్యూచర్స్ మార్కెట్లో సైతం బంగారం, వెండి ధరలు ఆకాశాన్నంటే రీతిలో పైపైకి దూసుకెళ్లాయి. ఎంసీఎక్స్ గోల్డ్ కాంట్రాక్ట్స్ అక్టోబర్ డెలివరీ తులం బంగారం ధర రూ.498 వృద్ధితో రూ.73,553 వద్ద ముగిస్తే, కిలో వెండి-డిసెంబర్ డెలివరీ ధర రూ.2,105 పుంజుకుని రూ.90,404లకు చేరుకున్నది. కరోనా మహమ్మారి ప్రభావం మొదలైనప్పటి నుంచి.. అంటే 2020 తర్వాత యూఎస్ ఫెడ్ రిజర్వ్ కీలక వడ్డీరేట్లు తగ్గించడం ఇదే తొలిసారి. ఈ నిర్ణయంతో మందగమనం నుంచి అమెరికా ఆర్థిక వ్యవస్థ పుంజుకుంటుందని, ద్రవ్యోల్బణం దిగి వస్తుందని అమెరికా ఆర్థికవేత్తలు అంచనా వేస్తున్నారు. కామెక్స్ గోల్డ్ లో ఔన్స్ బంగారం ధర 0.45 శాతం వృద్ధితో 2610.20 డాలర్లతో ఆల్ టైం గరిష్ట స్థాయిని తాకింది. గురువారం ప్రారంభంలో నష్టపోయిన బంగారం ధరలు యూఎస్ డాలర్లు, ట్రెజరీ బాండ్ల ధరల ప్రభావంతో తర్వాత పుంజుకున్నాయని హెచ్డీఎఫ్సీ సెక్యూరిటీస్ కమొడిటీస్ సీనియర్ అనలిస్ట్ సౌమిల్ గాంధీ పేర్కొన్నారు. అంతర్జాతీయ మార్కెట్లో ఔన్స్ వెండి ధర 2.58 శాతం పెరిగి 31.48 డాలర్లు పలికింది. ముమ్మందు అంతర్జాతీయ మార్కెట్లో ఔన్స్ బంగారం ధర రూ.2530 నుంచి 2630 డాలర్లు, ఔన్స్ వెండి ధర 30-32 డాలర్ల మధ్య పలుకుతుందని కోటక్ సెక్యూరిటీస్ ఇంటరెస్ట్ రేట్స్ కమోడిటీ, కరెన్సీ రీసెర్చ్ హెడ్ అనింద్య బెనర్జీ అంచనా వేశారు.

# ఆల్‌టైమ్ హైకి స్టాక్ మార్కెట్లు..

## 84వేల పాయింట్లకు చేరువైన సెన్సెక్స్..

## ఫెడ్ రేట్ల కోత.. రికార్డు గరిష్ఠాలకు సూచీలు



**ముంబయి:** దేశీయ స్టాక్ మార్కెట్లు గురువారం సరికొత్త గరిష్ఠాలను తాకాయి. వడ్డీ రేట్లను 50 బేసిస్ పాయింట్లు తగ్గించాలని అమెరికా సెంట్రల్ బ్యాంక్ ఫెడరల్ రిజర్వ్ నిర్ణయం నేపథ్యంలో మార్కెట్లు లాభాల్లోకి దూసుకెళ్లాయి. ఫెడ్ నిర్ణయం నేపథ్యంలో బెంచ్ మార్క్ సూచీలు భారీగా పెరిగాయి. ప్రారంభంలో 30 షేర్ల సెన్సెక్స్ 700 పాయింట్లకుపైగా పెరిగింది. మరో వైపు నిఫ్టీ సైతం తొలిసారిగా 25,500 పాయింట్ల మార్క్‌ను అధిగమించింది. కిత్రం సెషన్‌తో పోలిస్తే సెన్సెక్స్ 83,359.17 పాయింట్ల వద్ద లాభాల్లో మొదలైంది. అదే ఊపును కొనసాగిస్తూ సెన్సెక్స్ 83,773.61 పాయింట్లకు చేరి ఆల్‌టైమ్ హైకి చేరుకున్నది. అయితే, మధ్యాహ్నం వరకు స్వల్పంగా తగ్గింది.చివరకు 236.57 పాయింట్ల లాభంతో 83,184.80 వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం 25,487.05 పాయింట్ల వద్ద లాభాల్లో మొదలైంది. తొలి సెషన్‌లోనే 25,611.95 పాయింట్ల రికార్డు స్థాయికి చేరింది. చివరకు 38.25 పాయింట్ల లాభంతో 25,415.80 వద్ద స్థిరపడింది. నిఫ్టీలో ఎన్‌టీపీసీ, నెస్లే ఇండియా, టైటాన్ కంపెనీ, కోటక్ మహీంద్రా బ్యాంక్, టాటా కన్స్యూమర్ ప్రొడక్ట్స్ టాప్ గెయినర్స్‌గా నిలిచాయి. బీపీసీఎల్, కోల్ ఇండియా, ఓఎన్‌జీసీ, అదానీ పోర్ట్స్, శ్రీరామ్ ఫైనాన్స్ నష్టపోయాయి. ఆటో, బ్యాంక్, రియల్టీ, ఎఫ్ఎంసీజీ సూచీలు ఒక్కొక్కటి 0.5 శాతం పెరిగాయి. క్యాపిటల్ గూడ్స్, ఐటీ, ఫార్మా, ఆయిల్, గ్యాస్, మీడియా, మెటల్, టెలికాం 0.5-3.5 శాతం క్షీణించాయి. బీఎస్ఈలో మిడ్‌క్యాప్ ఇండెక్స్ 0.4 శాతం, స్మాల్‌క్యాప్ సూచీలు ఒకశాతం వరకు తగ్గాయి. అంతర్జాతీయ మార్కెట్లో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ 74.39 డాలర్లు వద్ద.. బంగారం ఔన్సు 2615 డాలర్ల వద్ద కొనసాగుతోంది.

# ఆ ఉద్యోగి మరణానికి పని ఒత్తిడే కారణమా..

# విచారణ జరపనున్న కేంద్రం

**విశ్వంభర (బిజినెస్):** పని ఒత్తిడి కారణంగా యర్నెస్ట్ అండ్ యంగ్ ఇండియాలో పనిచేస్తున్న 26 ఏళ్ల ఛార్టర్డ్ అకౌంటెంట్ మృతి చెందారంటూ వస్తున్న వార్తలపై కేంద్రం స్పందించింది. జులైలో ప్రాణాలు కోల్పోయిన అన్నా సెబాస్టియన్ పెరియాళి ఉదంతంపై విచారణ జరిపిస్తామని పేర్కొంది. ఆమె మరణానికి దారితీసిన పరిస్థితులపై దర్యాప్తు చేయిస్తామని కేంద్ర కార్మికశాఖ సహాయ మంత్రి శోభా కర్లాంద్లజె పేర్కొన్నారు. అన్నా సెబాస్టియన్ మరణం తనను తీవ్రంగా కలచి వేసిందని, ఆమె కుటుంబానికి న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇస్తూ ఎక్స్ పోస్ట్ చేశారు. యర్నెస్ట్ అండ్ యంగ్ ఇండియా సర్వీసెస్ ప్రైవేటు లిమిటెడ్ లో పనిచేస్తున్న కోచికి చెందిన అన్నా సెబాస్టియన్ ఈ ఏడాది జులై 20న మరణించారు. పుణెలోని సంస్థ కార్యాలయంలో విధుల్లో ఉండగా.. అస్వస్థతకు గురవడంతో తోటి



ఉద్యోగులు ఆస్పత్రికి తీసుకెళ్లిన కాసేపటికే మరణించారు. పని ఒత్తిడే ఆమె మరణానికి కారణమంటూ కుటుంబసభ్యులు ఆరోపిస్తున్నారు. ఈ మేరకు అన్నా సెబాస్టియన్ తల్లి అనితా తాజాగా ఈవై ఇండియా హెడ్కు లేఖ రాశారు. తల్లి లేఖతో ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. దీనిపై భాజపా నేత, కేంద్ర మాజీమంత్రి రాజీవ్ చంద్రశేఖర్ స్పందించారు. ఉద్యోగి తల్లి చేసిన ఆరోపణలపై విచారణ జరపాలని కేంద్రాన్ని కోరారు. దీనిపై శోభ స్పందించారు.

### లేఖలో ఏముంది?

యర్నెస్ట్ సంస్థలో చేరిన నాలుగు నెలలకే తమ కుమార్తె ప్రాణాలు కోల్పోయిందంటూ అగస్టైన్ తన లేఖలో పేర్కొన్నారు. సంస్థలో పని ఒత్తిడి ఆమె ఆరోగ్యాన్ని దెబ్బతీసిందని, ఆమె మరణానికి కారణమైందన్నారు. ఉద్యోగ జీవితంలో ఆమె ఎదుర్కొన్న పరిస్థితులను లేఖలో ప్రస్తావించారు. తన కుమార్తె అంత్యక్రియలకు సంస్థ తరఫున ఎవరూ హాజరుకాకపోవడం మరింత బాధ కలిగించిందన్నారు. సంస్థలో ఇతర ఉద్యోగులకు ఈ పరిస్థితి రాకూడదంటూ తన లేఖలో పేర్కొన్నారు. ఉద్యోగి మరణం తమను తీవ్రంగా బాధించిందని యర్నెస్ట్ సంస్థ అన్నా మృతికి సంతాపంగా ఓ ప్రకటనను జారీ చేసింది. ఆ కుటుంబానికి అండగా ఉంటామని పేర్కొంది. తమ వ్యవస్థలను మెరుగుపరుచుకోవడానికి కృషి చేస్తామని తెలిపింది.

# 108ఎంపీ కెమెరాతో ఆనర్ కొత్త మొబైల్..

**విశ్వంభర(బిజినెస్):** చైనాకు చెందిన మొబైల్ తయారీ కంపెనీ ఆనర్ కొత్త స్మార్ట్‌ఫోన్ను మార్కెట్లోకి తీసుకొచ్చింది. ఆనర్ 200 లైట్ 5జీ పేరిట దీన్ని లాంచ్ చేసింది. 108ఎంపీ కెమెరా, ఏఐ ఫీచర్లతో ఆవిష్కరించిన ఈ మొబైల్ ధర, ఇతర స్పెసిఫికేషన్లపై ఓ లుక్కేయండి. ఆనర్ కొత్త మొబైల్ ఒక వేరియంట్లో మాత్రమే లభిస్తుంది. 8 జీబీ+ 256 జీబీ వేరియంట్ ధర రూ.17,999గా కంపెనీ నిర్ణయించింది. సియాన్ లేక్, మిడ్నైట్ బ్లూ, స్టేరీ బ్లాక్.. రంగుల్లో లభిస్తుంది. సెప్టెంబర్ 27 నుంచి వీటి విక్రయాలు ప్రారభం కానున్నాయి. కంపెనీ అధికారిక వెబ్సైట్, అమెజాన్తో పాటు కంపెనీ మెయిన్ లైన్ స్టోర్లలో కొనుగోలు చేయొచ్చు. ఎస్బీఐ కస్టమర్లకు రూ.2వేల వరకు ఇన్స్టంట్ డిస్కౌంట్ అందించనుంది. అంటే ఈ బ్యాంక్ కస్టమర్లకు రూ.15,999కే ఈ మొబైల్ లభిస్తుందన్నమాట.

# దేవర రికార్డు అడ్వాన్స్ బుకింగ్ కలెక్షన్లు..



## ప్రభాస్ రికార్డు బీట్ చేసిన ఎన్టీఆర్

యంగ్ టైగర్ ఎన్టీఆర్, సెన్సేషనల్ డైరెక్టర్ కొరటాల శివ దర్శకత్వంలో రూపొందిన దేవర చిత్రం విడుదలకు ముందే అడ్వాన్స్ బుకింగ్ విషయంలో రికార్డులు క్రియేట్ చేస్తున్నది. స్వర్గీయ శ్రీదేవి కూతురు జాన్వీ కపూర్ తొలిసారి తెలుగు సినిమా పరిశ్రమలోకి అడుగుపెట్టిన ఈ చిత్రం సెప్టెంబర్ 27వ తేదీన రిలీజ్‌కు ముస్తాబవుతున్నది. ఈ చిత్రం నార్త్ అమెరికాలో ప్రీ సేల్స్ పరంగా మైలురాయిని అధిగమించింది. ఆ వివరాల్లోకి వెళితే..ఎన్టీఆర్ ఆర్ట్స్ ,యువసుధ ఆర్ట్స్ బ్యానర్లపై నందమూరి కళ్యాణ్ రామ్, మిక్కిలినేని సుధాకర్, కొసరాజు హరికృష్ణ కలిసి నిర్మిస్తున్న చిత్రం భారీ బడ్జెట్‌తో రూపొందించారు. ఇక ఈ సినిమాలోని ఆర్టిస్టుల రెమ్యునరేషన్లు, అలాగే సాంకేతిక నిపుణుల పారితోషికం అంతా కలిపి ఈ సినిమాను సుమారుగా 160 కోట్ల రూపాయలతో నిర్మించినట్టు సమాచారం. ఇక ప్రమోషనల్ ఖర్చులతో కలిపి ఈ మూవీ 165 కోట్ల బడ్జెట్ అయిందని ట్రేడ్ వర్గాలు వెల్లడించాయి. దేవర టీజర్, ట్రైలర్, ఇతర ప్రమోషనల్ కంటెంట్‌కు విశేషంగా ఆదరణ లభించడంతో ఈ మూవీపై అంచనాలు ఆకాశాన్ని అంటుతున్నాయి. ఇప్పటికే అభిమానుల్లో, సగటు సినిమా ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఈ క్రమంలో నెల రోజుల కిందటే ఈ సినిమా అడ్వాన్స్ బుకింగ్, అమెరికా, కెనడాలో ప్రారంభం కాగా మంచి స్పందన కనిపించింది. ముంబైలో ఇటీవల జరిగిన ట్రైలర్ ఆవిష్కరణ వేడుకకు ముందే దేవర చిత్రం నార్త్ అమెరికాలో 1 మిలియన్ డాలర్లు అంటే 8.5 కోట్లకుపైగా వసూళ్లను రాబట్టింది. దాంతో ఈ సినిమాపై ప్రేక్షకుల్లో ఉన్న అంచనాలు ఏమిటో చెప్పకనే చెప్పాయి. ఇదిలా ఉండగా, కెనడా, అమెరికాలో అడ్వాన్స్ బుకింగ్‌కు విశేష ఆదరణ లభిస్తున్నది. ఈ చిత్రం రిలీజ్‌కు ఇంకా కొన్ని రోజులు ఉండగానే 2 మిలియన్ డాలర్లు అంటే ఇండియన్ కరెన్సీలో సుమారుగా 17 కోట్ల రూపాయలు వసూలు చేసింది. దాంతో ఎన్టీఆర్ కెరీర్‌లో నాన్నకు ప్రేమతో, అరవింద సమేత, RRR తర్వాత రెండు మిలియన్ డాలర్లు వసూలు చేసిన నాలుగో చిత్రంగా దేవర ఘనతను సాధించింది. ఇదిలా ఉండగా, రిలీజ్‌కు ముందే రెండు మిలియన్ డాలర్లు సాధించే విషయంలో ప్రభాస్‌తో ఎన్టీఆర్ పోటీ పడుతున్నారు. కల్కి చిత్రం, సలార్ అడ్వాన్స్ బుకింగ్ కంటే ఈ సినిమాకు ఎక్కువగా రెస్పాన్స్ కనిపిస్తున్నది. ఓవర్సీస్‌లో దేవర చిత్రం ఎన్టీఆర్ కెరీర్‌లో హయ్యెస్ట్ అడ్వాన్స్ బుకింగ్ సాధించిన చిత్రంగా రికార్డు క్రియేట్ చేయడం గ్యారెంటీగా కనిపిస్తున్నది.

# కెరీర్‌లో మీకిష్టమైన పాత్ర ఏంటి?

## స్టిల్‌ను షేర్ చేస్తూ..

### ఊహించండి అని సమాధానమిచ్చిన శ్రీలీల



టాలీవుడ్‌లో బిజీగా ఉన్న యంగ్ హీరోయిన్లలో టాప్‌లో ఉంటుంది శ్రీలీల . చివరగా మహేశ్ బాబు నటించిన గుంటూరు కారంలో మెరిసిన ఈ భామ ప్రస్తుతం బ్యాక్ టు బ్యాక్ సినిమాలను లైన్‌లో పెట్టింది. ప్రొఫెషనల్‌గా తీరిక లేకుండా ఉన్నప్పటికీ సోషల్ మీడియాలో తన ఫాలోవర్లతో చిట్ చాట్ చేసేందుకు టైం కేటాయిస్తుంటుంది శ్రీలీల. ఈ భామ తాజాగా ఇన్‌స్టాగ్రామ్‌లో క్వశ్చన్-ఆన్సర్స్ సెషన్‌లో పాల్గొన్నది. ఈ సెషన్‌లో ఓ అభిమాని ఈ భామను ఆసక్తికర ప్రశ్న వేశాడు. కెరీర్‌లో ఇప్పటివరకు మీరు పోషించిన పాత్రల్లో మీకు ఎక్కువ ఇష్టమైన పాత్ర ఏది.. అని అడిగాడు. దీనికి శ్రీలీల స్పందిస్తూ సినిమా పేరు చెప్పకుండా.. ముఖంపై గాయమైన ఓ సినిమాలోని స్టిల్‌ను షేర్ చేస్తూ.. ఊహించండి అని సమాధానమిచ్చింది. ఇంకేంటి మరి ఫొటో రూపంలో హింట్ ఇచ్చేయడంతో.. ఈ స్టిల్ భగవంత్ కేసరి సినిమాలోనిదంటూ అప్పుడే క్లారిటీకి వచ్చేశారు మూవీ లవర్స్.భగవంత్ కేసరిలో శ్రీలీల పోషించిన విజ్జి పాత్ర విమర్శకుల ప్రశంసలు అందుకుంది. ఇటీవలే సైమా అవార్డ్స్ 2024లో ఉత్తమ తెలుగు చిత్రంగా పురస్కారం కూడా అందుకుంది భగవంత్ కేసరి. శ్రీలీల ప్రస్తుతం నితిన్‌తో కలిసి రాబిన్ హుడ్, పవన్ కల్యాణ్ ఉస్తాద్ భగత్ సింగ్ చిత్రాల్లో నటిస్తోంది. వీటితోపాటు RT75 ప్రాజెక్ట్‌లో ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది.

# జవాన్ రికార్డ్ బ్రేక్.. హయ్యెస్ట్ గ్రాసర్‌గా శ్రద్ధాకపూర్ స్త్రీ 2

బాలీవుడ్ యాక్టర్లు శ్రద్ధా కపూర్ , రాజ్ కుమార్ రావు నటించిన సీక్వెల్ 'స్త్రీ 2'. అమర్ కౌశిక్ దర్శకత్వం వహించిన ఈ చిత్రం ఆగస్టు 15న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా రిలీజైంది. స్త్రీ 2 ఇప్పటికే ఓపెనింగ్ డేన ఫైటర్, కల్కి 2898 ఏడీ (హిందీ) వసూళ్లను అధిగమించడంతోపాటు ఈ ఏడాది హిందీ సినిమాలో బిగ్గెస్ట్ ఓపెనర్‌గా నిలిచిన విషయం తెలిసిందే.హార్రర్ కామెడీ జోనర్ ప్రాజెక్ట్ బాక్సాఫీస్‌ను షేక్ చేస్తోంది. రెండో వారంలోనే రూ.400 కోట్ల క్లబ్‌లోకి ఎంటరై ఈ ఏడాది అత్యధిక గ్రాస్ సాధించిన సినిమాగా నిలిచి టాక్ ఆఫ్ ది ఇండస్ట్రీగా నిలిచింది. తొలి రోజు నుంచే ఏదో రికార్డుతో వార్తల్లో నిలుస్తున్న స్త్రీ 2 ఏకంగా ఇండియా బాక్సాఫీస్ వద్ద హయ్యెస్ గ్రాస్ సాధించిన హిందీ సినిమాగా నిలిచింది.స్త్రీ 2 ఇప్పటివరకు రూ.586 కోట్లు వసూళ్లు రాబట్టి.. షారుక్ ఖాన్ జవాన్ పేరు మీదున్న (రూ.582 కోట్లు) రికార్డ్‌ను బీట్ చేసింది. హార్రర్ కామెడీ ఎలిమెంట్స్‌తో తెరకెక్కిన ఈ చిత్రాన్ని ప్రేక్షకులు ఏ స్థాయిలో ఎంజాయ్ చేస్తున్నారో తాజా ఫిగర్ చెప్పకనే చెబుతోంది.. ట్రేడ్ అనలిస్టుల ప్రకారం జవాన్ 57 రోజుల్లో పై ఫిగర్‌ను చేరుకుంటే.. స్త్రీ 2 మాత్రం కేవలం 34 రోజుల్లో టాప్ గ్రాసింగ్ ఫిల్మ్‌గా నిలువడం విశేషం. తక్కువ టైంలో స్త్రీ 2 రూ.600 కోట్ల క్లబ్‌లోకి ఎంటరయ్యే దిశగా ముందుకెళ్తూ.. కొత్తగా విడుదల కాబోయే స్టార్ యాక్టర్ల సినిమాలకు పెద్ద టాస్క్‌నే ముందుంచిందని తెగ చర్చించుకుంటున్నారు అభిమానులు.

# స్వయంభు డైరెక్టర్‌తో రవి బస్రూర్


టాలీవుడ్ యాక్టర్ నిఖిల్ సిద్దార్థ నటిస్తోన్న తాజా చిత్రం స్వయంభు . నిఖిల్ తొలి పాన్ ఇండియా సినిమాగా వస్తోన్న Nikhil 20లో మలయాళ బ్యూటీ సంయుక్తామీనన్ ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది. కేజీఎఫ్ చిత్రానికి అదిరిపోయే బీజీఎం అందించిన రవిబస్రూర్ స్వయంభు చిత్రానికి మ్యూజిక్ డైరెక్టర్ అని తెలిసిందే. కాగా చాలా రోజుల తర్వాత స్వయంభు అప్‌డేట్ స్టిల్ రూపంలో బయటకు వచ్చింది. ప్రస్తుతం స్వయంభు మ్యూజిక్ సెషన్స్ కొనసాగుతున్నాయి. రవి బస్రూర్ పాటల రికార్డింగ్ సెషన్‌లో ఉన్నాడు. సరస్వతీ పుత్ర రామజోగయ్య శాస్త్రి, డైరెక్టర్ భరత్ కృష్ణమాచారి, రవి బస్రూర్ కలిసి ఉన్న స్టిల్ ఒకటి నెట్టింట వైరల్ అవుతోంది. ఇప్పటికే కార్తికేయ ఫ్రాంఛైజీతో నార్త్‌లో మంచి ఫేం సంపాదించిన నిఖిల్‌కు రవిబస్రూర్ బాణీలు మరింత ఇమేజ్‌ను తెచ్చిపెట్టే అవకాశాలు పుష్కలంగా కనిపిస్తున్నాయంటున్నారు సినీ జనాలు. ఈ చిత్రానికి భరత్ కృష్ణమాచారి దర్శకత్వం వహిస్తున్నాడు. ఠాగూర్ మధు సమర్పణలో పిక్సెల్ స్టూడియోస్ బ్యానర్‌పై భువన్, శ్రీకర్ తెరకెక్కిస్తున్నారు. ఈ చిత్రాన్ని తెలుగు, తమిళం, హిందీ, మలయాళం, కన్నడ భాషల్లో గ్రాండ్‌గా విడుదల చేస్తున్నారు. స్వయంభులో నిఖిల్ యుద్ధ వీరుడిగా ఇదివరకెన్నడూ కనిపించని సర్‌ప్రైజింగ్ లుక్‌లో మెరువబోతున్నట్టు ఇప్పటివరకు విడుదల చేసిన పోస్టర్లు చెబుతున్నాయి.



## రాంచరణ్ ఆర్‌సీ 16 టీంలోకి

# తంగలాన్ ఆర్టిస్ట్





టాలీవుడ్ స్టార్ హీరో రాంచరణ్ గేమ్ ఛేంజర్ లో నటిస్తున్నాడని తెలిసిందే. ఈ సినిమా విడుదల తేదీపై క్లారిటీ రావాల్సి ఉంది. ఇప్పటికే గేమ్ ఛేంజర్ ఫినిషింగ్ టచ్‌లో ఉంది. కాగా ఈ మూవీ విడుదల కాకముందే ఉప్పెన ఫేం బుచ్చిబాబు సాన దర్శకత్వంలో RC16లో నటిస్తున్నాడు. బ్లాక్ టీ షర్ట్ అండ్ షార్ట్‌లో యెల్లో గ్రీన్ షూ వేసుకున్న చరణ్ ఫిట్‌నెస్ కోచ్ శివోహంతో ఉన్న స్టిల్‌ను షేర్ చేస్తూ.. బీస్ట్ మోడ్ ఆన్.. ఆర్‌సీ 16 లోడింగ్ అంటూ క్యాప్షన్ ఇచ్చాడు. తాజాగా ఆర్‌సీ 16 టీంతో తంగలాన్ కాస్ట్యూమ్ డిజైనర్ ఏగన్ ఏకాంబరం జాయిన్ అయ్యాడు. ఈ విషయాన్ని సోషల్ మీడియా ద్వారా అందరితో షేర్ చేసుకున్నాడు. నేను టాలీవుడ్‌లో పనిచేయడం ఇదే మొదటిసారి.. చాలా కాలంగా ఈ క్షణం కోసమే నేను ఎదురుచూస్తున్నా. ఈ అద్భుతమైన అవకాశం ఇచ్చినందుకు డైరెక్టర్ బుచ్చి బాబు సానకు కృతజ్ఞతలు. రామ్ చరణ్‌తో కలిసి పని చేసే అవకాశం రావడం హ్యాపీగా ఉంది. తెలుగు సినిమాలో కొత్త అవకాశాలను అన్వేషించడానికి.. టాలీవుడ్ సంప్రదాయాల గురించి మరింత తెలుసుకోవడానికి ఇదొక అద్భుతమైన అవకాశం.. అంటూ ఇన్‌స్టాగ్రామ్‌లో రాసుకొచ్చాడు. స్పోర్ట్స్ డ్రామా నేపథ్యంలో రాబోతున్న ఆర్‌సీ 16లో రాంచరణ్ ఉత్తరాంధ్ర మాండలికంలో మాట్లాడనున్నట్టు ఇన్‌సైడ్ టాక్. ఈ మూవీని సుకుమార్ రైటింగ్స్-మైత్రీ మూవీ మేకర్స్ సంయుక్తంగా తెరకెక్కిస్తున్నాయి. ఆర్‌సీ 16 చిత్రానికి ఏఆర్ రెహమాన్ బ్యాక్‌గ్రౌండ్ స్కోర్, మ్యూజిక్ అందిస్తు న్నాడు. బాలీవుడ్ భామ జాన్వీకపూర్ హీరోయిన్‌గా నటిస్తోంది.





ఇపుడు టోటల్ ఇండియన్ సినిమా దగ్గర ఉన్నటువంటి టాప్ మోస్ట్ హీరోయిన్స్ జాబితా తీస్తే అందులో ఖచ్చితంగా కనిపించే పేరు నేషనల్ క్రష్ రష్మికా మందన్నా పేరు కూడా ఉంటుంది. అయితే ఒక టైం లో టాలీవుడ్ మోస్ట్ బిజీగా మారిన హీరోయిన్ గా రష్మికా తక్కువ సినిమాలతోనే స్టార్ స్టేటస్ ని తెచ్చేసుకుంది. పైగా సూపర్ స్టార్ మహేష్ బాబు, ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ ఆ తర్వాత తమిళ్ నుంచి బిగ్ స్టార్ విజయ్ దళపతి లాంటి వారితో నటించే అవకాశాన్ని అనతి కాలంలోనే పట్టేసింది.

అయితే రష్మికా బిజీ లైఫ్ లో పలు భారీ ఆఫర్స్ ని కూడా వదులుకోవాల్సి వచ్చింది. అలా ఆ మధ్య కల్కి 2898 ఎడి లాంటి సెన్సేషనల్ సినిమాలో కూడా ఛాన్స్ మిస్ చేసుకుంది అని టాక్ వచ్చింది. కాగా ఇప్పుడు మరో షాకింగ్ రోల్ ని అయితే రష్మిక మిస్ చేసుకున్నట్టుగా వార్తలు బయటకి వచ్చాయి. రీసెంట్ గా కోలీవుడ్ సినిమా నుంచి వచ్చిన భారీ పాన్ ఇండియా చిత్రం "తంగలాన్" సినిమా లోనే రష్మిక ఒక ఊహించని రోల్ ని చేయాల్సి ఉందట. కానీ డేట్స్ కుదరని కారణంగా ఆమె ఈ సినిమాలో చేయలేకపోయింది అని తెలిసింది. తంగలాన్ లో విక్రమ్ సరసన ఇద్దరు బ్యూటీస్ కనిపించారు. విక్రమ్ సరసన పార్వతి తిరువొత్తు కాగా మరో రోల్ లో బోల్డ్ హీరోయిన్ మాళవిక మోహనన్ నటించింది. అయితే ఈ సినిమాలో విక్రమ్ తో పాటుగా నటి మాళవిక మోహనన్ నటన చూసి అంతా షాక్ అయ్యారు. ఇన్ని రోజులు సింపుల్ గా కనిపించిన మాళవిక ఒక మంత్రగత్తెగా ఊహించని పెర్ఫామెన్స్ ని యాక్షన్ ని కూడా చేసి చూపించింది. మరి ఈ క్లిష్టమైన పాత్రనే రష్మికా మందన్నా వదులుకుందట. నిజానికి దర్శకుడు పా రంజిత్ మాళవిక ప్లేస్ లో మొదట రష్మికా మందన్నానే పర్ఫెక్ట్ గా సెట్టవుతుంది అని ఆమెని అప్రోచ్ అయ్యాడట కానీ రష్మికాకి డేట్స్ కుదరకపోవడం మూలాన మాళవిక లైన్ లోకి వచ్చి తన రోల్ లో అదరగొట్టేసింది. మరి ఇదే రోల్ లో రష్మిక కానీ చేసుంటే ఆ మేకోవర్ కి యాక్షన్ ఈమె కూడా ఫిట్ అవుతుంది అని చెప్పవచ్చు. ఏది ఏమైతేనేం.. ఏ నటుడు లేదా నటి అయినా కూడా తమ కెరీర్లో గుర్తుండిపోయే రోల్ ని చేయాలి అని ఎవరైనా అనుకుంటారు. కానీ అలాంటి రోల్ ని ఇప్పుడు రష్మికా మిస్ చేసుకొని ఒక గోల్డెన్ ఆఫర్ లాంటిది వదులుకుంది. దానిని మాళవిక ఒడిసిపట్టుకుని తన కెరీర్ లో పెర్ఫార్మర్ గా ఒక్క రోల్ ని చూపించమంటే ఈ సినిమాలో రోల్ ని చూపించే విధంగా రక్తి కట్టించింది. ఇక ప్రస్తుతం మాళవిక తన బాలీవుడ్ డెబ్యూ చిత్రం "యుధ్ర" రిలీజ్ పనుల్లో బిజీగా ఉండగా రష్మికా మందన్నా "పుష్ప 2", ధనుష్ తో "కుబేర", బాలీవుడ్ లో సల్మాన్ ఖాన్ తో "సికందర్" లాంటి పలు భారీ సినిమాలతో బిజీగా ఉంది.

## రష్మిక మందన్న గోల్డెన్ ఆఫర్‌ను

# కొట్టేసిన బోల్డ్ బ్యూటీ

## మాళవిక మోహనన్

Edited, Printed, Published & Owned by Dr. KACHAM SATYANARAYANA. Printed at DVM Multi Colour Offset Printers, Dilsukhnagar, Hyderabad - 500060. Telangana. Published at #204, 2nd Floor, Badam Complex, Opp. Metro Pillar No. 1560, Chaitanyapuri X Road, Hyderabad - 500060. Telangana.EDITOR: Dr. KACHAM SATYANARAYANA. Cell: 9441222429 | Email: vishwambhara.daily@gmail.com